www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మధుమేహం, ఊబకాయానికి
కొత్త ఇంజెక్షన్

మార్కెట్లోకి తెచ్చిన ఎలీ లిల్లీ ఇండియా

2.5 ఎంజీ ధర రూ.3,500.. 5 ఎంజీకి రూ.4,375.. వారానికి ఒకటి చాలు

ఇంజెక్షన్‌తో పాటు ఆహార నియంత్రణ, వ్యాయామం తప్పనిసరి 2

శుక్రవారం | 21-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 335 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి తె.4:24 తదుపరి అష్టమి, నక్షత్రం: జ్యేష్ఠ రా.1:46 తదుపరి మూల, వర్జ్యం: శే. ఉ. 7:24, అమృతఘడియలు: సా.4:08-5:53, దుర్ముహూర్తం: ఉ.8:46-9:34, మ.12:46-1:34, రాహుకాలం: ఉ. 10:30-12:00, సూర్యోదయం: 6:21, సూర్యాస్తమయం: 6:22 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో సహచరుడి మృతదేహంతో జవాన్లు

మళ్లీ నెత్తురోడిన దండకారణ్యం

ఛత్తీస్‌గఢ్‌లో 30 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్

బీజాపూర్, కాంకేర్‌లలో వేర్వేరు ఆపరేషన్లు.. గంగలూరు అడవుల్లో 26 మంది మృతి


మృతుల్లో ఎనిమిది మంది మహిళా నక్సల్స్.. డీఆర్‌జీకి చెందిన ఓ కానిస్టేబుల్ కూడా..

అబూజ్‌మఢ్‌లో నలుగురు మావోయిస్టులు మృతి.. ముమ్మరంగా 'ఆపరేషన్ హిడ్మా'..!

చర్ల/చింతూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నెలరోజులపాటు ప్రశాంతంగా ఉన్న దండకారణ్యం గురువారం మరోమారు నెత్తురోడింది. బీజాపూర్‌లోని గంగలూరు, కాంకేర్ జిల్లాలోని అబూజ్‌మఢ్ అడవుల్లో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 30 మంది నక్సలైట్లు, ఒక డీఆర్‌జీ జవాను మృతిచెందారు. చనిపోయిన నక్సల్స్ నుంచి భద్రతాబలగాలు పెద్ద సంఖ్యలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. గంగలూరు డీవీసీఎం సభ్యుడు ఎం.దినేశ్ పోలీసులకు లొంగిపోయిన వారంలోనే భారీ ఎన్‌కౌంటర్లు

మిగతా 2వ పేజీలో...

వచ్చే ఏడాది మార్చి 31కల్లా
నక్సల్స్ రహిత భారత్: అమిత్ షా





హాస్యం పండిస్తున్న జాలకంటి, జీవీ ఆంజనేయులు



ప్రజాప్రతినిధుల సాంస్కృతిక కార్యక్రమాల్లో పేలిన జోకులకు విరగబడి నవ్వుతున్న చంద్రబాబు, పవన్, అయ్యన్న, పయ్యావుల, ఇతర నేతలు

ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్!?

ఉభయ సభల్లో తీర్మానంపై 'హైడ్రామా'

మండలిలో వైసీపీ సహాయ నిరాకరణ

ఎస్సీ వర్గీకరణపై చట్టసభల్లో తీర్మానం చేయకుండా వైసీపీ కుయుక్తులు పన్నింది. మండలిలో తనకున్న బలాన్ని అడ్డుపెట్టుకుని... అసలు వర్గీకరణ ప్రక్రియకే బ్రేకులు వేయాలని భావించింది. కానీ... పాలకపక్షం అప్పటికప్పుడు వ్యూహాత్మకంగా వ్యవహరించింది. 'ఆర్డినెన్స్' ద్వారా ఎస్సీ వర్గీకరణ అమలుకు మార్గం సుగమం చేసింది. దీనిపై సుమారు 24 గంటలపాటు హైడ్రామా నడిచింది.

వైసీపీ కుయుక్తి.. సర్కారు కౌంటర్

తీర్మానానికి చైర్మన్ మోషేన్ రాజు 'నో'!?

నివేదికను తాను చదవాలని పట్టు

చర్చ కూడా జరపకుండా వాయిదా

మండలిలో వైసీపీకే మెజారిటీ

తీర్మానం ఆగిపోతే వర్గీకరణకు బ్రేకులే

దీంతో వ్యూహం మార్చిన పాలక పక్షం

అసెంబ్లీకి నివేదిక సమర్పణ, లఘు చర్చ

సిఫారసుల సారాంశం జాతీయ కమిషన్‌కు!

ప్రోరోగ్ కాగానే ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర మంత్రివర్గం ఇప్పటికే ఆమోదించింది. దీనిని అసెంబ్లీ, శాసనమండలిలో ప్రవేశపెట్టి... తీర్మానం ఆమోదించి కేంద్ర ఎస్సీ కమిషన్ ఆమోదం పొంది పకడ్బందీగా వర్గీకరణ అమలు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. "ఇది చరిత్రాత్మకం అవుతుంది. అసెంబ్లీ తీర్మానాన్ని జాతీయ ఎస్సీ కమిషన్‌కు పంపిద్దాం. కమిషన్

మిగతా 13వ పేజీలో...

వర్గీకరణపై మాట నిలబెట్టుకున్నాం

30 ఏళ్ల కలను నిజం చేశాం.. నా చేతుల మీదుగా చేయడం పూర్వజన్మ సుకృతం

పేదరికం లేని సమాజమే నా లక్ష్యం.. మోదీ, పవన్‌తో కలిసి ఈ దిశగా ముందుకు

కుల వివక్షపై టీడీపీ యుద్ధం చేసింది.. అసెంబ్లీలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

అందరికీ సమాన అవకాశాలు లభించాలి

ఎస్సీ వర్గీకరణ రూపకర్త చంద్రబాబు.. ప్రక్రియకు జనసేన మద్దతు ఇస్తోంది

అసెంబ్లీ చర్చలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు 13

జిల్లా యూనిట్‌గా వర్గీకరణ.. అలా చేస్తేనే సమన్యాయం.. చర్చలో ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యే రుబాబు!

విచక్షణ మరిచి నోటి దురుసు

రెవెన్యూ సీనియర్ అధికారులపై అసెంబ్లీ ఆవరణలో చిందులు

కబ్జా క్రమబద్ధీకరణ కోసం ఒత్తిళ్లు

కుదరదని చెప్పడంతో ఆక్రోశం

5 నిమిషాలు ఆగకుండా దూషణలు

అడ్డుకున్న మంత్రిపైనా అదే దూకుడు

గట్టిగా చురకలు అంటించిన మంత్రి

ఎమ్మెల్యేపై సీఎంకు నిఘా సమాచారం

మంత్రిని పిలిపించి ఆరా తీసిన సీఎం

'నేను చెప్పింది చేయాల్సిందే! ప్రభుత్వ స్థలాన్ని అడ్డగోలుగా ఆక్రమించుకుని... భారీ భవంతిని నిర్మించుకున్నా సరే! దానిని క్రమబద్ధీకరించాల్సిందే!'... ఇదీ ఆ ఎమ్మెల్యే తీరు! అలా కుదరదని చెప్పినందుకు... ఆయన రెచ్చిపోయారు. అసెంబ్లీలోనే ఇద్దరు సీనియర్ రెవెన్యూ అధికారులపై గొడవకు దిగారు. 'నా మాటే వినరా? నా పనులు చేయరా?' అంటూ దూషించారు. 'ఇది సరైన పద్ధతి కాదు' అని నిలువరించబోయిన ఒక కీలక మంత్రిపైనా ఆ ఎమ్మెల్యే నోరుపారేసుకున్నారు. విజయవాడ నగరంలో కేంద్రీకృతంగా సొంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్న ఆ ఎమ్మెల్యే వైఖరితో... సీనియర్ అధికారి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. గురువారం శాసనసభ వైపు కూడా రాలేదు. కార్యాలయానికీ వెళ్లలేదు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

పేదల ఆక్రమణలో ఉన్న 150 గజాల వరకు ఇంటి స్థలాలను ఉచితంగా క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతకుమించితే... నిర్ణీత ధర వసూలు చేయాలని తీర్మానించింది. అందులోనూ... అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను మాత్రమే క్రమబద్ధీకరిస్తామని రెవెన్యూశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. కాలువలు, చెరువు గట్లు, కాలువ గట్లు, డిఫెన్స్ పరిధిలోకి వచ్చే భూముల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నా క్రమబద్ధీకరించడం కుదరదని స్పష్టంగా చెప్పింది. అయితే, విజయవాడ నగరానికి చెందిన ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గం పరిధిలోని కాలువలు, గట్లు, ఇంకా రహదారులపై నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని తన పీఏ ద్వారా కొన్ని దరఖాస్తులు పంపించారు. అందులో... ముగ్గురు వ్యక్తులకు సంబంధించిన స్థలమూ ఉంది. ఆ ముగ్గురూ.. సగటున 300 గజాల చొప్పున మొత్తం 900 గజాల్లో ఒక భారీ భవనం నిర్మించుకున్నారు. దాన్ని కూడా క్రమబద్ధీకరించాలన్నది ఆ ఎమ్మెల్యే ప్రయత్నం. ఇది నిబంధనలకు

మిగతా 2వ పేజీలో...



రాజపాళయం ఆలయ పరకామణిలో

గోల్‌మాల్!

విదేశీ కరెన్సీ లెక్క చెప్పకుండానే టీటీడీకి రికార్డులు

తర్వాత కొన్నాళ్లకు విదేశీ కరెన్సీ అప్పగింత

చెన్నై టీటీడీ సిబ్బంది నిర్వాకం

మొత్తం అప్పగించారా? చేతివాటం ప్రదర్శించారా?

(చెన్నై-ఆంధ్రజ్యోతి)

చెన్నైలో టీటీడీకి చెందిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ సిబ్బంది తీరు రోజురోజుకు వివాదాస్పదమవుతోంది. ఇప్పటికే ఆలయంలో విక్రయించాల్సిన లడ్డూలను కొందరు సిబ్బంది వీఐపీల ఇళ్లకు తీసుకెళ్లి పంచుతున్నారని ఆరోపణలు ఉండగా, తాజాగా విదేశీ కరెన్సీ వ్యవహారంలో చేతివాటం ప్రదర్శించడం వెలుగులోకి వచ్చింది. శ్రీవారి ఆలయ హుండీల్లో వచ్చే కానుకల లెక్కింపు.. భక్తుల రద్దీని బట్టి ఒక్కోచోట ఒక్కో విధంగా ఉంటుంది. హుండీలోని భారత కరెన్సీ, ఇతర కానుకలను లెక్కించే సిబ్బంది, విదేశీ కరెన్సీని మాత్రం మళ్లీ హుండీలోనే వేస్తారు. ఎక్కువ మొత్తం విదేశీ కరెన్సీ పోగయ్యాక, టీటీడీ

మిగతా 3వ పేజీలో...

సారు.. దోచిపెట్టారు

జగన్ పత్రికకు 574 కోట్లు సమర్పయామి.. నిగ్గుతేల్చిన విజిలెన్స్

కేంద్ర సర్వీసులోని ఐఐఎస్‌కు చెందిన తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి గత వైసీపీ ప్రభుత్వంలో 2019-2024 మధ్య రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్‌గా పనిచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా ప్రకటనలు ఇవ్వాలన్న కనీస నియమాన్ని విస్మరించారు. అడ్డగోలుగా జగన్ రోత పత్రికకు ప్రభుత్వ సొమ్ము దోచిపెట్టారు.

గత ఐదేళ్లలో ప్రచారానికి ప్రకటనల రూపంలో జగన్ ప్రభుత్వం చేసిన మొత్తం ఖర్చు రూ.859 కోట్లు. ఇందులో అత్యధికంగా 43 శాతం (రూ.371 కోట్లు) జగన్ మీడియాకే సమర్పించేశారు.

■ సాక్షి కొనుగోలుకు 203 కోట్లు

జగన్ పత్రిక మార్కెటింగ్ బాధ్యతలు కూడా విజయ్ కుమార్ రెడ్డి తీసుకున్నారు. గ్రామ వలంటీర్లు సాక్షి కొనుగోలు చేయడానికి పత్రిక చందా కింద నెలనెలా 200 రూపాయలు విడుదల చేశారు. వలంటీర్లకు ఇలా మొత్తం రూ.143.64 కోట్లు ఇచ్చారు. అధికారులకు కూడా పత్రిక చందా కింద మరో రూ.59.42 కోట్లు ఖర్చు చేశారు. ఈ సొమ్మంతా జగన్ పత్రికకు చేరింది.



ఐదేళ్లలో మొత్తం ప్రకటనల ఖర్చు 859 కోట్లు

ఇందులో రోత మీడియాకే 371 కోట్లు

పత్రిక కొనుగోలు ద్వారా మరో 203 కోట్లు

వలంటీర్లు, ఉద్యోగులకు చందాతో మళ్లింపు

విజిలెన్స్ విచారణలో అక్రమాలు వెలుగులోకి

అడ్డంగా దొరికిన నాటి సమాచార కమిషనర్

విజయ్‌కుమార్‌పై ఏసీబీ కేసు.. విచారణకు పిలుపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత జగన్ ప్రభుత్వంలో ఏ వనరులూ, మార్గాలూ వదలకుండా దోచుకున్నారు. మద్యం, ఇసుక, గనుల్లో వేల కోట్లు దోపిడీ చేసినట్లు ఆరోపణలు రాగా, జగన్ పత్రికకు ప్రజల సొమ్ము వందల కోట్లు పంచిపెట్టారు. ప్రకటనల రూపంలో రూ.371 కోట్లు, పత్రిక కొనుగోలుకు చందా కింద మరో 203 కోట్లు సమర్పించినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. దోచిపెట్టడంలో కీలక సూత్రధారి నాటి సమాచార శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి. నిబంధనలు ఉల్లంఘించి మరీ అయాచిత లబ్ధి చేకూర్చినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. సమాచార శాఖను అడ్డు పెట్టుకుని జగన్ మీడియా సాగించిన విచ్చలవిడి దోపిడీ బట్టబయలైంది. అడ్డగోలుగా వ్యవహరించిన విజయ్‌కుమార్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. గత ప్రభుత్వంలో ఐదేళ్ల సాగించిన దోపిడీపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక

మిగతా 14వ పేజీలో...



దొంగల్లా వచ్చి వెళ్తున్నారు!

వైసీపీ ఎమ్మెల్యేలపై స్పీకర్ ఆగ్రహం

హాజరుపట్టికలో దొంగతనంగా

సంతకాలు పెట్టాల్సిన కర్మ ఏంటి?

సభకు ముఖం చాటేస్తారా?

ప్రశ్నలు వేస్తున్నారు.. అసెంబ్లీకి రావడం లేదు

ఎన్నుకున్న ప్రజలకు ఆదర్శప్రాయంగా నిలవాలి

ఓట్లేసినవారికి తలవంపులు తేవొద్దు

స్పీకర్ అయ్యన్నపాత్రుడి హితవు 13

15 రోజులు.. 86 గంటలు

ఫలప్రదంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఉభయ సభల్లో 9 బిల్లులకు ఆమోదం 12

ఆర్ట్స్ విద్యార్థికి 1.3 కోట్ల ప్యాకేజీ

భారీ జాక్‌పాట్ కొట్టిన శ్రీకాకుళం వాసి

చదివింది ఏయూలో ఎంహెచ్ఆర్ఎం

పోలాండ్ కంపెనీకి హెచ్ఆర్ అసిస్టెంట్‌గా ఎంపిక



హనుమంతు సింహాచలం 12

తారలపై కేసులు

బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారంలో కీలక మలుపు

రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి సహా 25 మంది సినీ, టీవీ ప్రముఖులపై ఎఫ్ఐఆర్

తెలియక చేశా.. తప్పు తెలుసుకుని ఆపేశా: ప్రకాశ్‌రాజ్

నైపుణ్య ఆధారిత ఆటలకే ప్రచారం: విజయ్ దేవరకొండ టీమ్

చట్టబద్ధమైన యాప్‌లకే ప్రమోషన్.. రానా బృందం వివరణ



2



12

ఉద్యోగుల బకాయిలు 6,200 కోట్లు చెల్లించండి

ఆర్థిక శాఖకు చంద్రబాబు ఆదేశం

గత ప్రభుత్వంలో పెండింగ్

అరెస్టు నుంచి రక్షణ కుదరదు

మద్యం కుంభకోణం కేసులో

వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి 14

అభ్యర్థనను తోసిపుచ్చిన హైకోర్టు

3 రోజులు పోలీసు కస్టడీకి వంశీ

బ్యాడ్ అంబాసిడర్లు!

» రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి సహా 25 మంది సినీ, టీవీ ప్రముఖులపై కేసు

హైదరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, క్యాసినో యాప్‌ల ప్రచారానికి సంబంధించి.. సినీ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి, నిధి, అగర్వాల్, ప్రణీత, అనన్య నాగళ్ల సహా 25 మంది సినీ, టీవీ ప్రముఖులపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మియాపూర్‌కు చెందిన ఫణీంద్ర శర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వీరిపై భారతీయ న్యాయసంహితలోని సెక్షన్ 318(4), 112 రెడ్ విత్ 49, తెలంగాణ స్టేట్ గేమింగ్ యాక్ట్‌లోని 3, 3(ఏ), 4 సెక్షన్లు, ఐటీ చట్టంలోని 66(డీ) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. సినీ ప్రముఖులు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఈ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారని.. వారిని అభిమానించే యువత వారి మాటలు నమ్మి ఈ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయారని, ఇంతమంది నష్టపోవడానికి కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫణీంద్ర శర్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బెట్టింగ్‌యాప్‌ల వల్ల అనేకమంది పలు విధాల నష్టపోయారని.. ఆర్థిక ఇబ్బందుల పాలై ఆత్మహత్యాయత్నం కూడా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సినీ ప్రముఖులతోపాటు.. వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల, బుల్లితెర ప్రముఖులు శ్రీముఖి, విష్ణుప్రియ, శోభా శెట్టి, టేస్టీ తేజ, రీతుచౌదరి, వర్షిణి సౌందరరాజన్, సిరి హన్మంతు, వాసంతి కృష్ణన్, అమృతచౌదరి, నయని పావని, నేహ, పండు, ఇమ్రాన్, యూట్యూబర్లు హర్షసాయి, భయ్యా సన్నియాదవ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సుప్రీత పేర్లనూ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే.. ఈ వ్యవహారంపై విజయ్ దేవరకొండ టీమ్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆయన 'ఆన్‌లైన్ స్కిల్ బేస్డ్ గేమ్స్'కు మాత్రమే ప్రచారం చేశారని, వాటికి అనుమతి ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఆయన ప్రచారకర్తగా పరిమితమయ్యారని స్పష్టం చేసింది. ఇదే కోవలో రానా టీమ్ కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. ఇక, బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌పై నమోదైన కేసు విచారణలో భాగంగా.. ప్రముఖ యాంకర్లు విష్ణుప్రియ, రీతూచౌదరిని పంజగుట్ట పోలీసులు గురువారం విచారించారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో విష్ణుప్రియ తన న్యాయవాదితో రాగా.. రీతూ చౌదరి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వచ్చారు. పోలీసులు వారిని వేరువేరుగా, కలిపి విచారించి, వారి వాంగ్మూలాలను నమోదు చేసినట్టు తెలిసింది. వారి మొబైల్ ఫోన్లను సైతం జప్తు చేసి.. రాత్రి 9.20 తర్వాత వారు బయటికి వచ్చారు. వారికి 41 సీఆర్పీసీ నోటీసు ఇచ్చి మళ్లీ 25వ తేదీన విచారణకు రావాలని చెప్పినట్టు విష్ణుప్రియ న్యాయవాది మీడియాకు తెలిపారు. కాగా, నటుడు ప్రకాశ్‌రాజ్ 'ఎక్స్'లో ఒక వీడియో విడుదల చేశారు. "2017 నుంచి ఎప్పుడూ నేను బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయలేదు. యువత బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దు. గేమింగ్ యాప్.. అదొక వ్యసనం. దయచేసి మీ జీవితాన్ని కోల్పోకండి" అని ప్రకాశ్ రాజ్ ఆ వీడియోలో పేర్కొన్నారు.

సైన్యం మరింత శక్తిమంతం!

» 54 వేల కోట్లతో మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోలుకు డీఏసీ ఓకే


ఏటీఏజీఎస్

న్యూఢిల్లీ, మార్చి 20: భారత సైన్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు, యుద్ధ సామర్థ్యాన్ని ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రూ.54 వేల కోట్లతో భారీఎత్తున మిలటరీ హార్డ్‌వేర్ పరికరాలను కొనుగోలు చేసేందుకు గురువారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా 'ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్' వ్యవస్థలు, టార్పెడోలు, టీ-90 ట్యాంకుల కోసం ఇంజన్లు వంటివి కొనుగోలు చేయనున్నారు. మరోవైపు భారీఎత్తున దేశీయంగా తయారు చేసిన ఆర్టిలరీ శతఘ్నుల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఆర్మీ కోసం అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్స్ (ఏటీఏజీఎస్) కొనుగోలుకు సంబంధించి రూ.7 వేల కోట్ల ఒప్పందానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ (భద్రత) ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా 307 హోవిట్జర్లను కొనుగోలు చేయనున్నారు. అదేవిధంగా సైన్యంలోని 15 ఆర్టిలరీ రెజిమెంట్లకు ఆయుధాలు సమకూర్చేందుకు 327 శతఘ్నులను తీసుకెళ్లే వాహనాలు (గన్ టోయింగ్ వెహికల్స్) కొనుగోలు చేస్తారు. 155ఎంఎం/52 క్యాలిబర్ 'ఏటీఏజీఎస్'ను డీఆర్‌డీవో అభివృద్ధి చేయగా.. భారత్ ఫోర్జ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థలు ఉత్పత్తి చేయనున్నాయి. బిడ్డింగ్‌లో భారత్ ఫోర్జ్ ఎల్-1గా నిలిచిన నేపథ్యంలో.. ఆ సంస్థ 60 శాతం శతఘ్నులను, టాటా సంస్థ మిగతా 40 శాతం తయారు చేయనుంది.

బాలిక ఛాతీ తాకడం రేప్ కిందికి రాదు

» రేప్ కేసులో అలహాబాద్ హైకోర్టు స్పష్టం

ప్రయాగ్‌రాజ్, మార్చి 20: మైనర్ బాలిక ఛాతీని తాకడం, ఆమె పైజామా తాడును లాగివేయడం రేప్ కిందకు రాదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. దానిని అంతకన్నా తక్కువ నేరం కింద పరిగణించి కేసును మార్చాలని ఆదేశించింది. ఒక బాలికను చిన్న వంతెన కిందకు తీసుకెళ్లి ఆమె ఛాతీపై చేయి వేయడంతో పాటు, ఆమె ధరించిన పైజామా తాడును లాగారంటూ పవన్, ఆకాశ్ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదయింది. ఐపీసీలోని సెక్షన్ 376 (రేప్), పోక్సో చట్టంలోని సెక్షన్ 18 (నేరానికి ప్రయత్నించడం) కింద పోలీసులు కేసు పెట్టారు. ఇవి తీవ్రమైన సెక్షన్లు కావడం, కఠిన శిక్షలు పడే అవకాశం ఉండడంతో వాటిని మార్చాలంటూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ రామ్ నారాయణ్ మిశ్ర.. ఆ సెక్షన్లు మార్చి అంతకన్నా తక్కువ శిక్ష పడే సెక్షన్లు నమోదు చేయాలని ఆదేశించారు. సాక్ష్యాలను పరిశీలిస్తే నిందితులిద్దరూ ఆ బాలికపై అత్యాచారం చేయడానికి సిద్ధమయ్యారంటూ నిర్ధారించలేమని తెలిపారు. అందువల్ల తక్కువ శిక్ష పడే ఐపీసీలోని సెక్షన్ 354బీ (బలవంతంగా దుస్తులను లాగడం), పోక్సో చట్టంలోని 9/10 సెక్షన్లు (లైంగిక దాడి) కింద మళ్లీ కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

తిరుమల చేరుకున్న సీఎం చంద్రబాబు

» నేడు శ్రీవారి దర్శనం అనంతరం

» మనవడి జన్మదినం సందర్భంగా అన్నప్రసాద వితరణ


సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా గురువారం తిరుమల చేరుకున్నారు. ఆయన సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ సాయంత్రమే తిరుమలకు చేరుకున్నారు. కాగా, చంద్రబాబు, ఆయన కుమారుడు, మంత్రి లోకేశ్ రాత్రి 11.30 గంటలకు తిరుమలలోని పద్మావతి అతిథి గృహానికి చేరుకున్నారు. వారికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ దేవాన్ష్ పేరుపై ఒక్కరోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలు వడ్డించడంతో పాటు వారు కూడా అన్నప్రసాదాలు స్వీకరిస్తారు.

ఐపీఎస్ అభిషేక్ మహంతికి హైకోర్టులో స్వల్ప ఊరట

హైదరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అఖిల భారత సర్వీసు అధికారులు క్యాడర్ వివాదంలో ఉన్న ఐపీఎస్ అభిషేక్ మహంతికి హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఆయన ఏపీ క్యాడర్‌లో చేరాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలును ఈనెల 24వ తేదీ వరకు నిలిపేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ క్యాడర్‌లో చేరాలన్న ఉత్తర్వులపై ఇటీవల సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)లో ఎలాంటి ఊరట లభించకపోవడంతో మహంతి మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ తిరుమలదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం 2022లో జీవో 171 ద్వారా అభిషేక్ మహంతిని తెలంగాణ సర్వీసుల్లోకి తీసుకున్న విషయం కేంద్రం దృష్టిలో ఉందా? లేదా? అని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 'పిటిషనర్ తొలుత ఏపీలో విధులు నిర్వర్తించారు. తర్వాత తెలంగాణ క్యాడర్‌లోకి తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు ఏపీకి వెళ్లాలని ఆదేశాలిచ్చారు. ఇదేదో కుర్చీల ఆటలాగా ఉంది.. అతను మీ అధికారి.. మా ఎదుట కేసు విచారణలో ఉండగానే అతడిని అత్యవసరంగా ఏపీకి పంపాల్సిన అవసరముందా? కనీసం కేసు పూర్తయ్యే వరకు కూడా ఆగలేరా..?' అని అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మను ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై సోమవారం లోపు కేంద్రం తన వైఖరి తెలియజేయాలంటూ విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.

ఢిల్లీ, కోల్‌కతాల్లో సీఐఏ స్థావరాలు

న్యూఢిల్లీ, మార్చి 20: అమెరికాకు చెందిన నిఘా సంస్థ సీఐఏ భారత్‌లో రహస్య కార్యకలాపాలు సాగించినట్టు బయటపడింది. దీనికోసం ఢిల్లీ, కోల్‌కతాల్లో ప్రత్యేకంగా స్థావరాలు ఏర్పాటు చేసినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ హత్యకు సంబంధించిన 1963 నాటి రహస్య నివేదికలను ఇటీవల అక్కడి అధికారులు బహిరంగపరచగా, ఈ వివరాలు బయటకొచ్చాయి. ఈ పత్రాలను అనుసరించి.. న్యూఢిల్లీ, కోల్‌కతాల్లోని సీఐఏ రహస్య స్థావరాలను బ్లాక్ సైట్స్ అని వ్యవహరించేవారు. అనుమానిత ఉగ్రవాదులను ఈ కేంద్రాలకు తరలించి విచారించేవారు. ఇక్కడినుంచి సీక్రెట్ ఆపరేషన్లు జరిపేవారు. ప్రపంచ ఆధిక్యత కోసం అమెరికా, రష్యాలు సాగించిన ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో సీఐఏతో భారత్ బంధం మరింత బలపడింది. కాగా, భారతీయ నగరాలతో పాటు పాకిస్థాన్ రాజధాని రావల్పిండీ, శ్రీలంక రాజధాని కొలంబో, జపాన్ రాజధాని టోక్యో, ఇరాన్ రాజధాని టెహ్రాన్, దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో సీఐఏకు 1960ల్లో స్థావరాలు ఉండేవని తాజాగా బయటపడిన పత్రాలు వెల్లడించాయి.

మళ్లీ నెత్తురోడిన దండకారణ్యం

(మొదటిపేజీ తరువాయి)

జరగడం గమనార్హం.! బస్తర్ ఐజీ సుందర్‌దాస్ కథనం ప్రకారం.. బీజాపూర్ జిల్లా గంగలూరు సమీపంలోని బైలాదియ కొండకు అవతల.. ట్రయాంగిల్ అడవుల్లో నక్సల్స్ సంచారం ఉన్నట్లు ఉప్పందుకున్న పోలీసులు.. సుమారు 1,500 మంది బలగాలు బుధవారం కూంబింగ్ ప్రారంభించారు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడడంతో.. ఇరువైపులా కాల్పులు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు ఐదు విడతలుగా భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ తర్వాత నక్సల్స్ వైపు కాల్పులు నిలిచిపోవడంతో.. కూంబింగ్ బలగాలు ముందుకు సాగాయి. అక్కడ 26 మంది నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో 8 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. నక్సల్స్ జరిపిన కాల్పుల్లో డీఆర్జీ జవాను రాజు మృతిచెందగా.. మరో ఇద్దరు జవాన్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. "చనిపోయిన నక్సల్స్‌ను ఇంకా గుర్తించాల్సి ఉంది" అని బస్తర్ ఐజీ వెల్లడించారు. మరో ఘటనలో.. కాంకేర్-నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లోని అబూజ్‌మడ్ అడవుల్లో గురువారం కూంబింగ్‌లో ఉన్న భద్రతాబలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు.ఎదురుకాల్పుల్లో నలుగురు నక్సల్స్ మృతిచెందారు. ఈ మార్గంలో పోలీసులే టార్గెట్‌గా మావోయిస్టులు మందుపాతరను పేల్చడంతో.. ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన మావోయిస్టుల్లో తెలంగాణకు చెందిన వారు కూడా ఉండి ఉంటారని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.


మావోయిస్టు మృతదేహాన్ని తరలిస్తున్న జవాన్లు

78 రోజుల్లో.. 97 మంది నక్సల్స్

గత ఏడాది 190 మంది ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లగా.. ఈ ఏడాది తొలి 78 రోజుల్లోనే 97 మంది నక్సలైట్లు చనిపోయారు. గురువారం నాటి ఎన్‌కౌంటర్ ఈ ఏడాదిలో రెండో అతిపెద్దది కావడం గమనార్హం.! జనవరిలో నేషనల్ పార్క్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది చనిపోగా.. తాజా ఎన్‌కౌంటర్లలో 30 మంది మావోయిస్టులు మృతిచెందారు.


హిడ్మా కోసం థర్మల్ ఇమేజింగ్

పీఎల్‌జీఏ-1 కమాండర్, మావోయిస్టు గెరిల్లా యుద్ధాల వ్యూహకర్త మాడ్వీ హిడ్మా కోసం భద్రతాబలగాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. వేర్వేరు బృందాలు ఛత్తీస్‌గఢ్-ఒడిసా, ఛత్తీస్‌గఢ్-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని 125 గ్రామాల్లో బలగాలు కూంబింగ్ చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున థర్మల్ ఇమేజింగ్ టెక్నాలజీని వినియోగించుకుంటున్నాయి. నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌టీఆర్ఐ) సాంకేతిక సిబ్బంది సహకారంతో ముందుకు సాగుతున్నట్లు సమాచారం. దండకారణ్యంలో బలగాల క్యాంపులు పెరగడం.. కూంబింగ్ ముమ్మరమవ్వడంతో నక్సల్స్ అగ్రనేతలు కుల్హారిఘాట్ అడవుల మీదుగా ఆంధ్ర-ఒడిసా సరిహద్దులు(ఏవోబీ) వైపు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే జనవరి 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత చలపతి సహా.. 16 మంది మావోయిస్టులు చెందిన విషయం తెలిసిందే.!

నక్సలైట్లను కనికరించేది లేదు

నక్సలైట్లపై తమ సర్కారుకు కనికరం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆయన జవాన్ల సాహసాన్ని అభినందిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. మావోయిస్టుల పట్ల మోదీ సర్కారు నిర్దాక్షిణ్య వైఖరితో ముందుకు వెళ్తోందని, వచ్చే ఏడాది మార్చి 31కల్లా నక్సల్స్ రహిత భారత్‌ను సాధిస్తామని పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి కూడా ఎక్స్‌లో ఈ ఎన్‌కౌంటర్‌పై స్పందించారు. జవాన్ల విజయాన్ని కొనియాడుతూ.. 2026 నాటికి బస్తర్‌లో భయరహిత వాతావరణాన్ని నెలకొల్పుతామని ధీమా వ్యక్తం చేశారు. బస్తర్ అభివృద్ధి ప్రణాళిక కోసం రెండ్రోజుల క్రితమే ప్రధాని మోదీని కలిసిన విషయాన్ని గుర్తుచేశారు

లోకం తీరు



మధుమేహం, ఊబకాయానికి కొత్త ఇంజెక్షన్

» అందుబాటులోకి తెచ్చిన ఎలీ లిల్లీ

న్యూఢిల్లీ, మార్చి 20: ఊబకాయం, మధుమేహంతో బాధపడేవారికి శుభవార్త! ఆ రెండింటికీ పనిచేసే 'మౌంజారో' అనే ఔషధాన్ని ఎలీ లిల్లీ ఇండియా సంస్థ గురువారం భారత మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) అనుమతితో సింగిల్ డోస్ వయల్ రూపంలో ఈ ఇంజెక్షన్‌ను విడుదల చేస్తున్నట్టు ఆ సంస్థ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. దీన్ని వైద్యులు సిఫారసు చేసిన మోతాదు ప్రకారం వారానికి ఒకసారి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే టిర్జెపటైడ్ అనే ఔషధం.. మన శరీరంలో ఉండే జీఐపీ (గ్లూకోజ్ డిపెండెంట్ ఇన్సులినోట్రోపిక్ పాలీపెప్టైడ్), జీఎల్‌పీ-1 (గ్లూకోగాన్ లైక్ పెప్టైడ్-1) అనే హార్మోన్ గ్రాహకాలను ఉత్తేజితం చేస్తుందని, తద్వారా మధుమేహం, ఊబకాయం, అధికబరువును అదుపులో ఉంచుతుందని కంపెనీ తన ప్రకటనలో వివరించింది. క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా.. ఆహార నియంత్రణ పాటిస్తూ, వ్యాయామం చేస్తూ ఈ ఔషధాన్ని వారానికి 15 మిల్లీగ్రాముల చొప్పున తీసుకున్నవారు 72 వారాల వ్యవధిలో సగటున 21.8 కిలోల బరువు తగ్గారని.. 5ఎంజీ చొప్పున తీసుకున్నవారు సగటున 15.4 కిలోల బరువు తగ్గారని వెల్లడించింది. మన దేశంలో ఈ ఔషధం ధర 2.5 మిల్లీగ్రాముల వయల్ రూ.3,500. అదే 5 మిల్లీ గ్రాముల వయల్ అయితే రూ.4,375. వైద్యులు సిఫారసు చేసిన మోతాదును బట్టి ఖర్చు ఉంటుంది. ఉదాహరణకు.. వారానికి 2.5 ఎంజీ తీసుకోవాల్సి వస్తే నెలకు రూ.14 వేలు ఖర్చవుతుంది. అదే 5ఎంజీ తీసుకోవాలంటే నెలకు రూ.17,500 అవుతుంది. ఇవే మోతాదుల్లో ఈ ఔషధాన్ని అమెరికాలో కొనాలంటే నెలకు రూ.86 వేల నుంచి రూ.లక్ష దాకా ఖర్చవుతుంది.

ఫిన్లాండ్.. సంతోషాల చిరునామా

» హ్యాపీయెస్ట్ కంట్రీగా మళ్లీ అగ్రస్థానం

» భారత్‌కు 118..పాక్‌కు 109వ ర్యాంకు

న్యూఢిల్లీ, మార్చి 20: సంతోషాలకు చిరునామా ఫిన్లాండ్.. అని మరోసారి స్పష్టమైంది. ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్లాండ్ వరుసగా ఎనిమిదోసారి అగ్రస్థానం దక్కించుకుంది. 'అంతర్జాతీయ ఆనంద దినోత్సవం' (మార్చి 20) సందర్భంగా గురువారం విడుదల చేసిన 'వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్ 2025'లో ఫిన్లాండ్ మరోసారి నంబర్‌వన్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 147 దేశాలను ఈ సర్వేలో భాగస్వామ్యం చేయగా.. గతేడాది 126వ స్థానంలో ఉన్న భారత్ ఎనిమిది ర్యాంకులు మెరుగుపడి 118వ స్థానానికి చేరుకుంది. కానీ.. నేపాల్ (92), పాలస్తీనా (108), పాకిస్థాన్ (109), ఉక్రెయిన్ (111) కంటే భారత్ వెనకబడడం గమనార్హం. ఈ జాబితాలో అఫ్ఘానిస్థాన్ 147వ ర్యాంకుతో అట్టడుగున నిలిచింది. ఈ జాబితాలో మన పొరుగున ఉన్న దేశాలైన శ్రీలంక 133, బంగ్లాదేశ్ 134, చైనా 68వ స్థానాల్లో నిలిచాయి. పాశ్చాత్య దేశాల్లో ముఖ్యంగా ఐరోపా దేశాలు టాప్-20లో ఆధిపత్యం చలాయించాయి. అమెరికా 24వ స్థానానికి, బ్రిటన్ 23వ స్థానానికి పడిపోయాయి.

నల్లా నీళ్ల దగ్గర గొడవ.. అన్నను కాల్చేసిన తమ్ముడు

» ఇద్దరూ కేంద్రమంత్రి నిత్యానంద్ మేనల్లుళ్లు

న్యూఢిల్లీ, మార్చి 20: విశ్వజిత్, జయజిత్ ఇద్దరూ అన్నదమ్ములు. కేంద్ర మంత్రి నిత్యానంద్‌రాయ్‌కు మేనల్లుళ్లు. ఆయన సోదరి హీనాదేవి కుమారులు. బిహార్ భాగల్పూర్‌లోని జగత్‌పూర్ గ్రామంలో ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇంటికి వచ్చే నల్లా నీళ్లు పట్టుకునే విషయంలో వాళ్ల భార్యలిద్దరు గురువారం ఉదయం గొడవపడ్డారు. "నల్లా మాదంటే.. మాది" అని వాదులాడుకున్నారు. గొడవ పెద్దదైంది. విశ్వజిత్, జయజిత్‌లు కలుగజేసుకొన్నారు. గొడవ ఇంకా ముదిరింది. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగింది. ఆవేశంలో విశ్వజిత్ తన తమ్ముడు జయజిత్‌పై కాల్పులు జరిపాడు. బుల్లెట్ గాయంతో రక్తమోడుతున్న జయజిత్ అదే తుపాకీని లాక్కొని అన్న విశ్వజిత్‌పై కాల్పులు జరిపాడు. ఇద్దరు కుమారులను ఆపడానికి తల్లి హీనాదేవి ప్రయత్నించగా.. ఆమెకు కూడా బుల్లెట్ గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ ముగ్గురిని వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే విశ్వజిత్ చనిపోయాడు. జయజిత్ పరిస్థితి విషమంగా మారింది.

అమెరికా విద్యాశాఖ మూసివేత!

» అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు



వాషింగ్టన్, మార్చి 20: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయాన్ని తీసుకున్నారు. దేశ విద్యాశాఖను మూసివేయాలని విద్యామంత్రి లిండా మెక్‌మోహన్‌ను గురువారం ఆదేశించారు. అయితే దీనిని అమెరికా కాంగ్రెస్.. ముఖ్యంగా సెనేట్ సమర్థించడం అనుమానమే. కోర్టులు కూడా ఈ ఆదేశాలను నిలిపివేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అయితే, తన నిర్ణయాన్ని కాంగ్రెస్ సమర్థిస్తుందన్న విశ్వాసాన్ని ట్రంప్ వ్యక్తంచేశారు. విద్యను ఫెడరల్ ప్రభుత్వం నుంచి తప్పించి గతంలో మాదిరే విద్యావిధానాన్ని రాష్ట్రాలకు వదిలేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. దీనిని అమలు చేస్తానని ట్రంప్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు కూడా. దానికనుగుణంగానే ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారని వైట్‌హౌస్ ధ్రువీకరించింది. అయితే కీలకమైన కొన్ని సేవలు, కార్యక్రమాలను కొనసాగించాలని మెక్‌మోహన్‌కు ట్రంప్ సూచించారు. ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే శాఖ సిబ్బందిలో సగాన్ని ఇప్పటికే తీసివేశారు. ఆయనపై విపక్ష డెమోక్రాటిక్ సెనేటర్ ప్యాటీ ముర్రే విరుచుకుపడ్డారు. ట్రంప్, డీవోజీఈ అధిపతి ఎలాన్ మస్క్ కలిసి విద్యార్థులు, కుటుంబాల డబ్బును దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇంకోవైపు.. ట్రంప్ చర్యకు వ్యతిరేకంగా 21 రాష్ట్రాల్లో డెమోక్రాటిక్ పార్టీకి చెందిన అటార్నీ జనరల్స్ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. జిమ్మీ కార్టర్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 1979లో విద్యాశాఖను ఏర్పాటుచేశారు. విద్యాసంస్థలకు నిధులు, విద్యార్థులకు రుణాలు, పౌరహక్కుల అమలువంటి వాటిని ఇది పర్యవేక్షిస్తుంది. ఇంకోవైపు.. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయానికి ఫెడరల్ ప్రభుత్వం ఇవ్వాల్సిన 17.50 కోట్ల డాలర్ల నిధులను ట్రంప్ యంత్రాంగం స్తంభింపజేసింది. బాలికలు, మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిషేధిస్తూ ట్రంప్ గత నెల 5నే ఆదేశాలు జారీచేశారు. అయినా సదరు వర్సిటీలో జరిగిన ఈతల పోటీలో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనడంతో కన్నెర్రజేశారు.

గోల్డ్ కార్డు.. ట్రంప్ కార్డు

గ్రీన్ కార్డుకు బదులుగా ట్రంప్ తెచ్చిన గోల్డ్ కార్డు(గోల్డెన్ వీసా)కు 'ట్రంప్ కార్డు'గా నామకరణం చేస్తారని అంటున్నారు. 50 లక్షల డాలర్లు చెల్లించి గోల్డెన్ వీసా తీసుకునేవారికి పౌరసత్వ సదుపాయాలు కల్పిస్తామంటూ గత నెలలో ఆయన దీనిని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై 'ఫాక్స్ న్యూస్' ఇంటర్వ్యూలో అధ్యక్షుడు మాట్లాడుతూ.. దీనికి తన పేరే పెట్టాలని అందరూ అంటున్నారని వ్యాఖ్యానించారు. '10 లక్షల గోల్డ్ కార్డులు అమ్మితే 5 లక్షల కోట్ల డాలర్ల ఆదాయం వస్తుంది. దీంతో చైనా, ఇతర దేశాలకు అప్పులన్నీ తీర్చేయొచ్చు" అన్నారు.

భారత్‌పై మస్క్ 'ఎక్స్' దావా

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన సోషల్ మీడియా దిగ్గజం 'ఎక్స్' (ట్విటర్) భారత్‌పై దావా వేసింది. కేంద్రం చట్టవిరుద్ధంగా కంటెంట్ నియంత్రిస్తోందని, ఏకపక్షంగా సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని ఆరోపిస్తూ కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సమాచార హక్కు (ఐటీ) చట్టం ఉల్లంఘనలను ప్రస్తావిస్తూ, ప్రత్యేకించి సెక్షన్ 79(3)(బీ)ని దుర్వినియోగం చేస్తోందని, ఇది సుప్రీం కోర్టు తీర్పులను ఉల్లంఘించడమేనని పేర్కొంది.

ఎమ్మెల్యే రుబాబు!

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి విరుద్ధం. పైగా కాలువ గట్టు, రహదారిపై అడ్డగోలుగా నిర్మించిన భవనం రెగ్యులరైజ్ చేసే అవకాశమే లేదు. నిబంధనల ప్రకారం ఇరిగేషన్ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకొని అక్రమ నిర్మాణాలను కూల్చాల్సి ఉంది. ఇదే విషయాన్ని రెవెన్యూ అధికారులు ఫైలుపై రాశారు. ఆ అక్రమణను క్రమబద్ధీకరించడం కుదరదని చెప్పారు.

వైసీపీ హయాంలోనే కాలేదు..

ఇదే భూమిని రెగ్యులరైజ్ చేయించాలని జగన్ ప్రభుత్వంలో వైసీపీ ఎమ్మెల్యే ఒకరు విశ్వప్రయత్నం చేసినా సాధ్యంకాలేదు. ఇప్పుడు కూటమి ఎమ్మెల్యే ఆ పనిని భుజాన వేసుకున్నారు. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో.. తనకు సంబంధించిన ఓ అధికారికి రెవెన్యూలో పోస్టింగ్ ఇప్పించారు. కొద్దిరోజుల్లోనే ఆ అధికారి మరోపోస్టుకు వెళ్లిపోయారు. దీంతో ఆ ఎమ్మెల్యే విచక్షణ మరిచిపోయారు. బుధవారం ఉదయం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు ముగిశాక టీ బ్రేక్ సమయంలో అధికారుల గ్యాలరీ వద్దకు వెళ్లారు. అక్కడున్న ఇద్దరు సీనియర్ రెవెన్యూ అధికారులతో గొడవకు దిగారు. "నా ఫైళ్లనే ఆపుతారా? నా మనిషినే బదిలీ చేయిస్తారా? నేనంటే ఏమిటో మీకు తెలియదు? పేదలు ఇల్లుకట్టుకోవడం మీకు ఇష్టం లేదా? ఎంత ధైర్యం ఉంటే నా పనులను అడ్డుకుంటారు?" అని గట్టిగా కేకలు వేశారు. దీంతో ఆ అధికారులు నిశ్చేష్టులయ్యారు. ఎమ్మెల్యే అలా దాదాపు 5నిమిషాల పాటు నాన్‌స్టాప్‌గా అధికారులపై నోరు పారేసుకొని వారిని బెదరగొట్టారు.

మంత్రిపైనా అదే దూకుడు

ఎమ్మెల్యే రెచ్చిపోతున్న సమయంలో అక్కడే ఉన్న సంబంధిత మంత్రి వెళ్లి ఆయనను వారించారు. నిగ్రహం కోల్పోయిన ఆ ఎమ్మెల్యే సదరు మంత్రిపైనా విరుచుకుపడ్డారు. "నన్ను అడ్డుకుంటారా? నా పనులు చేయరా? నీకసలు ఫైళ్లు చూడటం వచ్చా? నీవల్ల ప్రభుత్వానికి ఏమైనా మేలు జరుగుతోందా? ఏ పని ఎప్పుడు చేయాలో నీకు తెలుసా? పేదల ఇంటి స్థలాల రెగ్యులరైజేషన్‌లో మీరు ఫెయిల్ అయ్యారు. పేదలకు మేలు చేయడం మీకు చేతకాదు" అంటూ రెచ్చిపోయారు. మంత్రి కూడా తీవ్రంగా స్పందించారు. "పేదలకు మేలు చేయడంలో ప్రభుత్వం ముందుంది. డబ్బున్నోళ్లు, బలిసినోళ్లకు, అక్రమార్కులకు మేలు చేయడానికి సిద్ధంగా లేదు. కాలువగట్లు, రోడ్లను ఆక్రమించి రెగ్యులరైజ్ చేయమంటే ఎలా సాధ్యం? రూల్స్‌కు వ్యతిరేకంగా ఏ మంత్రి, అధికారి పనిచేయడు. బలిసిన వారి భూములను రెగ్యులరైజ్ చేయమంటే చేయం. పేదలకు మేలు చేస్తున్నాం కాబట్టే అసెంబ్లీదాకా వచ్చాం. అధికారులను గౌరవించడం చేతకాకపోతే మాట్లాడొద్దు. అధికారులపై నోరుపారేసుకోవద్దు. పార్టీ, ప్రభుత్వం పరువు తీస్తే హీరోలవ్వరు" అంటూ చురకలు అంటించారు. అధికారుల గ్యాలరీ నుంచి బయట లాబీల్లోకి వెళ్లాక ఆ ఎమ్మెల్యే మరింత రెచ్చిపోయే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఇతర ఎమ్మెల్యేలు ఆయనను బలవంతంగా అక్కడి నుంచి తీసుకెళ్లారు.

ఆరాతీసిన సీఎం

ఎమ్మెల్యే రుబాబు గురించి నిఘా విభాగం సీఎం చంద్రబాబుకు బుధవారమే నివేదించినట్లు తెలిసింది. ఆ తర్వాత సీఎం మరో మార్గంలోనూ సమాచారం తెప్పించుకున్నారు. ఢిల్లీ పర్యటన ముగించుకొని అమరావతికి వచ్చాక, బుధవారం రాత్రే సంబంధిత మంత్రిని పిలిపించుకొని మాట్లాడారు. త్వరలో ఆ ఎమ్మెల్యేను పిలిచి మాట్లాడుతానని సీఎం చెప్పినట్లు తెలిసింది.



ఈ పెయింటింగ్‌కు 118 కోట్లు

ప్రముఖ చిత్రకారుడు ఎంఎఫ్ హుసేన్ కుంచె నుంచి రూపుదిద్దుకున్న ఈ పెయింటింగ్‌ను బుధవారం న్యూయార్క్‌లో వేలం వేయగా రికార్డు స్థాయిలో ఏకంగా 13.8మిలియన్ డాలర్లకు (రూ.118 కోట్లు) అమ్ముడుపోయింది. అత్యంత ఖరీదైన ఆధునిక భారత కళాకృతిగా ఇది రికార్డుకెక్కింది. 1954నాటి ఈ 'గ్రామ్ యాత్ర' పెయింటింగ్. 14 అడుగుల ఒకే కాన్వాస్‌లో 13 రకాల చిత్రాలతో రూపుదిద్దుకుంది. వీటిలోని ప్రతి చిత్రం గ్రామీణ భారత జీవితాన్ని ప్రతిబింబిస్తుంది.

'ఎసెన్షియా' విచారణలో హై లెవెల్ కమిటీ విఫలం

- వెంటిలేషన్ వ్యవస్థ సరిగా లేకున్నా ఆపరేటింగ్ లైసెన్స్
- కమిటీ నివేదికలో పొంతన లేని అంశాలు
- 'ప్రజల కోసం శాస్త్రవేత్తల బృందం' ఆరోపణ

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఆర్థిక మండలిలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో గత ఏడాది ఆగస్టు 21న వేపర్ క్లౌడ్ (ఆవిరి మేఘాల) ఎక్స్‌ప్లోజన్ జరిగి 17 మంది చనిపోవడానికి, 39 మంది గాయపడడానికి గల కారణాలను శాస్త్రీయ విధానంలో వెల్లడించడంలో హై లెవెల్ కమిటీ విఫలమైందని 'ప్రజల కోసం శాస్త్రవేత్తల బృందం' ఆరోపించింది. శాస్త్రవేత్తలు డాక్టర్ కె.బాబూరావు, డాక్టర్ కె.వెంకటరెడ్డి, డాక్టర్ డి.రాంబాబు, డాక్టర్ అహ్మద్ ఖాన్ దీనిపై గురువారం ఓ నివేదిక విడుదల చేశారు. వెంటిలేషన్ సిస్టమ్ నిబంధనల ప్రకారం లేకున్నా ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ ఆపరేషన్ లైసెన్స్ ఇచ్చారని, అది కూడా ప్రమాదం తీవ్రం కావడానికి ఒక కారణమని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం నియమించిన హై లెవెల్ కమిటీ కూడా సరిగ్గా విచారణ చేయలేదని బృందం అభిప్రాయపడింది. నివేదిక అసంపూర్తిగా ఇచ్చారని ఆరోపించారు. ప్రమాదం జరిగిన ఐదు వారాల తరువాత కమిటీ ఘటనా స్థలాన్ని సందర్శించిందని, ఆ వివరాలు, సాక్షులు పేర్కొన్న అంశాలు ఏవీ ప్రస్తావించలేదన్నారు. పేలుడు తీవ్రత, ప్లాంటులోని ఇతర ప్రాంతాలపై దాని ప్రభావం ఎక్కడా పేర్కొనలేదని, అసలు ప్రమాదం ఎక్కడ జరిగిందో కూడా వివరించలేదని విమర్శించారు. ప్రమాదానికి దారితీసిన మూలకారణాలు, భద్రతా లోపాలు, వాటిని సవరించుకోవడానికి తీసుకోవలసిన చర్యలు సూచించలేదని తెలిపారు.

రాజపాళయం ఆలయ పరకామణిలో 'గోల్‌మాల్'!

(మొదటి పేజీ తరువాయి)

బోర్డు యాజమాన్యం ఆ మొత్తాన్ని వెలుపలికి తీసి, భారత కరెన్సీలోకి మారుస్తుంది. తమిళనాడులోని విరుదునగర్ జిల్లా రాజపాళయంలో ఉన్న టీటీడీ ఆలయ హుండీ లెక్కింపు ప్రతి మూడు నెలలకోమారు జరుగుతుంది. గతేడాది అక్టోబరు 23వ తేదీన ఆలయంలో 'పరకామణి' జరిగింది. టీటీడీ చెన్నై ఏఈవో పార్థసారధి, అసిస్టెంట్‌లు ఎం.శ్రీనివాసులు, సి.బాల శ్రీనివాసులు, ఓఎస్ జి.మునికుమార్, విజిలెన్స్ అధికారి ఎం.రామకృష్ణమనాయుడు ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. అందులో వచ్చిన భారత కరెన్సీతో పాటు, విదేశీ కరెన్సీని కూడా స్వాధీనం చేసుకున్న ఏఈవో.. చెన్నైకి తిరిగొచ్చారు. ఆ హుండీ నుంచి విదేశీ కరెన్సీ తీయడం పదేళ్ల తర్వాత అదే ప్రథమం. అంతవరకూ బాగానే ఉన్నా, అక్కడే గోల్‌మాల్ జరిగింది. హుండీలో వచ్చిన భారత కరెన్సీ రూ.8,29,790 గురించి లెడ్జర్‌లో స్పష్టంగా రాశారు. కానీ, ఇతర కానుకలు ఏమీ లేవంటూ ఆ కాలంలో నిలువునా గీత కొట్టారు. ఆ పత్రంపై ఏఈవో, విజిలెన్స్ అధికారి, ఇద్దరు సిబ్బంది సంతకాలు చేశారు. లెడ్జర్‌లో పైన తేదీ 23.10.2023 అని పేర్కొన్నా, సిబ్బంది సంతకాల్లో మాత్రం 23.10.2024 అనే రాశారు. ఆ లెడ్జర్ కాపీని తిరుమలకు పంపేశారు. ఇందులో విదేశీ కరెన్సీ వివరాలు తెలిపే కాలాన్ని మాత్రం ఖాళీగానే ఉంచారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ కొన్ని రోజుల తర్వాత ఖాళీగా విదేశీ కరెన్సీ కాలంలో అమెరికా, కెనడా డాలర్లు, మలేషియా, ఒమన్, సౌదీ అరేబియా, శ్రీలంక, యూఏఈ దేశాలకు చెందిన మొత్తం 46 కరెన్సీ నోట్ల వివరాలు పొందుపరిచారు. ఎట్టకేలకు ఆ కరెన్సీ గతేడాది డిసెంబరు 4వ తేదీన తిరుమలకు చేరింది. హుండీని నెల మధ్యలో ఎప్పుడు తెరిచినా, విదేశీ కరెన్సీని ఆ తర్వాత వచ్చే 1వ తేదీనే తిరుమలలో అప్పగించాలన్న నిబంధన ఉందని భావించినా.. రాజపాళయం ఆలయ హుండీ విదేశీ కరెన్సీ నవంబరు 1వ తేదీకే తిరుమల ఖాతాకు చేరాల్సి ఉంది. కానీ, డిసెంబరు 4వ తేదీకి గానీ విదేశీ కరెన్సీ తిరుమలకు చేరలేదని రికార్డులు చెబుతున్నాయి. ఇందులోని తిరకాసేంటో టీటీడీకే తెలియాలి.



విదేశీ కరెన్సీ ప్రస్తావన లేకుండానే తిరుమల చేరిన లెడ్జర్ కాపీ



లెడ్జర్ కాపీలో ఆలస్యంగా పొందుపరిచిన విదేశీ కరెన్సీ వివరాలు

ఎందుకంత జాప్యం? ఏమా మతలబు?



తిరుమలలో అప్పగించిన విదేశీ కరెన్సీ వివరాలు

రాజపాళయం ఆలయంలో అక్టోబరు 23వ తేదీన హుండీ లెక్కింపు జరగ్గా, డిసెంబరు 4వ తేదీకి గానీ విదేశీ కరెన్సీ తిరుమలకు చేరలేదు. అప్పటి వరకూ ఆ కరెన్సీ చెన్నైలో ఎందుకుంది? తిరుమలకు ముందుగా వెళ్లిన రికార్డుల్లో విదేశీ కరెన్సీ ప్రస్తావన ఎందుకు లేదు? ఆ తర్వాత మళ్లీ లెడ్జర్‌లో ఆ కరెన్సీ గురించి ఎందుకు రాయాల్సి వచ్చింది? ఇంతకీ హుండీలోని విదేశీ కరెన్సీ మొత్తం అదేనా? లేక సిబ్బంది చేతివాటం పోగా, మిగిలింది మాత్రమే లెడ్జర్‌లో రాశారా? ఆలస్యంగా అందడంపై టీటీడీ ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలేంటి? విదేశీ కరెన్సీ ప్రస్తావించకుండానే పంపిన రికార్డులపై ఏఈవోతో పాటు ఇతర సిబ్బంది ఎలా సంతకం చేశారు? పర్యవేక్షించేవారు లేకనే ఆలయంలో ఇలాంటి లొసుగులు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాపాడాల్సిన కంచే కళ్లు మూసుకుందా?

ఈ వ్యవహారంలో చర్యలు చేపట్టాల్సిన టీటీడీ విజిలెన్స్ విభాగం కళ్లు మూసుకున్నట్లు కనిపిస్తోంది. గతంలోనే కొందరు టీటీడీ సిబ్బంది ఈ వ్యవహారాన్ని విజిలెన్స్ ఉన్నతాధికారిణి కళావతి దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని తెలిసింది. ఆమెతో మాట్లాడేందుకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.

మూడేళ్ల బాలుడ్ని హత్య చేసిన తండ్రికి జీవిత ఖైదు

ఒంగోలుక్రైం, మార్చి20 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో మూడేళ్ల కుమారుడిని దారుణంగా హత్య చేసిన తండ్రికి జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నెల్లూరు జిల్లా నుంచి బేల్దారి పనులు కోసం వచ్చి ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం ఎల్లయ్యనగర్‌లో నివాసముంటున్న షేక్ ఖాదర్‌వలి నిత్యం భార్యను అనుమానిస్తుండేవాడు. కుమారుడు షాహుల్(3) తనకు పుట్టలేదంటూ భార్యను వేధిస్తుండేవాడు. 2018 నవంబరు 30న ఖాదర్ వలి మోటార్‌సైకిల్‌పై కుమారుడిని ఎక్కించుకొని బూదవాడ సమీపంలోకి తీసుకెళ్లి హత్య చేసి ఎర్రకొండలో పూడ్చివేశాడు. అతని భార్య సాల్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చీమకుర్తి పోలీసులు దర్యాప్తు చేశారు. ఖాదర్‌వలిని అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.వసుంధర వాదనలు వినిపించారు.

దక్షిణ మధ్య రైల్వేకు రాజ భాషా పురస్కారం

- విజయవాడ డివిజన్‌కు ఆచార్య రఘువీర్ చల్ వైజయంతి అవార్డు

హైదరాబాద్ సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో దక్షిణ మధ్య రైల్వేకు రాజ భాషా పురస్కారం లభించడం గర్వకారణమని జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. ఈ పురస్కారాన్ని రైల్వే బోర్డు చైర్మన్ సతీశ్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్న ముఖ్య రాజ భాషాధికారి, ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్ మేనేజర్ రాజేశ్ ఖడేను అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు. అలాగే, విజయవాడ డివిజన్‌కు లభించిన ఆచార్య రఘువీర్ చల్ వైజయంతి పురస్కారాన్ని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర పాటిల్ స్వీకరించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తర్లుపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ప్రకాశం జిల్లాలో ఓ రైతు బుధవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం ప్రకారం.. తర్లుపాడు మండలం పోతలపాడు గ్రామానికి చెందిన రాచకొండ శీను(50) తన నాలుగు ఎకరాల భూమితోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, టమోటా, కంది పంటలు సాగు చేశాడు. ఈ ఏడాది కూడా 3 ఎకరాల్లో మిర్చి వేశాడు. వరుసగా మూడేళ్ల నుంచి పంటలు తెగుళ్ల బారిన పడటంతో దిగుబడులు రాలేదు. వచ్చిన కొద్దిపాటి పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో సుమారు రూ.10 లక్షల మేర అప్పులయ్యాయి.



శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం, హాజరైన భక్తజనసందోహం

నమో నారసింహా!

వైభవంగా ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

కదిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో పుర వీధులు మార్మోగాయి. రథంపై దేవదేవుడిని వీక్షించిన భక్తులు.. తన్మయత్వంతో నమో నారసింహ అని నినాదాలు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనది బ్రహ్మరథోత్సవం. ఈ వేడుకకు రాయలసీమ, కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి బ్రహ్మరథోత్సవం గురువారం ఉదయం 8.16 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3.56 గంటలవరకూ సుమారు 7.40 గంటల పాటు కొనసాగింది. ఖాద్రీ లక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మరథోత్సవాన్ని వీక్షించడానికి తరలివచ్చిన భక్తులతో కదిరి వీధులన్నీ బుధవారం రాత్రి నుంచే కిక్కిరిశాయి. రథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడిని దర్శించుకోవడానికి భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. నిప్పులు చెరిగే ఎండను సైతం లెక్కచేయకుండా మిద్దెలు ఎక్కారు. రోడ్లపై నిలబడ్డారు. 'నాలుగు గోపురాల వాడా.. గోవిందా.. లక్ష్మీ నారసింహా.. గోవిందా' అంటూ రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఉత్సవం ముగిసిన తర్వాత ఆలయంలో శ్రీవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు.

దక్షిణాదిపై హిందీని రుద్దడాన్ని వ్యతిరేకించండి

- 'విపక్ష విముక్త్'కు వ్యతిరేకంగా రాష్ట్రాలు ఉద్యమించాలి
- ప్రజలు విశాల ఉద్యమాలకు సిద్ధమవ్వాలి
- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపు

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం పేరిట త్రిభాషా సూత్రాన్ని హిందీయేతర రాష్ట్రాలపై బలవంతంగా రుద్దాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వాలు తిప్పికొట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) పిలుపునిచ్చింది. దక్షిణాది రాష్ట్రాలపై బలవంతంగా హిందీని రుద్దే చర్యలను నిరసిస్తూ ప్రజలు విశాల ఉద్యమాలకు సిద్ధమవ్వాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ కోరింది. యూజీసీ నూతన నిబంధనలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల వైఖరిని మావోయిస్టు పార్టీ సమర్థిస్తోందని తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో ప్రతిపక్షాలే లేకుండా చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల దుష్ట లక్ష్యమైన విపక్ష్ విముక్త్‌కు వ్యతిరేకంగా రాష్ట్రాలు ఉద్యమించాలని, తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని అభయ్ కోరారు. మావోయిస్టు ముక్త్‌భారత్ పేరుతో కేంద్రప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ అంతటితోనే ఆగదని, దేశాన్ని కార్పొరేటీకరణ, సైనికీకరణ చేస్తుందని, హిందుత్వ విధానాలను వ్యతిరేకించే ప్రతిపక్షపార్టీలన్నింటినీ అర్బన్ నక్సల్స్‌గా, దేశద్రోహులుగా చిత్రీకరించి దాడిచేసేవరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కగార్ దాడులను కూడా వ్యతిరేకించాలని ప్రతిపక్ష పార్టీలను కోరారు. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయనందుకు తమిళనాడు రాష్ట్రానికి సర్వశిక్ష అభియాన్ కింద ఇవ్వాల్సిన రూ.2వేల కోట్లను కేంద్రం నిలిపివేసి బెదిరిస్తోందని , ఇది నియంతృత్వ చర్య అని విమర్శించారు. వన్ నేషన్, వన్ రేషన్ కార్డు, వన్ పవర్‌గ్రిడ్, వన్ ట్యాక్స్, వన్ పోలీసు, వన్ లాంగ్వేజీ, వన్ సివిల్‌కోడ్, వన్ ఎలక్షన్, ఏక్ భారత్ శ్రేష్ఠ్‌భారత్ పేరుతో బీజేపీ తన విధానాలను దేశంపై బలవంతంగా రుద్దాలని చేస్తోందన్నారు. ఈ ప్రయత్నాలను ప్రతిపక్షపార్టీలు, ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. ఇందుకోసం ప్రజలు చేసే ఉద్యమాలకు తమ మద్దతు ఉంటుందని అభయ్ ప్రకటించారు.

7,378 కిలోల గంజాయి నిర్వీర్యం

- 3 జిల్లాల్లో 226 కేసుల్లో సీజ్ చేసిన పోలీసులు
- మూలాలు గుర్తించి బాధ్యులపై చర్యలు
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



గంజాయి నిల్వలు నిర్వీర్యం చేస్తున్న దృశ్యం

లావేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 'గంజాయి సమూల నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టాం. మాదక ద్రవ్యాలతో సంపాదించిన ఆస్తులను జప్తు చేస్తాం' అని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి హెచ్చరించారు. ఇటీవల శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పోలీసులు 226 కేసుల్లో 7,378 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఈ గంజాయి నిల్వలను శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాతకుంకాం గ్రామంలోని రైన్‌బో ఇండస్ట్రీ వద్ద గురువారం డీఐజీ పర్యవేక్షణలో ముగ్గురు ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, వకుల్ జిందాల్, ఎస్వీ మాధవరెడ్డి సమక్షంలో నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. 'విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, వాటి మూలాలను గుర్తించి, బాధ్యులపై కేసులు నమోదు చేశాం. అనకాపల్లి జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 34,419 కిలోల గంజాయి, 39.4 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను నిర్వీర్యం చేశాం. రెండో దశలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత నెల 3,075 కిలోల గంజాయిని, 25.5 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను నిర్వీర్యం చేశాం. మూడో దశలో గురువారం శ్రీకాకుళం జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. గడచిన 8 నెలల్లో గంజాయి పూర్తిస్థాయి నిర్మూలనలో భాగంగా 524 కేసుల్లో 31,768 కిలోల గంజాయిని, 120.5 లీటర్ల హాషిష్, 372 వాహనాలను సీజ్‌చేసి 2,050 మంది నిందితులను అరెస్ట్ చేశాం. ఇందులో 575 మంది అంతరాష్ట్ర నిందితులు ఉన్నారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో విజయనగరం, అనకాపల్లి జిల్లాలో ఆస్తులు జప్తు చేశాం. రేంజ్ పరిధిలో గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన 86 మందిని డి-అడిక్షన్ కేంద్రాలకు పంపించి కౌన్సెలింగ్ ఇచ్చాం' అని తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

మహత్తర విజయం

ఎనిమిదిరోజుల అంతరిక్ష యాత్రకని వెళ్ళిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు తొమ్మిదినెలల తరువాత తిరిగివచ్చారు. అంతరిక్ష కేంద్రం నుంచి పదిహేడు గంటల ప్రయాణం తరువాత, వాళ్ళను భద్రంగా దాచుకున్న స్పేస్‌ఎక్స్ డ్రాగన్ కాప్సుల్ ఫ్లోరిడా సముద్రజలాలను తాకి, కెరటాల మీద తేలుతున్న దృశ్యం చూసిన ప్రపంచజనం మనసులు ఆనందంతో పులకించిపోయాయి. వారి రాకను డాల్ఫిన్లు సైతం స్వాగతించాయంటూ సామాజిక మాధ్యమాలు మనసు పారేసుకున్నాయి. వారిద్దరూ చిక్కుకున్నారనో, తిరిగి తేలేకపోయామనో అంటే నాసాకు మాచెడ్డ కోపం వస్తుంది కనుక, అనువైన కాలం కోసం ఇంతకాలం వేచివున్నట్టుగా దాని పరిభాషలోనే చెప్పుకోవాలి. మొన్నటివరకూ బైడెన్ అధ్యక్షుడుగా ఉండబట్టే వీరిద్దరూ అక్కడే ఉండిపోయారని, తాను రావడంతోనే వీరికీ కాలం కలిసొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంటున్నారు. శాస్త్రవేత్తలిద్దరినీ కిందకు దించుతానని ప్రపంచానికి హామీ ఇచ్చి, స్పేస్ ఎక్స్ మస్క్‌కు బాధ్యత అప్పగించి, చెప్పింది చేసి చూపించానని ట్రంప్ చెప్పుకున్నారు. అధ్యక్షులవారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని మస్క్ మందహాసం చేశారు. మాకు శాస్త్రమే తెలుసు తప్ప ఈ రాజకీయాలు పట్టవని నాసా ప్రతినిధి ఓ మాటన్నారు. యాభైతొమ్మిదేళ్ళ వయసులో సునీతావిలియమ్స్ చేసిన సాహసాన్ని మనసారా మెచ్చిన ఆమె తల్లి కూడా అదే అంటున్నది. ఎవరు ఏమైనా అనవచ్చు కానీ, ఒక్కమాటలో చెప్పాలంటే ఇది సైన్స్ సాధించిన అద్భుత విజయం. యావత్ శాస్త్ర ప్రపంచం సంబరాలు చేసుకోవాల్సిన సందర్భం. అంతరిక్ష పరిశోధనలకు, ప్రయోగాలకు మరింత శక్తినీ, యుక్తినీ, సమధికోత్సాహాన్ని అందించిన ఘట్టం.

తిరుగు ప్రయాణమవుతున్న తరుణంలో సునీత ఒక మాటన్నారు. అంతరిక్షం నుంచి చూస్తే భూగోళం మాత్రమే కనిపిస్తుంది, దేశాల మధ్య సరిహద్దులు కనబడవని. అంతరిక్ష కేంద్రంలో ఉంటూ, రోజుకు పదహారుసార్లు సూర్యోదయ సూర్యాస్తమయాలను చూస్తున్నప్పుడు ఆమెకు ఇటువంటి భావనలనేకం కలిగివుంటాయి. హద్దులన్నీ మనిషి సృష్టించుకున్నవేనని అనిపించివుంటుంది. బోయింగ్ క్రూకాప్సుల్ పనితీరు అంచనావేయడానికి వెళ్ళి, ఎనిమిది రోజుల్లో వెనక్కు రావాల్సిన వాళ్ళు, 286రోజులు చిక్కుబడిపోయి కూడా చెదరకుండా ఉండటం సామాన్యమైన విషయం కాదు. పది నిముషాలు నిరీక్షించాల్సివచ్చినా, ఎవరికోసమో ఎదురుచూడాల్సి వచ్చినా, రోడ్డుమీద చిక్కుబడిపోయినా మనిషి విసిగెత్తిపోతాడు. అనుకున్నది అనుకున్నట్టుగా జరగనప్పుడు, ఆశించినది వెంటనే దక్కనప్పుడు నీరుగారిపోతాడు, లేదంటే వీరంగం వేస్తాడు. అటువంటిది భారరహిత స్థితిలో, కాళ్ళు గట్టిగా సాగదీసుకోవడానికి వీల్లేని ఒక అగ్గిపెట్టెలాంటి గదిలో, నాలుగడుగులు వేసిరావడానికి కుదరని నిర్బంధంలో అంతకాలం మనుగడసాగించాలంటే దేహదారుఢ్యం ఒక్కటే చాలదు. మనోనిబ్బరంతో సమస్యను ఎదుర్కోవడానికి, ఊహలో కూడా లేని ఇబ్బందిని అధిగమించడానికి, ఆ నిర్బంధస్థితిని సదవకాశంగా మలుచుకోవడానికి, సమయాన్ని సద్వినియోగపరచడానికి ఎంతో కర్తవ్యనిష్ఠకావాలి. మనసు గాడితప్పకుండా, బుద్ధి తిరిగిపోకుండా నియంత్రణ, నిగ్రహం కావాలి. తమకు అప్పగించిన పనినేకాదు, అవాంతరాన్ని సైతం అవకాశంగా ఉపయోగించుకొని శాస్త్రవేత్తలు ఇద్దరూ మానవాళి శ్రేయస్సుకు ఉపకరించే పరిశోధనలు అనేకం చేశారు.

నింగినుంచి నేలమీదకు దిగుతామన్న నమ్మకం ఒకదశలో పూర్తిగా నశించిపోయిన దశలో కూడా వారు చెదరలేదు. ఇరువురి ఆరోగ్యం బాగా పాడైందంటూ కొంతకాలంగా వచ్చిన వరుస విశ్లేషణల్లో ఎంత నిజం ఉన్నదో లేదో తెలియదు కానీ, ఇంతకాలం ఆకాశాన ఉండిపోయినందుకు సమస్త అవయవాలూ దుష్ప్రభావాన్ని చవిచూడటం సహజం. అయినా, నీటిమీదవాలిన అనంతరం కాప్సుల్ తలుపులు తెరుచుకోగానే ఆ శాస్త్రవేత్తల్లో వీసమెత్తు విచారం కానీ, బాధలూ భావోద్వేగాలు కానీ కనబడలేదు. చెరగని ఆ చిరునవ్వులు, విజయ చిహ్నాలు, కళ్ళలో కాంతులు, చక్కని పలకరింపులు చరిత్రలో నిలిచిపోతాయి. సురక్షితంగా భువికి దిగివచ్చిన శాస్త్రవేత్తలు సంపూర్ణ ఆరోగ్యంతో, పరిపూర్ణమైన ఆయుష్షుతో ఆనందంగా ఉండాలని కోరుకుందాం.

ఇరవై రెండు భాషలకూ అధికార హోదా

భారత గణతంత్ర రాజ్య అధికార భాషగా హిందీ! ఇంకెంతకాలం ఈ ప్రహసనం? జరూరుగా ముగించేద్దాం. ఈ పరిత్యజనం వల్ల హిందీ ప్రాభవానికి ఎటువంటి హాని సంభవించదు. నిరంతరం బాల రాజు హోదాలో ఉండడం వల్ల హిందీకి మేలు జరగదు; దేశ శ్రేయస్సుకూ తోడ్పడదు. ఈ హోదా తగ్గింపు హిందీని వివిధ భారతీయ భాషలతో సమస్థాయిలో కలుపుతుంది. నష్టమేమిటి? దానివల్ల అసలు భాషా వివక్షకు కారణమైన ఆంగ్ల భాషా సామ్రాజ్యవాదంపై తీవ్ర చర్చను నిరోధిస్తున్న 'హిందీ విధింపు' అన్న భావావేశాల దారి మళ్లింపు వ్యవహారం అన్న అడ్డు తొలగిపోతుంది. ఇది, భావాలలో స్వరాజ్యం దిశగా ఒక గొప్ప ముందడుగు అవుతుందేమో!

హిందీ భాష విషయమై గత 75 సంవత్సరాలుగా అనుసరిస్తున్న విధానం ఆశించిన లక్ష్యాలను నెరవేర్చకపోగా ప్రతికూల ఫలితాలను మాత్రమే ఇస్తోంది. మాట్లాడే ప్రజల సంఖ్య అత్యధికంగా ఉన్న కారణంగా భారతీయ భాషా ప్రపంచ వైవిధ్యంలో హిందీకి ఒక ప్రత్యేక స్థానమున్నది. జనాభా గణన ప్రక్రియలో హిందీ భాష మాట్లాడే వారుగా వర్గీకృతమైన జనుల సంఖ్య 60 కోట్లకు (దేశ జనాభాలో 42 శాతంకు) పైగా ఉన్నది. ప్రపంచంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాషలలో హిందీ నాల్గవ స్థానంలో ఉన్నది. మరే ఇతర భారతీయ భాషకు ఇటువంటి ప్రాధాన్యం లేదు, పొందలేదు కూడా. బహు భాషామయమైన మన జాతి జీవితంలో హిందీ ఒక వారధిగా ఉపయోగపడగలదు. అయితే తనలో అంతర్గతం చేసుకున్న బహు భాషల మూలాలను, ఇతర భారతీయ భాషలకు విస్తరించిన తన ప్రభావాన్ని నిలుపుకుని అభివృద్ధిపరచుకోగలిగితే హిందీ ఒక వారధి భాషగా తప్పకుండా వెలుగొందుతుంది. భారతీయ భాషా జగత్తులో అత్యున్నత హోదాను ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరి నుంచి గౌరవాదరాలను అపేక్షించే 'శుద్ధ' హిందీ అంతిమంగా మతతత్వానికి ఆలంబన అవుతుంది. సాంస్కృతిక విభేదాలను పెంచి, జాతీయ సమైక్యతను బలహీనపరుస్తుంది.



హిందీ వ్యాప్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాల కంటే– బాంబే సినిమా, క్రికెట్ కామెంటరీ, టీవీ న్యూస్, టీవీ సీరియల్స్– ఎక్కువ సత్ఫలితాలు సాధించాయి. హిందీని ప్రమోట్ చేయడానికి బదులు భారతీయ భాషలను ప్రోత్సహించడం, అభివృద్ధిపరచడమే జాతీయ లక్ష్యం కావాలి. ప్రతి ఒక్కరికీ మాతృభాషలో విద్య సమకూర్చాలనే విద్యాహక్కు నిర్దేశాన్ని అమలుపరిచేందుకు చిత్తశుద్ధితో పూనుకోవాలి. హిందీ ప్రజల భాష. అది అలా ఉండిపోవడమే దానికి అన్ని విధాల మేలు.

హిందీకి అధికార భాష హోదా దానికి మేలు చేయకపోగా హాని మాత్రమే చేసింది. తనలో అంతర్గతం చేసుకున్న భాషలకు సవతి తల్లిగాను, ఇతర భారతీయ భాషలకు అత్తగారుగాను పరిణమించింది. అటూ ఇటూ ఎవరి నుంచి గౌరవాన్ని పొందలేకపోతోంది. దీనికి తోడు ఇప్పుడు హిందీని దేశవ్యాప్తంగా అధికార భాషగా చేసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలతో పరిస్థితులు మరింతగా విషమించాయి. ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయుడు రఘువీర్ సహాయ్ తన 'హమారి హిందీ' అన్న కవితలో భార్యను కోల్పోయిన సంపన్న వృద్ధుడి కొత్త, పడుచు భార్యగా పోల్చాడు! ఆయన ఆ పద్యం ఆరు దశాబ్దాల క్రితం రాశారు. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. ఏమైనా మార్పు ఉంటే అది ఆంగ్ల భాష తన స్థానాన్ని మరింతగా బలోపేతం చేసుకోవడమే. హిందీ భాష మాట్లాడే ప్రజలు అందరూ తమ బిడ్డలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో చేర్పించేందుకే ఆరాటపడుతున్నారు. హిందీ రాష్ట్రాలలోని మధ్యతరగతి' విద్యావంతులలో ఎంతమంది హిందీ దినపత్రికను చదువుతున్నారు? ఇంట వారు మాట్లాడే భాష అటు హిందీనూ కాదు, ఇటు ఆంగ్లమూ కాదు. రెండిటి మిశ్రమం. అదొక సంకర భాష. ఆంగ్లంతో సరిచూసినప్పుడు హిందీ ఎంత అప్రధానంగా ఉంటుందో నిత్య సామాజిక జీవితంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సులకు హిందీ దినపత్రికల నిండా వాణిజ్య ప్రకటనలే. తల్లిదండ్రులు తమ బిడ్డలను అతిథులకు వచ్చీరాని ఆంగ్లంలో పరిచయం చేస్తుంటారు. యువజనులు తమ స్నేహితుడు లేదా స్నేహితురాలును ఆకట్టుకునేందుకు వచ్చీరాని ఆంగ్లంలో వింతగా మాట్లాడుతుంటారు! ఆంగ్లానికి విలువ పెరుగుతోంది. హిందీకి ఆదరణ తగ్గుతోంది.



■ యోగేంద్ర యాదవ్

ప్రపంచపు నాల్గవ అతి పెద్ద భాషను దానిని మాట్లాడే రాష్ట్రాలలోనే బోధించడం సాధ్యం కావడం లేదు. ఇక హిందీని నేర్చుకోవాలని ఇతరులను ఎలా బలవంతపెట్టడం? హిందీ మాతృభాషగా ఉన్న ఐదవ తరగతి గ్రామీణ విద్యార్థులలో రెండవ తరగతి హిందీ పాఠ్యగ్రంథంలోని పాఠాలను ఒక పేరా కూడా తప్పులు లేకుండా చదవలేకపోతున్నారని అసర్ సర్వే వెల్లడించింది. హిందీ మాధ్యమంలో కళాశాల విద్యను అభ్యసించిన పట్టభద్రులు వ్యాకరణయుక్త హిందీని రాయలేకపోతున్నారు. వారి హిందీ పదాల అక్షర క్రమం కూడా సరిగ్గా ఉండదు. మరీ ముఖ్యంగా హిందీ భాష ఒక మేధో సంస్కృతిని సృష్టించనేలేదు. ప్రపంచ స్థాయి ఉత్తమ సాహిత్యాన్ని హిందీ రచయితలు సృజిస్తున్నారు. అయితే హిందీ రాష్ట్రాల ప్రజానీకంలో ఎంత మంది సమకాలీన మహా రచయిత వినోద్ కుమార్ శుక్లా పేరును గుర్తుపట్టగలరు? అసాధారణ పాత్రికేయులు ఉన్నారు. అయితే ఉత్తమ, ఉత్కృష్ట పాత్రికేయానికి ఆలంబనగా ఉన్న వార్తా పత్రిక ఒక్కటీ లేదు కదా. అధునాతన వైజ్ఞానిక, సాంకేతిక, సామాజిక శాస్త్రాల విషయం అటుంచండి, ఏ విద్యా విభాగంలోను లక్షలాది విద్యార్థుల అవసరాలను తీర్చే పాఠ్య గ్రంథాలు లేనే లేవు. మరి హిందీ మాధ్యమంలో ఉన్నత విద్యాభ్యాసం వల్ల ప్రయోజనమేముంది? నవీన భావాల వ్యాప్తికి దోహదం చేసిన చివరి హిందీ మ్యాగజైన్ దిన్ మాన్ (కాకతాళీయంగా దీనికి ఎడిటర్ రఘువీర్ సహాయ్) యాభై సంవత్సరాల క్రితమే మూతపడింది.

పాఠశాలలో హిందీలో మాట్లాడితే బాలలకు జరిమానా విధించే పరిస్థితులు ఉన్న దేశం మనది. మరి హిందీ ఆధిపత్యం గురించి మాట్లాడడం ఒక క్రూర పరిహాసమే సుమా! ఆధిపత్యంలో ప్రభావశీల నియంత్రణ, సాంస్కృతిక న్యాయబద్ధత అంతర్గతంగా ఉంటాయి. హిందీకి ఇవేవీ లేవు. భారతీయ పాలకవర్గాల భాష ఇంగ్లీష్. దానికి సాంస్కృతిక ప్రాబల్యమున్నది. ఆర్థిక వనరులు ఉన్నాయి. శక్తిమంతమైన విద్యా సంబంధిత పరిశ్రమ మద్దతు ఉన్నది. ఆ భాష ఎవరి మీదైతే పెత్తనం చేస్తుందో వారు దానిని రక్తగతం చేసుకున్నారు. సాంస్కృతిక అధిపత్యమంటే ఇదే కదా?

హిందీ భాషా దురభిమానులు ఎంతగా అహంకారాన్ని ప్రదర్శిస్తున్నా హిందీని హిందీయేతర భాషల వారిపై రష్యన్ భాషను, సోవియట్ యూనియన్‌లో రష్యన్ భాషను, రష్యనేతర ప్రజలపై రుద్దినట్టు రుద్దలేదు. భారతీయ భాషా వైవిధ్యాన్ని గౌరవించడం వల్లే భారత గణతంత్ర రాజ్యం సమైక్యంగా మనగలుగుతోంది. అయితే హిందీ విధింపు అన్న ఆరోపణలో నిజం లేకపోలేదు అధికార భాషగా హిందీని ప్రోత్సహించడం దాని సాధికారతకు చేసిన మేలు ఏమీ లేదు. బిల్ బోర్డులు, నేమ్ బోర్డులు హిందీలోనే ఉండాలనడం హిందీయేతర భాషల వారికి ఆగ్రహం కలిగిస్తోంది. భారత ప్రభుత్వం కొత్త పథకాలకు, కార్యక్రమాలకు, చట్టాలకు కూడా హిందీ లేదా సంస్కృతంలో పేర్లు పెట్టడం హిందీయేతర భాషల వారికి చిరాకు కలిగిస్తోంది. దీనికి తోడు హిందీ భాషీయులు తమది 'జాతీయ భాష' అని ఎల్లవేళలా ఘోషించడం ఆ భాష పట్ల వ్యతిరేకతను మాత్రమే పెంచుతోంది. హిందీ 'జాతీయ భాష' అనేందుకు ఎలాంటి చట్టబద్ధత గానీ, రాజ్యాంగ బద్ధత గానీ లేదు కదా. కేవలం ప్రభుత్వ కార్యాలయాలలో మాత్రమే అది అధికార భాషగా పరిగణింపబడుతోంది. దీని పర్యవసానాలు పూర్తిగా ప్రతికూలంగా ఉంటున్నాయి.

ఈ వాస్తవాల దృష్ట్యా నేను ఒక ప్రతిపాదన చేస్తున్నాను. రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూలులోని 22 భాషలకు అధికార భాష హోదా కల్పించాలి. మనకు ఒక జాతీయ అధికారిక, లేదా అనుసంధాన భాష అవసరం లేదు. సెప్టెంబర్ 14ను హిందీ దినోత్సవంగా కాకుండా భారతీయ భాషలు అన్నిటినీ గౌరవించేందుకు భాషా దినోత్సవంగా నిర్వహించాలి. హిందీని ప్రోత్సహించేందుకు శత విధాల చేస్తున్న ప్రయత్నాలు అన్నిటినీ భారత ప్రభుత్వం నిలిపివేయాలి. అనుసంధాన భాష అవసరమైనవారు దానిని తమకు తామే ఎంపిక చేసుకోవాలి. అనుసంధాన భాషగా గౌరవం పొందాలని హిందీ ఆశిస్తుంటే ఇతర భాషలతో సంకరమయ్యేందుకు సిద్ధమవ్వాలి. 'సరైన' హిందీని నిర్ణయించి నమోదు చేసేందుకు ఒకటి గాక బహుళ సంస్థలను అనుమతించాలి.

హిందీని ప్రమోట్ చేయడానికి బదులు భారతీయ భాషలను ప్రోత్సహించడం, అభివృద్ధి పరచడమమే జాతీయ లక్ష్యంగా ఔదలదాల్చాలి. 'ఇంగ్లీష్‌ను బహిష్కరించాలి' అన్న ఒకనాటి లోహియా నినాదం ఇంకెంత మాత్రం పనిచేయదు. 'భాషలను అభివృద్ధిపరచడమే' మన ఉద్ఘోష కావాలి. ఉద్యమ ఉద్వేగంతో, సంకల్ప శుద్ధితో ఈ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలి. మొత్తం 22 భాషలలోను ఉన్నత విద్యకు అవసరమైన పుస్తకాలు అన్నిటినీ అనువాదం చేసుకోవాలి. బాలసాహిత్యాన్ని పునః సృజించుకోవాలి. ఇందుకు అవసరమైన ఆర్థిక వనరులు ప్రభుత్వం సమకూర్చాలి. దీనితో పాటు 'మాండలికాలు'గా మాత్రమే పరిగణన పొందుతూ, ఎనిమిదో షెడ్యూలులో లేని కనీసం 100 భాషలను కాపాడేందుకు అవసరమైన సంస్థలను ఏర్పాటు చేసి వాటికి అన్ని విధాల మద్దతునివ్వాలి. ప్రతి ఒక్కరికీ మాతృభాషలో విద్య సమకూర్చాలనే విద్యాహక్కు నిర్దేశాన్ని అమలుపరిచేందుకు చిత్తశుద్ధితో పూనుకోవాలి. హిందీ ప్రజల భాష. అది అలా ఉండిపోవడమే దానికి అన్ని విధాల మేలు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఒక పెద్ద ఆటలో జెలెన్‌స్కీ ఒక చిన్న బుడంకాయ. ఈ బుడంకాయకు భవిష్యత్తు లేదు. అతడు అమెరికా, యూరపు నాయకుల రాజకీయ క్రీడలో ఒక పావు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైన నాటినుంచీ, ఈ బంటుని యూరప్, అమెరికాలు బాగా మేపుతూ వచ్చాయి. ఈ గారాబం జెలెన్‌స్కీ తలకెక్కింది. ట్రంప్ వచ్చాక అదంతా మారిపోతోంది.



జెలెన్‌స్కీ హీరో కాదు, జీరో

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకీ మధ్య వాషింగ్టన్ ఓవల్ ఆఫీసులో జరిగిన వాగ్యుద్ధం ఒక ప్రపంచ సంచలనం అయింది. యూరపునైతే అది కుదిపేసింది.

ఇటీవల అమెరికా పాలకుల స్వభావం మారలేదు కాని వారి ఎత్తుగడలలో చీలిక వచ్చింది. అమెరికా తన లక్ష్యాలను తిరిగి వేరుగా నిర్వచించుకోవాలి అన్న ధోరణికి ప్రతినిధి డొనాల్డ్ ట్రంప్. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మాటల్లో చెప్పాలంటే, "నగరానికి కొత్త షెరీఫ్ వచ్చాడు." అంటే రంగంలోకి ట్రంప్ వచ్చాడు. ట్రంప్ వచ్చీరాగానే అమెరికా పాత ఏర్పాటుని మార్చే పనిని హడావుడిగా మొదలుబెట్టేసాడు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక రంగాలలో ఈ డబడబలూ పెనుకంపాలు అందుకే.

రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుంచీ ప్రపంచంలో తిరుగులేని ఆర్థిక శక్తిగానూ సైనిక శక్తిగానూ ఏపుగా ఎదుగుతూ వచ్చిన అమెరికా ప్రపంచానికి పెద్దన్న అయింది. ఇప్పుడు అమెరికా ఆటలకి అడ్డుకట్ట వేసే శక్తులు క్రమంగా రంగంలోకి వచ్చాయి. చైనా ఒక కొత్త సామ్రాజ్య శక్తిగా, ఆర్థిక శక్తిగా సవాలు విసురుతోంది. రష్యా కొంత కోలుకొని నిలబడింది. మరోవైపు అమెరికా ఆర్థిక పతనం పుంజుకొంటోంది. అమెరికా జాతీయ రుణం 36 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెరిగింది. ఈ సందర్భంలో తమ పాత ఏర్పాటుకి కాలం చెల్లిందనీ, మరో కొత్త "ఏర్పాటు" అవసరమనీ ట్రంపు వర్గం భావిస్తోంది.

ఓవల్ ఆఫీసు డ్రామా తర్వాత, జెలెన్‌స్కీని హీరోగా చూపించే కథనాలు వచ్చాయి. నిజానికి, ఒక పెద్ద ఆటలో జెలెన్‌స్కీ ఒక చిన్న బుడంకాయ. ఈ బుడంకాయకు భవిష్యత్తు లేదు. అతడు అమెరికా, యూరపు నాయకుల రాజకీయ క్రీడలో ఒక పావు మాత్రమే. అతనికి ఒక స్వతంత్ర పాత్ర ఏదీ లేదు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలైన నాటి నుంచీ, ఈ బంటుని యూరపు అమెరికాలు బాగానే మేపుతూ వచ్చాయి. నాటో దేశాల్లో ఎక్కడికెళ్లినా అతడికి డబ్బూ ఆయుధాలూ ఇచ్చి బుజ్జగించారు. ఈ గారాబం జెలెన్‌స్కీ తలకెక్కింది. ట్రంప్ వచ్చాక అదంతా మారిపోతోంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కావడానికంటే ముందే రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ కుదేలయిపోయింది. ఉక్రెయిన్ వాస్తవ పరిస్థితి తెలిసిన నిపుణుల మాట ఇది. ఆ సంగతి జెలెన్‌స్కీకి తెలుసు. అయితే తన కుక్క చావుని, ప్రపంచానికి ఒక వీర మరణంగా చూపించాలన్న కోరిక కూడా ట్రంప్ ముందు అతని కుప్పిగంతులకు మరో కారణం.

మరో విశేషం: సమావేశాన్ని రద్దు చేద్దామని ట్రంప్ ముందు జెలెన్‌స్కీకి కబురుచేశాడు. కాని జెలెన్‌స్కీ మాత్రం వస్తానని పట్టుబట్టాడు. అప్పుడు, జెలెన్‌స్కీ వచ్చేది, కేవలం తమ ఉమ్మడి ఒప్పందం మీద సంతకం చేయడానికి మాత్రమే అని ట్రంపు బహిరంగ ప్రకటన చేశాడు. అంతవరకూ ఉక్రెయిన్‌కి అందించిన భారీ "సాయా"నికి గాను, ఉక్రెయిన్ తన ఖనిజ సంపదపైన వందేళ్ల పాటు అమెరికాకు హక్కులు కల్పించాలి అన్నదే ఒప్పందం. తామిచ్చిన సాయం 350 బిలియన్ డాలర్లని ట్రంప్ చెప్పాడు. సామ్రాజ్యవాదుల "సాయం" మరి అలాగే ఉంటుంది. ఈ ఘోరమైన ఒప్పందం గురించి సమావేశానికి ముందే జెలెన్‌స్కీకి తెలుసు. ఓవల్ ఆఫీసులో కెమేరాల ముందు అతడు ఒక క్షతగాత్రుడిలా డ్రామా ఆడాడు. అక్కడ ఒక దేశ భక్తునిగా, తన దేశం కోసం ట్రంపునయినా ఎదుర్కోగల వీరునిగా అవతారం ఎత్తాడు. ఇప్పుడు ట్రంపుని మంచి చేసుకోడానికి నానా తంటాలు పడుతున్నాడు. ఖనిజ సంపదపై అమెరికాకు హక్కులు రాసివ్వడానికి, దేశాన్ని తాకట్టు పెట్టడానికి అతడు సిద్ధమే. అయితే, యుద్ధం ఆగకూడదు, తన పదవి ఊడగూడదు. ఎంతకాలం? రష్యాని ఓడించే దాకా. అది సాధ్యమా? ఈ ప్రశ్న ఒక రిటైరైన అమెరికా కల్నల్‌ని అడిగితే, ఆయన నవ్వకుండా చెప్పిందిది: రష్యన్లందరూ ఓ ఉదయం లేవగానే నడవడం ఎట్లాగో మర్చిపోతే, అది సాధ్యం.

యుద్ధం కొనసాగితే జనం అన్యాయంగా చచ్చిపోతూనే ఉంటారు. ముఖ్యంగా ఉక్రెయిన్ జనం. యుద్ధం ఆగిపోతే నాశనమయ్యేది, జెలెన్‌స్కీ, అతని ముఠా మాత్రమే. ఉక్రెయిన్‌లో మార్షల్ లా కొనసాగుతోంది. ఎన్నికలు సక్రమంగా జరిగితే జెలెన్‌స్కీ చిత్తుగా ఓడిపోవడం ఖాయం. అందుకే అతడు ఎన్నికలకు వెళ్లడు. మార్షల్ లా పొడిగిస్తాడు. ఎన్నికలు జరపక తప్పని పరిస్థితి ఎదురైతే వాటిని సక్రమంగా జరగనీయడు.

ప్రపంచాన్నంతా అదుపు చెయ్యాలన్న తన పాత ధోరణిని వదులుకోక తప్పదని ట్రంప్ దళం గ్రహించింది. ఇకముందు సమ ఉజ్జీలతో దీర్ఘ కాలంపాటు సాగే యుద్ధాల్లో అది ఇరుక్కోక పోవచ్చు. తాను కొడితే తిరిగి కొట్టలేని అర్భకుల మీద దాడులకే అది పరిమితం కావచ్చు. ఈ క్రమంలో జెలెన్‌స్కీ లాంటి పెంపుడు కుక్కల్ని తగ్గించుకొని వాటిపై గతంలో పెట్టిన మదుపుని వడ్డీతో సహా వెనక్కి తీసుకోవాలనుకోవచ్చు. యూరపుని కూడా అది తన ప్రాధమ్యాల నుంచి తొలగించవచ్చు.

జెలెన్‌స్కీ ట్రంపుని కలవడానికంటే ముందే ఫ్రెంచి అధ్యక్షుడు మాక్రాన్, బ్రిటిషు ప్రధాన మంత్రి స్టార్మర్ ఒకరి తరవాత ఒకరు ట్రంపుని కలిశారు. వారి లక్ష్యం: యూరపు భద్రతకీ, వారి శాంతి దళాల భద్రతకీ అమెరికా హామీ ఇవ్వాలి; రష్యా కొమ్ములు విరగ్గొట్టాలి. ఈ నాయకులకు కావల్సింది శాంతి కాదు; యుద్ధం. అందుకు అమెరికా నడుం బిగించాలి. రష్యాతో పోరాటంలో తమల్ని ముందుండి నడపాలని వారు కోరినప్పుడు, ట్రంపు వారి సైనిక శక్తిని పొగిడి వారికి అమెరికా అవసరం లేదనీ, వారే స్వయంగా రష్యాని ఎదుర్కోగలరని చెప్పి చేతులు దులుపుకొన్నాడు. ఒక బ్రిటిషు విలేఖరి వ్యాఖ్యానించినట్టుగా అంత వరకూ "రాజుగారి విదూషకుల్లాగా" ప్రవర్తించిన ఆ ఇద్దరు యూరపు నాయకులూ ట్రంపు మాటలకి ఏడవలేక నవ్వారు. అమెరికాకి ఇప్పుడు చైనాని నిరోధించడమే ప్రధానం. అమెరికా తన సొంత సహజ సరిహద్దుల్లో, సుస్థిరం కావాలనుకొంటోంది. సహజ సరిహద్దులు అంటే, కెనడా, మెక్సికో, గ్రీన్‌లాండు, పనామా కెనాల్ తదితరాలు.

ఇక, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మాటకొస్తే, ఇప్పటికే రష్యా దాదాపు జయించింది అన్నది నిపుణుల అంచనా. ఉక్రెయిన్ భూభాగాలను రష్యా ఎంత ఆక్రమించింది అన్నది ఇక్కడ గీటురాయి కాదు. అది ఉక్రెయిన్ సైనికశక్తిని ఎంత నిర్వీర్యం చేసింది అన్నదే ప్రధానం. ఇప్పుడు ఉక్రెయిన్‌కి రిజర్వు దళాలు అంతమైపోయాయి. రిజర్వు ఆయుధాలూ లేవు. సైనికుల ఆత్మస్థయిర్యం అత్యంత దిగువ స్థాయిలో ఉంది. ప్రజల్లో యుద్ధ విముఖత భారీగా పెరిగింది. జెలెన్‌స్కీ ఓ రాజకీయ జూదరి. తాజా కుర్స్క్ యుద్ధంలో అతడి నడ్డి విరిగింది. యుద్ధ రంగం వదిలిపోతున్న ఉక్రెయిన్ సైనికుల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పుడు, అమెరికా కూడా తన కాడి కింద పడేసింది. యూరపు దేశాలు మాత్రం మాటల్లో సంఘీభావం ప్రకటించాయి. పాత వార్సా దేశాలైన పోలెండు, మూడు బాల్టిక్ దేశాలతో పాటు స్కాండినేవియన్ దేశాలు కూడా ఉక్రెయిన్‌కి సంఘీభావం తెలిపాయి. ఈ "సంఘీభావాల"న్నీ కలిసినా అంతిమ ఫలితాన్ని మార్చలేవు. ట్రంపుతో చర్చల్లో నెల రోజుల యుద్ధ విరమణకి అంగీకరిస్తూనే, యుద్ధానికి గల మూలకారణాలను తొలగించమంటున్నాడు పుతిన్. అంటే, నాటో సంగతి తేల్చమంటున్నాడు. అంతే కాదు. ఉక్రెయిన్‌కి, విదేశీ సహాయం – ఆయుధాలు, డబ్బు, గుప్త సమాచారం వగైరాలు– ఆగిపోవాలి, అంటున్నాడు.

పక్క నుంచి జెలెన్‌స్కీ గుండెలు బాదుకుంటూ ఏదో అరుస్తూనే ఉన్నాడు. వినేవాడే లేడు.

● ఎ. గాంధి

(సంపాదకుడు, పీకాక్ క్లాసిక్స్)

వాస్తవాలకు దూరంగా భూరికార్డులు

నమ్మకమైన భూమి రికార్డు లేకుండా, హేతుబద్ధమైన, చట్టబద్ధమైన భూపరిపాలన అసాధ్యం. నేడు మండలం నుంచి జిల్లా స్థాయి వరకూ వచ్చే భూసంబంధిత ఫిర్యాదులలో చాలా మట్టుకు భూమి రికార్డులపైనే ఉంటున్నాయి. ఈ మధ్య ఒక ఆదివాసీ గ్రామ గిరిజనులపై ఏడు ఇంజక్షన్ దావాలు వేసారు. ప్రతివాదులు సాగు అనుభవంలో ఉన్నారు. కాని వారి వద్ద ఎలాంటి లిఖిత సాక్ష్య పత్రాలు లేవు. వారి సాగు అనుభవాన్ని రికార్డు చేయలేదు. ప్రతివాదులు సాగులో లేరు, అయినా వారి వద్ద అన్ని రికార్డులు ఉన్నాయి. మరి కొంత విచారణ చేస్తే, ఈ కేసులు వేయడానికి ముందు వెబ్ లేండ్ భూమి రికార్డులో కావలసిన విధంగా మార్పులు చేసారని తేలింది. మరింత లోతుకు వెళ్తే అల్లసాని పెద్దన్న పేరుతో కొన్ని ఎంట్రీలు ఉన్నాయని తెలిసింది. శ్రీకృష్ణ దేవరాయుల అష్ట దిగ్గజాలు మా ఊరికే వచ్చినట్లు ఉన్నారని ఒక ఆదివాసీ యువకుడు చమత్కరించాడు. నిజానికి ఇవి 1975 భూ సంస్కరణల చట్టం ద్వారా స్వాధీనం చేసుకున్న సీలింగ్ మిగులు భూములు. ఈ కేసులలో కోర్టు సాగులో ఉన్న వారికి వ్యతిరేకంగా తాత్కాలిక ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చింది. అంటే భూ మాఫియా మొదటి రౌండ్‌లో పై చేయి సాధించినట్టే! ఇందుకు కారణం తప్పుడు భూమి రికార్డు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడే నాటికి, రెండు చోట్ల మూడు రకాలైన భూవిధానాలు అమలులో ఉన్నాయి. మద్రాస్‌లో భాగంగా ఉన్న నేటి ఆంధ్రప్రదేశ్‌లో జమీందారీ, రైత్వారీ విధానాలు; తెలంగాణలో నైజాం విధానం అమలవుతూ వచ్చాయి. అందుచేత ఆయా ప్రాంతాలలోని భూమి రికార్డులలో తేడా కనిపిస్తుంది. 1948 జమీందారీ రద్దు చట్టం తరువాత, ఆంధ్ర జమీందారీ ప్రాంతాలలో సర్వే & సెటిల్మెంట్ జరిపి వాటిని రైత్వారీ విధానంలోకి తెచ్చారు. అంతేకాదు, ఇనాముల రద్దు చట్టం, ఆదివాసీ ప్రాంతాలలో ముఠాదారి వ్యవస్థను రద్దు చేసి వాటిని కూడా రైత్వారీ విధానంలోకి మార్చడంతో ఆంధ్ర ప్రాంత భూమి రికార్డుల మధ్య సారూప్యత ఏర్పడింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రెండు రకాలైన భూమి రికార్డులు ఉనికిలోకి వచ్చాయి. తెలంగాణ భూమి రికార్డు, ఆంధ్ర భూమి రికార్డు.

తెలంగాణలో ఒక రెవిన్యూ గ్రామానికి 48 భూమి రికార్డులు ఉండగా, ఆంధ్ర ప్రాంతంలో 38 ఉండేవి. 1976లో తెలంగాణ రికార్డులను 48 నుండి 21కి, 1979లో ఆంధ్ర ప్రాంతంలో 38 నుండి 23కు తగ్గించారు. రెండు ప్రాంతాలలో ఉన్న రికార్డులను ఒకే విధంగా మార్చేందుకు ఒక నిపుణుల కమిటీని వేసారు. ఆ కమిటీ సిఫారసులకు అనుగుణంగా 1992లో ఉమ్మడి రాష్ట్రం అంతటా ఒక రెవిన్యూ గ్రామానికి 11 రికార్డులుగా నిర్ణయించారు.

తప్పులు తడకలుగా తయారైన భూమి రికార్డులనే కంప్యూటరైజ్ చేసారు. ఆ ప్రక్రియలో మరిన్ని తప్పులు జరిగాయి. వాటిని సరిచేయకుండానే ఈ రికార్డులకు సాధికారత కల్పించారు. వెబ్ పోర్టల్ ద్వారా మార్పులు, చేర్పులు మొదలుపెట్టారు. మండల రెవిన్యూ కేంద్రంలోని కంప్యూటర్ అసిస్టెంట్ రైతుల జాతకాలు రాసే విధాతగా మారాడు.



భూమి రికార్డుల అవసరం ఎందుకంటే భూ పరిపాలన కోసం అని జవాబు. భూ పరిపాలన అంటే రైతుల నుంచి భూమి శిస్తు వసూలు మొదటి అవసరం. ఆ శిస్తు కట్టే బాధ్యుడిని గుర్తించడం రెండవ అవసరం. రైతుల నుంచి వచ్చే భూమి శిస్తు ప్రభుత్వ ఆదాయంలో ఒక అప్రధాన వనరుగా మారేకొద్దీ భూమి రికార్డుల యాజమాన్యంపై ప్రభుత్వాలకు ఆసక్తి తగ్గుతూ వచ్చింది.

1984 జనవరి నెలలో భూమి శిస్తును రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చారిత్రకంగా భూమి రికార్డులు ఉనికిలోకి వచ్చిందే శిస్తు వసూలు కోసం. రాజ్యం (స్టేట్) ఆ ఆదాయం వద్దనుకున్నాక వాటి ప్రాథమిక లక్ష్యం ఎగిరిపోయింది. ఉమ్మడి రాష్ట్రం భూమి శిస్తు కమిషనర్ ఆ మిగిలిన 11 రికార్డులలో ఏవి ఉంచాలి, వేటిని తుంచాలి, ఉంచదలచుకున్న రికార్డులలో ఎలాంటి మార్పులు చేయాలనే దానిపై 2004లో అధికారులతో ఒక కమిటీ వేసారు. పనిలో పనిగా భూమి రికార్డుల కంప్యూటరైజేషన్ యోచన కూడా చేయమన్నారు. కమిటీ 65 పేజీల నివేదిక ఇచ్చింది. ఉన్న 11 రికార్డులలో మూడు (భూమి రికార్డులు నెంబర్ 3ఎ, 8, 4బి) అవసరం ఇక లేదని తేల్చారు. మిగిలిన వాటిలో మార్పులను ఆ కమిటీ సూచించింది. అంటే ఒక రెవిన్యూ గ్రామానికి 11 రికార్డుల నుంచి 8కి తగ్గాయి. వీటిలో జనన, మరణాల రిజిస్టర్లు తీసివేస్తే 6 మిగిలాయి.

భూమికి సంబంధించిన రికార్డులు రెవిన్యూ శాఖ వద్ద మాత్రమే కాదు, మరో రెండు శాఖల వద్ద కూడా ఉంటాయి. అవి సర్వే & సెటిల్మెంట్ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖలు. ఈ మూడూ దేనికి అదే స్వతంత్ర శాఖలు. 2006లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కోనేరు రంగారావు కమిటి తన నివేదికలో భూమి రికార్డుల స్థితిపై చర్చించి మూడు సిఫార్సులు చేసింది. ఇందులో– మొత్తం భూమి రికార్డు, భూ పరిపాలనను 'టైటిల్ గ్యారంటీ' (టోరన్స్ సిస్టం)లోకి మార్చాలన్నది మొదటి సూచన. వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద టైటిల్ గ్యారంటీ చట్టానికి మూలాలు ఇక్కడే ఉన్నాయి. మూడు శాఖలను కలిపి ఒకే ఒక సమీకృత భూపరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నది రెండవ సిఫారసు.

భూమి రికార్డుల నిర్వహణ గ్రామ రెవిన్యూ అధికారి చేతిలో వుంటుంది. కరణాల వ్యవస్థ రద్దు తరువాత, గ్రామ రెవిన్యూ వ్యవస్థపై గత 25 సంవత్సరాలలో ఐదుసార్లు మార్పులు చేస్తూ, ప్రయోగాలు చేస్తూ వచ్చారు. అప్పటికే భూమి వాస్తవ పరిస్థితికి, రికార్డులలోని సమాచారానికి దూరం బాగా పెరిగిపోయింది. ఈ ప్రయోగాలు పరిస్థితిని ఇంకా అస్తవ్యస్తంగా మార్చాయి. ప్రతి వ్యవసాయక సంవత్సరంలో నిర్వహించే జమాబందీ అనే రికార్డుల తనిఖీ నిల్చిపోయింది. ఇలా తప్పులు తడకలుగా తయారైన భూమి రికార్డులనే కంప్యూటరైజ్ చేసారు. ఆ ప్రక్రియలో మరిన్ని తప్పులు జరిగాయి. వాటిని సరి చేయకుండానే ఈ రికార్డులకు సాధికారిత కల్పించారు. వెబ్ పోర్టల్ ద్వారా మార్పులు, చేర్పులు మొదలుపెట్టారు.

మండల రెవిన్యూ కేంద్రంలోని కంప్యూటర్ అసిస్టెంట్ రైతుల జాతకాలు రాసే విధాతగా మారాడు. కంప్యూటర్లపై అవగాన లేని తాహశీల్దార్లు కంప్యూటర్ అసిస్టెంట్‌ను కలెక్టర్‌లా చూసుకోవలసి ఉంటుంది. అక్కడితో ఆగలేదు. మొత్తం సమాచారాన్ని వివిధ ప్రభుత్వ శాఖలు, జాతీయ బ్యాంకులకు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయడంతో రైతుల చేతిలో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలకు దమ్మిడీ విలువ లేకుండా పోయింది. సర్వే నెంబర్లు, సబ్ డివిజన్ నెంబర్లు, విస్తీర్ణాలను రాత్రికి రాత్రే మార్చేస్తారు. భూమి వర్గీకరణ మార్చేస్తారు. అసలు మీ పేరే లేకుండా చేసేయగలరు. భూమి మార్కెట్ విలువ ప్రకారం ఇవ్వవలసిన నజరానా ఇవ్వకపోతే మీరు పెట్టుకున్న రిజిస్ట్రేషన్ సమయానికి ఆన్‌లైన్ రికార్డులో ఏమైనా జరగవచ్చు. ఈ ఎంట్రీల ఆధారంగా పీఎమ్ కిసాన్, ఇతర ప్రభుత్వ సహాయాలు, బ్యాంకుల నుంచి అప్పులు, ఆదాయపు పన్ను మినహాయింపులు ఇలా పలు రకాలైన సేవలు పొందవచ్చు. ఈ రికార్డులో ఉన్న సమాచారాన్ని తీసుకునే వ్యవసాయ శాఖ 'ఇ–క్రాప్' బుకింగ్ చేస్తుంది.

ఒక రెవిన్యూ గ్రామానికి 38 భూమి రికార్డుల నుండి 23కు అక్కడ నుండి 11కు తగ్గిపోయాయి. వెబ్ లేండ్ రికార్డు తరువాత రంగం మీద నాలుగు మిగిలాయి. ఇందులో 1) పట్టదార్ల వివరాలు చెప్పే 1B, 2) సాగుబడి రిజిస్టర్ నెంబర్/ అడంగల్ 3) సర్వే నెంబర్ పటం, 4) గ్రామ పటం. వీటిలో మూడు, నాలుగు సెటిల్మెంట్ రికార్డులు. ఇందులో రెండవదైన సాగుబడి రిజిస్టర్/ అడంగల్‌లో, పట్టాదారు వివరాలను, సాగుదారు వివరాలను ఏ వ్యవసాయ సంవత్సరానికి అ వ్యవసాయ సంవత్సరం నమోదు చేయాలి. కాని అది జరగదు. పట్టాదారునే సాగుదారుగా చూపించేస్తారు. వీటికి నకళ్లు తీసుకొని, సాగులోలేని వారు తామే సాగు అనుభవంలో ఉన్నట్లు కోర్టులను నమ్మించి ఇంజక్షన్ ఆర్డర్స్ తెచ్చి భూమి నుండి నిజమైన సాగుదారుని తొలగిస్తూ ఉంటారు.

భూమి రికార్డులు, వాటి యాజమాన్యంలో మార్పులు రాజ్యానికీ, రైతుకూ మధ్య సంబంధాలలో మార్పులకు సంకేతాలు. రైతు నుంచి లభించే శిస్తు వసూలు ఆదాయం ఒకప్పుడు కీలకంగా ఉండిన పరిస్థితి మారి ఇప్పుడు ఒక ఏడాదిలో భూమి ఎన్నిసార్లు చేతులు మారితే అంత లభించే రిజిస్ట్రేషన్ ఆదాయం కీలకమైంది. భూమి రియల్ ఎస్టేట్ సరుకుగా మారింది. సాగుచేయనివారు వ్యవసాయ భూమిని కొనుగోలు చేయకుండా నిలువరించే ఎలాంటి అడ్డంకులు మన రాష్ట్రంలో లేవు. మారుతున్న ఈ కొత్త అవసరం కోసమే, ఆన్‌లైన్ భూమి రికార్డు, ఆఫ్‌లైన్ టైటిల్ గ్యారంటీ.

■ పి.ఎస్. అజయ్ కుమార్

నగరంలో ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి నేరుగా రోడ్డు మార్గంపై ప్రయాణికుల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వేస్టేషన్ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా విమానాశ్రయానికి వెళ్లే మార్గాన్ని పలువురు సూచిస్తున్నారు. దీనివల్ల ప్రయాణం సులభం కావడంతో పాటు నగరంపై ట్రాఫిక్ ప్రభావం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.


బీఆర్‌టీఎస్ రోడ్డు

బీఆర్‌టీఎస్ రోడ్డే బెటర్

రైల్వేస్టేషన్ నుంచి విమానాశ్రయానికి దగ్గరి దారి

- విశాలమైన రోడ్డు కావడం ప్రయాణానికి అనుకూలం
- ఇటు పడవల రేవు నుంచి రైవస్ కాల్వ వెంబడి రామవరప్పాడు రింగ్ వరకు..
- అటు మీసాల రాజారావు బ్రిడ్జి నుంచి రైల్వే ఖాళీ స్థలం మీదుగా రైల్వేస్టేషన్‌కు..
- రోడ్డును అభివృద్ధి చేస్తే నగరంలో ట్రాఫిక్ తగ్గినట్టే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్టును అనుసంధానించటానికి బీఆర్‌టీఎస్ రోడ్డు చక్కటి మార్గం. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు కంటే విశాలమైన రోడ్డు ఇది. యూపీఏ ప్రభుత్వ హయాంలో రూ.154 కోట్లతో జేఎన్ఎన్యూఆర్ఎం పథకంలో భాగంగా అభివృద్ధి పరిచారు. బస్సులు తిరగటానికి వీలుగా ప్రత్యేక డెడికేటెడ్ కారిడార్‌గా దీనిని నిర్మించారు. అలాంటి ఈ మార్గంపై ప్రస్తుతం ఒక్క బస్సు కూడా తిరగట్లేదు. డెడికేటెడ్ మార్గం నిరుపయోగంగా ఉంది. రైల్వేస్టేషన్ నుంచి నగరంలోకి వెళ్లాలంటే ఏలూరు రోడ్డు, బందరు రోడ్డు మార్గాల్లోనే బస్సులు వెళ్తున్నాయి తప్ప బీఆర్‌టీఎస్ రోడ్డును ఉపయోగించట్లేదు. దీనివల్ల ట్రాఫిక్ అంతా ఈ రెండు రోడ్లపైనే ఉంటోంది. వెరసి రామవరప్పాడు రింగ్ వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. విజయవాడ నగరంలో నానాటికీ పెరుగుతున్న అంతర్గత ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని వాహనాల మళ్లింపునకు ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. వీటిని దృష్టిలో ఉంచుకుని రైల్వేస్టేషన్-ఎయిర్‌పోర్టు కనెక్టివిటీగా బీఆర్‌టీఎస్ రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఉంది.


నగరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డు (ఎరుపు రంగు), విస్తరించాల్సిన మార్గాలు (పసుపు రంగులో..)

నగరానికి నడిబొడ్డున..

బీఆర్‌టీఎస్ రోడ్డు అనేది పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల సరిహద్దున సీతన్నపేట ప్రాంతంలో మొదలవుతుంది. మీసాల రాజారావు బ్రిడ్జికి అనుసంధానంగా ప్రారంభమవుతుంది. పడవల రేవు సెంటర్ దగ్గర ముగుస్తుంది. మొత్తం 6.30 కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ రోడ్డును అప్పట్లో పాత సత్యనారాయణపురం రైల్వేలైన్ స్థానంలో ఏర్పాటు చేశారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి పథకం జేఎన్ఎన్యూఆర్ఎం స్కీమ్‌లో భాగంగా రూ.154 కోట్లతో ఈ అధునాతన రోడ్డును నిర్మించారు. బీఆర్‌టీఎస్ పథకంలో భాగంగా నిధులు తెచ్చి రోడ్డును వేశారు కానీ, ఆ తర్వాత బస్సులు తిప్పలేదు. కొద్దిరోజులుగా ఆర్టీసీ బస్సులు తిప్పినా సరైన కనెక్టివిటీ లేకపోవటం వల్ల వయబిలిటీ లేక ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

రైల్వేస్టేషన్‌కు ఇలా కలపొచ్చు

బీఆర్‌టీఎస్ రోడ్డుకు అనుసంధానంగా మీసాల రాజారావు బ్రిడ్జి ఉంది. దీనికి అవతల రైల్వేస్థలం ఉంది. ఈ స్థలంలో కొంతమేర కార్పొరేషన్ అధికారులు రోడ్డు వేసి వదిలేశారు. ఆ తర్వాత రైల్వే అధికారులు తమ స్థలం అని గోడలు కట్టారు. ఈ స్థలం నుంచి కొద్దిగా ముందుకు మిగతా 6లో..



● శభాష్ గద్దె

ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సత్తా చాటారు. పలు విభాగాల్లో ఆయన విజేతగా నిలిచారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో గురువారం జరిగిన ముగింపు ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు.

బెజవాడ వేదికగా బెట్టింగ్ బాగోతం

- హైదరాబాద్ బుల్లితెర నటులతో నగర బుకీలకు లింకులు
- చిట్టినగర్, సత్యనారాయణపురం బుకీలే ప్రధానం
- పంజాగుట్ట పోలీసులకు చిక్కిన ఆధారాలు
- త్వరలో నగరానికి రానున్న తెలంగాణ పోలీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లలో బెజవాడ లింకులు ఉన్నట్టు తెలుస్తోంది. రకరకాల బెట్టింగ్ యాప్‌లకు బుల్లితెర నటులు ప్రమోషన్లు చేసిన విషయం తెలిసిందే. ఈ బెట్టింగ్ యాప్‌ల నివారణ ఉద్యమం తెలంగాణను ఓ ఊపు ఊపుతోంది. ఇప్పటికే 11 మంది బుల్లితెర నటులపై పంజాగుట్ట పోలీసులు కేసులు నమోదు చేసి నోటీసులు అందజేశారు. ఈ కేసు విచారణలో పోలీసులు సాంకేతికంగా చేస్తున్న దర్యాప్తులో కీలక విషయాలు బయటకు వచ్చినట్టు తెలిసింది.



ఇందులో బెజవాడకు సంబంధించిన బుకీల లింకులు బయటపడినట్టు సమాచారం. రకరకాల యాప్‌ల్లో బెజవాడ బుకీలు బెట్టింగులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కొద్దిరోజుల క్రితం జరిగిన వరల్డ్ చాంపియన్ ట్రోఫీలోనూ కోట్ల రూపాయల బెట్టింగులను బుకీలు నిర్వహించారు. ఇప్పుడు ఈనెల 22 నుంచి జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ల్లో పందేలను బెట్టింగ్ యాప్‌ల ద్వారా పరుగులు తీయించడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. విజయవాడకు చెందిన బుకీలు వేర్వేరు పేర్లతో సామాజిక మాధ్యమాల అకౌంట్ల ద్వారా బుల్లితెర నటులను ఫాలో అవుతున్నట్టు పోలీసులు గుర్తించారు.

ఆ ఇద్దరే కీలకం

బెట్టింగ్‌లు నిర్వహించడంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో పేరు మోసిన ఇద్దరు వ్యక్తుల పేర్లు పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ఇందులో ఒకరు చిట్టినగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా, మరొకరు సత్యనారాయణపురానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రస్తుతం బుల్లితెర నటులను విచారణ చేసే పనిలో ఉన్న పంజాగుట్ట పోలీసులు త్వరలో విజయవాడ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. చిట్టినగర్‌కు చెందిన వ్యక్తిపై ఇప్పటికే బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అతడు హైదరాబాదులో ఉంటూ మిగతా 6లో..

ప్రకృతి ఒడిలో.. కొంతకాలం

- నందిగామ నియోజకవర్గం కంచలలో 'తత్వవనం' పేరుతో తొలి పీపీపీ ఎకో టూరిజం ప్రాజెక్టు 8
- వెల్‌నెస్, ఎకో, స్పోర్ట్స్ టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి
- ఏపీటీడీసీతో ఎంవోయూకు నిర్వాహకులు సిద్ధం
- ప్రాజెక్టును సందర్శించిన ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని

ఇదేం భద్రత?

దుర్గగుడిలో భద్రతా చర్యలను వేలెత్తిచూపిన ఆక్టోపస్ టీమ్

పేరుకే రాష్ట్రంలో రెండో అతిపెద్ద ఆలయం. భద్రతలో మాత్రం అధమం. ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భద్రతపై ఇప్పటికే ఎన్నో విమర్శలు వెల్లువెత్తుతుండగా, తాజాగా ఆక్టోపస్ బృందం రెండు రోజుల పాటు నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో వాటన్నింటినీ ధ్రువీకరించింది. సంఘ విద్రోహ శక్తులు తేలిగ్గా ప్రవేశించే అనేక మార్గాలను ఉటంకించిన ఈ బృందం.. ఆలయంలోని అనేక అంశాల్లో, మార్గాల్లో నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపించింది.

- రెండు రోజుల మాక్‌డ్రిల్‌లో లోపాలు కనుగొన్న బృందం
- నామమాత్రపు చర్యలతో నడిపిస్తున్నారని ఉద్ఘాటన
- ఆలయంలోకి తేలిగ్గా ప్రవేశించే మార్గాలపై దృష్టి
- అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యలేవని ప్రశ్న
- ఎవరుపడితే వారు ఆలయంలోకి వచ్చేస్తున్నారని వెల్లడి
- లగేజీల చెకింగ్ లేదంటూ ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దేవస్థానంలో పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలన్న క్రమంలో ప్రత్యేక ఆక్టోపస్ బృందం ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి నుంచి 20వ తేదీ తెల్లవారుజాము వరకు మాక్‌డ్రిల్ నిర్వహించింది. ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్న నిపుణుల బృందం కీలకమైన లోపాలను గుర్తించినట్లు సమాచారం. వాటిలో ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి..

- ఆలయంలో ఏదైనా ప్రమాదం జరిగితే అటు భక్తులను కానీ, ఇటు సిబ్బందిని కానీ హెచ్చరించటానికి సైరన్ వంటి సౌకర్యం కల్పించలేదు.
- ఆలయానికి చుట్టుపక్కల తేలిగ్గా రాకపోకలు సాగించటానికి అనేక మార్గాలు ఉన్నాయి.
- గుర్తింపు లేని వ్యక్తులు తమ ద్విచక్ర వాహనాలు, కార్లతో మహామండపం, ఘాట్‌రోడ్డు, ప్రొటోకాల్ వరకు కూడా వచ్చేస్తున్నారు. మిగతా 6లో..


ఆలయం, పోలీస్, రెవెన్యూ అధికారులతో ఆక్టోపస్ సమావేశం



ఆక్టోపస్ మాక్‌డ్రిల్

ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రత, ఆలయ పరిరక్షణలో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే ఎలా వ్యవహరించాలన్న విషయంపై ఆక్టోపస్ విభాగం అధికారులు బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు మాక్‌డ్రిల్ నిర్వహించారు. అవాంఛనీయ శక్తులు మెట్లమార్గం నుంచి ఇంద్రకీలాద్రిపైకి చేరుకోగా, ఆలయ అధికారులు, వన్‌టౌన్ పోలీసుల నుంచి సమాచారం అందుకున్న ఆక్టోపస్ విభాగం అధికారులు.. దుండగుల వద్ద ఉన్న పేలుడు సామగ్రి, ఆయుధాలు నిర్వీర్యం చేసి, వారిని అదుపులోకి తీసుకుని, భక్తులను ఎలా రక్షించారనే విషయాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపించారు. ఆలయ సిబ్బంది, స్థానిక పోలీసులు, సెక్యూరిటీ, వైద్య, రెవెన్యూ సిబ్బంది ఎలా వ్యవహరించాలనే విషయాన్ని వివరించారు. ఈ మాక్‌డ్రిల్‌లో ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ రాజారెడ్డి, డీఎస్పీ తిరుపతయ్య ఆధ్వర్యంలో అధికారులు, వన్‌టౌన్ పోలీసులు, రెవెన్యూ, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గగుడి చైర్మన్ నియామకంపై

ఐవీఆర్ఎస్ సర్వే

- పదవి కోసం కూటమి పార్టీల పట్టు
- ప్రచారంలో నెట్టెం, గూడపాటి, వెలగపూడి, బుద్దా, సారిపల్లి పేర్లు
- బీజేపీ నుంచి అడ్డూరి శ్రీరామ్, జనసేన నుంచి మహిళా నేత పేరు కూడా..

ఇంద్రకీలాద్రి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి పాలకవర్గం నియామకానికి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. చైర్మన్‌గా ఎవరికి అవకాశం ఇవ్వాలి అనే అంశంపై ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది. చైర్మన్ పదవిపై టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల్లోని పలువురు నాయకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ పదవి బీజేపీకి ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు గట్టిగా ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. మరోపక్క టీడీపీ, జనసేన పార్టీల్లోని పలువురు నాయకులు తమకే చైర్మన్ పదవి కావాలని ఆయా పార్టీల అధినేతలపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది.

పదవి కోసం నేతల పట్టు

దుర్గగుడి చైర్మన్ పదవి మరికొన్ని రోజుల్లో భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, గూడపాటి పద్మశేఖర్, వెలగపూడి శంకర్‌బాబు, బీసీ సామాజిక వర్గం నుంచి సీనియర్ నాయకులు బుద్దా వెంకన్న, సారిపల్లి రాధాకృష్ణ, బీజేపీ నుంచి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన పార్టీ నుంచి ఓ మహిళా నాయకురాలు కూడా దుర్గగుడి చైర్మన్ పదవికి గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దుర్గగుడి చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.



● భళారే కృష్ణా

సురభి నాట్యకళ మండలి, సురభి ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహణలో నగరంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత, నృత్య కళాశాలలో గురువారం 'మాయాబజార్' పౌరాణిక సురభి నాటకాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణుడిగా నిఖిలేష్ తన అభినయంతో ఆకట్టుకున్నారు. 8

మే 15 నుంచి మంగినపూడిలో జాతీయ బీచ్ కబడ్డీ పోటీలు

▸▸ అనుమతి కోసం ఏకేఎఫ్ఐకి లేఖ 6

మెట్రోకు మొదటి అడుగు



సీఎంపీ సర్వేకు ఏపీఎంఆర్సీ అధికారులు ఓకే

- శిస్ట్రా సంస్థకు ఎల్‌వోఏ విడుదల
- సీఎంపీ సర్వే ప్రారంభం.. మూడు నెలల్లో పూర్తి
- కేంద్ర ప్రభుత్వం వద్దకు సర్వే రిపోర్టు
- అనంతరం పనులు ప్రారంభమయ్యే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు సంబంధించి కీలక అడుగు ముందుకు పడింది. కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) కన్సల్టెన్సీ సంస్థ శిస్ట్రాకు ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్సీ) అధికారులు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్‌వోఏ) ఇచ్చారు. శిస్ట్రా సంస్థ.. ఏపీఎంఆర్సీ అధికారులతో భేటీ కావటంతో పాటు క్షేత్రస్థాయిలో సర్వే కూడా ప్రారంభించింది.

నూరుశాతం నిధులు కేంద్రమే భరించేనా?

విజయవాడ మెట్రో ప్రాజెక్టును నూరుశాతం ఖర్చు భరించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఏపీఎంఆర్సీ రాసిన లేఖ మేరకు తాజా సీఎంపీ తయారు చేయాల్సిందిగా కేంద్రం నిర్దేశించింది. సీఎంపీ రూపకల్పనకు ఏపీఎంఆర్సీ అంగీకారం తెలపటంతో.. కన్సల్టెంట్ ఎంపికను వేగంగా చేపట్టింది. ఇంతకుముందు విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టు డీపీఆర్ తయారుచేసిన శిస్ట్రా సంస్థే ఈ సీఎంపీ బాధ్యతలను కూడా దక్కించుకుంది. కన్సల్టెన్సీ సంస్థతో మాట్లాడి అగ్రిమెంట్ ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఈనెల 17న కేంద్ర ప్రభుత్వం సీఎంపీ రూపొందించటానికి అనుమతులు ఇచ్చింది. 18న ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు శిస్ట్రాకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్‌వోఏ) ఇచ్చారు. అనంతరం శిస్ట్రా సంస్థ ప్రతినిధులతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రయాణికుల రాకపోకల సర్వేను చేపట్టడానికి ఎలాంటి పద్ధతులు అవలంబించాలో నిర్దేశించింది. దీంతో శిస్ట్రా ప్రతినిధులు ఇప్పటికే సర్వే చేపట్టడానికి రంగంలోకి దిగారు. మూడు నెలల్లో దీనిని పూర్తి చేయాల్సి ఉంది. ఆ తర్వాత ఏపీఎంఆర్సీ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మిగతా 6లో..

బాలికపై సామూహిక అత్యాచారం కేసు.. ఇద్దరు అరెస్టు

- మరో ఐదుగురి కోసం గాలింపు
- మూడు రోజులు అత్యాచారానికి పాల్పడినట్టు నిర్ధారణ

గన్నవరం/మచిలీపట్నం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బాలికపై సామూహిక అత్యాచారం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఐదుగురు నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ కేసు వివరాలను గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం మీడియాకు వెల్లడించారు. ఆయన మాటల్లో... గన్నవరం మండలం వీరపనేనిగూడేనికి చెందిన మహిళకు జి.కొండూరుకు చెందిన వ్యక్తితో వివాహమైంది. ఇంటి పక్కన ఉండే బాలిక సదరు వివాహితకు దగ్గరైంది. ఆ బాలిక చదువు మానేసి ఇంటి దగ్గరే ఉంటోంది. ఈ నేపథ్యంలో వీరపనేనిగూడెంలో అంజమ్మ, సుబ్బమ్మ, పేరంటాలమ్మ తిరునాళ్ల జరిగింది. దీనికి సదరు వివాహిత పిల్లలతో కలిసి వెళ్తుండగా, నేను వస్తానని బాలిక అనడంతో ఆమె తండ్రి వద్దని వారించాడు. అయినా బాలిక వెళ్తానని మొండికేయడంతో రూ.200 ఇచ్చి వివాహితతో మిగతా 6లో..


గన్నవరం పీఎస్‌లో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారు

» ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



ఇబ్రహీంపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బీసీలను మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఓటు బ్యాంకుగా వాడుకున్నాడని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం ఆయన మాట్లాడుతూ, టీడీపీ హయాంలో బీసీల కోసం 65 పాఠశాలలు మంజూరు చేస్తే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులకు నిధులు ఇవ్వలేదన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో బీసీ బాలికలకు ప్రత్యేకంగా వసతి భవనం లేనందున కొండపల్లిలోని పాత పోలీస్‌స్టేషన్ స్థలాన్ని బీసీ హాస్టల్‌కు ఇవ్వాలని కోరారు. బాలికలకు ప్రత్యేక గురుకుల పాఠశాల కేటాయించాలన్నారు.



ఎంపీ శివనాథ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న తానా ప్రతినిధులు

ఎంపీ కేశినేని శివనాథ్‌కు తానా ఆహ్వానం

వన్‌టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) రెండేళ్లకోసారి నిర్వహించే మహాసభలకు రావాల్సిందిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను తానా సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. సంఘ ప్రతినిధులు ఢిల్లీలో గురువారం ఎంపీని కలిసి జులై 3 నుంచి 5 వరకు అమెరికాలోని డెట్రాయిట్‌లో జరగనున్న తానా మహాసభలకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తానా చైర్మన్ గంగాధర్ నాదెళ్ల, కాన్ఫరెన్స్ డైరక్టర్ సునీల్ పాంత్రా, మాజీ అధ్యక్షుడు జయరాం కోమటి తదితరులు ఉన్నారు.



కాలువ వద్ద నీటిని పరిశీలిస్తున్న ఎన్ఎస్పీ అధికారులు, రైతులు

కాల్వలకు సాగర్ జలాలు విడుదల

వావిలాల(తిరువూరు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల ఎన్ఎస్పీ మేజర్ కాలువకు, 35 క్యూసెక్కుల సాగర్ జలాలను బుధవారం సాయంత్రం విడుదల చేశారు. గురువారం కాలువలో నీటిని స్థానిక ఎన్ఎస్పీ అధికారులు పరిశీలించారు. మధిర బ్రాంచి కెనాల్‌పై ఖమ్మంజిల్లా ఎర్రబోయినపల్లి లాకుల నుంచి నీటిని విడుదల చేయడంతో ముష్టికుంట్ల మేజర్ ఆయకట్టు పరిధిలోని, వెంకటేశ్వరనగరం, వావిలాల, ముష్టికుంట్ల, రాజుగూడెం, వామకుంట్ల తదితర గ్రామాల్లోని సుమారు ఆరువేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎర్రబోయినపల్లి వాద్ద లాకుల నుంచి ముష్టికుంట్ల మేజర్‌కు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 35 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశారని అధికారులు పేర్కొంటున్నారు. తిరువూరు, గంపలగూడెం ఎన్ఎస్పీ ఏఈలు సునీత, మహేష్, డీసీ చైర్మన్ గంధ్ర ప్రసాదు, ఆయకట్టు రైతులు పరిశీలించారు.

జర్మనీలో ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతకు ప్రాజెక్ట్ సర్వసేతు శిక్షణ

వన్‌టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జర్మనీలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాన్ని అందించడంలో 'ప్రాజెక్టు సర్వసేతు' ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో జి.గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జర్మనీలోని ప్రవాస భారతీయుల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. దీని ద్వారా ఏపీలో ఫైనల్ ఐటీఐ విద్యార్థులకు జర్మనీ భాష, సంస్కృతి, నైపుణ్యం సాధించేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. మ్యూనిక్‌లోని భారతీయ రాయబార కార్యాలయ సహకారంతో జర్మనీలోని ప్రవాస భారతీయసంఘం ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. శిక్షణ రెండు భాగాలుగా ఉంటుంది. ఒక్కో బ్యాచ్‌లో 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. ఏ1, ఏ2 స్థాయిలో జర్మనీ భాషా సర్టిఫికేషన్ విజయవంతంగా పూర్తిచేసి ఫైనల్ ఇయర్ ఐటీఐ విద్యార్థులు జర్మనీలో ఉద్యోగ అవకాశం కోసం అర్హత పొందుతారు. మే మొదటివారం నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయి. 'ప్రాజెక్టు సర్వసేతు'తో భాగస్వామ్యం అంతర్జాతీయస్థాయిలో భారతీయ యువతకు నైపుణ్యాభివృద్ధిని కలిగించటమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ అవకాశాలను అన్వేషించేందుకు మరింతగా దోహదపడుతుందని, యువతకు అవకాశాలను అందించేందుకు 'ప్రాజెక్టు సర్వసేతు' మరో ముందడుగుగా భావించవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బెంజిసర్కిల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో(ఏపీకేజీబీవీ) ప్రవేశాలకు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో 2025-26 విద్యాసంవత్సరానికి గాను 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు, అదే విధంగా 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానేసినవారు పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ పరిధిలోని బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోని తీసుకుంటామని తెలిపారు. దరఖస్తులు https://apkgbv.apcfss.in ద్వారా పొందవచ్చని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఫోన్ మెసేజ్ వస్తుందని, పూర్తి వివరాలకు, 7075159996, 7075039990 నెంబర్లను సంప్రదించాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

తిరువూరులో పొలిటికల్ హీట్!

» ఉత్కంఠ రేపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పు

» తాడేపల్లికి అవిశ్వాస తీర్మానం అంశం..

» ఆచితూచి అడుగులు వేసే దిశగా వైసీపీ నేతలు

తిరువూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం అంశం సద్దుమణిగినా.. చైర్‌పర్సన్ మార్పు సామరస్యంగా జరుగుతుందా అన్న అనుమానం కలుగుతోంది. మున్సిపాలిటిలో ఒప్పందం అంశాన్ని తాడేపల్లిలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టికి స్థానిక కౌన్సిలర్లు, పార్టీశ్రేణులు తీసుకువెళ్లగా.. విషయంపై జగన్ ఆచితూచి అడుగువేయాలని చెప్పినట్టు పలువురు నేతలు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చైర్మన్‌ను మార్చడం పార్టీకి నష్టంతో పాటు మున్సిపాలిటీ చేజారిపోతుందని సీనియర్ నేత ఒకరు పేర్కొన్నట్టు కౌన్సిలర్లు చెబుతున్నారు. కాగా అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి ఉంటామని, ప్రస్తుత చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి జగన్ వద్ద చెప్పినట్టు సమాచారం. ఆమె రాజీనామా పత్రాన్ని పట్టణ నేత వద్ద ఉంచినట్టు సమాచారం. కొందరు కౌన్సిలర్లు పక్కచూపులు చూస్తున్నట్టు పట్టణంలో ప్రచారం జరగడంతో చైర్మన్ ఎంపిక అంశం మరింత గందరగోళంగా మారే అవకాశం ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ బోర్డు వైసీపీ చేతుల్లో ఉంటుందా.. లేక రంగుమారుతుందా అనే చర్చ పట్టణ ప్రజల్లో సాగుతోంది.

మున్నాళ్ల ముచ్చటే!



డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు రెండేళ్లకే చతికిలపడింది. లాభాల సంగతి దేవుడెరుగు.. ఒకవైపు మార్టులో ఆశించినంతగా సరుకుల విక్రయాల్లేక, మరోవైపు నిర్వహణ ఖర్చులు పెనుభారంగా మారటంతో నష్టాలను మూటగట్టుకుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వల్ల ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో మార్టు మనుగడ ప్రశ్నార్థకం కావటంతో అంతర్గతంగా విచారణ జరుపుతున్న వెలుగు అధికారులకు ఏమి చేయాలో పాలుపోవటం లేదు.

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల)

» తిరోగమనం దిశగా మహిళా మార్టు!

» ఆదరణ లేక నష్టాల బాట..

» నిర్వహణ భారం.. అవినీతి మరకలు

» సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

» మార్టు నిర్వహణపై అధికారుల విచారణ

మండలంలో మొత్తం 1834 డ్వాక్రా సంఘాలున్నాయి. నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించాలన్న ఉద్దేశ్యంతో మహిళా మార్టు ఏర్పాటు కోసం ఒక్కొక్క డ్వాక్రా మహిళ రూ. 200 చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. పదిమంది సభ్యుల సంఘం రూ.2వేలు చెల్లించింది. మొత్తం 16 వందల సంఘాలు సొమ్ములు చెల్లించగా, రూ.29 లక్షలకు పైగా మార్టు కోసం పెట్టుబడి నిధి సమకూరింది. మార్టు నిర్వహణ కోసం ప్రత్యేకంగా డ్వాక్రా మహిళల నుంచి ఒక కమిటీని ఎన్నుకున్నారు. రెండేళ్ల క్రితం 2023 మార్చి నెలలో స్థానిక చెవిటికల్లు రోడ్ సెంటర్‌లో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టును అప్పటి వైసీపీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు ప్రారంభించారు. మొదట్లో వైసీపీ నేతలు, వెలుగు అధికారులు ఆర్భాటంగా ప్రచారం చేసిన స్థాయిలో మార్టు టర్నోవర్ సాధించలేక పోయింది.

మహిళల నుంచి కొరవడిన ఆదరణ

సాధారణంగా బయటి మార్కెట్ కంటే మార్టులో ఒక రూపాయి తక్కువ ధరకు సరుకులు విక్రయించాలి. మార్టులో సభ్యులైన డ్వాక్రా మహిళలు తమ కుటుంబ అవసరాల నిమిత్తం సరుకులను తప్పనిసరిగా మార్టులో కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే డ్వాక్రా మహిళల నుంచి ఆదరణ కరువైంది. బయట దుకాణాల్లో వారు సరుకులు కొనుగోలు చేస్తుండటం, ముఖ్యంగా ఇతర గ్రామాల నుంచి మహిళలు మార్టుకు రాకపోవటం, దీనికితోడు బయటి వ్యక్తులు కూడా కన్నెత్తి చూడకపోవటం వల్ల మార్టులో ఆశించిన మేర అమ్మకాలు జరగలేదు. నెలకు రూ. 50వేల నుంచి రూ. 60వేలు అమ్మకం జరగటమే గొప్ప.

భారంగా నిర్వహణ ఖర్చులు

క్రయ విక్రయాల టర్నోవర్ లేకపోవటంతో నిర్వహణ ఖర్చులు భారంగా మారాయి. ప్రారంభంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, మరో ముగ్గురు వర్కర్లు ఉన్నారు. భవనానికి అద్దె నెలకు రూ. 24 వేలు. విద్యుత్ బిల్లు రూ. నాలుగైదు వేలు వచ్చేది. ఒక్కొక్కరికి రూ. ఎనిమిది వేల వంతున నలుగురికి జీతభత్యాలు రూ. 32 వేలు. ఇతరత్రా ఖర్చులు కాకుండా ప్రధాన ఖర్చులు నెలకు రూ. 60 వేలు మించి అయ్యేవి. లాభాలు లేకపోగా ప్రతి నెల నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చింది. ఖర్చును తగ్గించేందుకు కొద్దినెలల క్రితం ఇద్దరు వర్కర్లను తొలగించారు. మరో అద్దె భవనంలోకి మార్చేందుకు ప్రయత్నించారు. ఆ యజమాని కూడా అద్దె నెలకు రూ. 24 వేలు చెప్పటంతో తరలింపు ప్రతిపాదన విరమించారు. ఈ నేపథ్యంలో సరుకులు కొనటానికి సొమ్ములు కూడా లేకపోవడంతో అద్దె భవనం నుంచి మిగిలిన సరుకులను, ఫర్నీచర్‌ను మూడు రోజుల క్రితం వెలుగు కార్యాలయానికి తరలించారు.

అధికారుల పర్యవేక్షణ లోపం..

సరైన నిర్వహణ లేకపోవటం, అధికారుల పర్యవేక్షణ లోపించం వల్ల మహిళా మార్టు పూర్తిగా చతికిల పడటమే కాకుండా, ఆర్థికంగా అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్టు ప్రారంభంలో ఏసీలు, కంప్యూటర్లు, ఇతర ఫర్నీచర్ కోసం రూ.పది లక్షలు ఖర్చుచేశారని చెబుతున్నారు. ఈ విషయంలో పారదర్శకత పూర్తిగా లోపించింది. ప్రస్తుతం మిగిలిన సరుకులు కూడా పెద్దగా లేవని అంటున్నారు. ఏదేమైనా మార్టు గురించి సోషల్ మీడియాలో పెద్దఎత్తున వ్యతిరేక ప్రచారం జరుగుతుండటంతో వెలుగు అధికారులు దృష్టి సారించారు.

అధికారుల విచారణ

మార్టులో ఏం జరిగిందన్న విషయమై ఇటీవల మార్టు నిర్వహణ కమిటీ సభ్యులను అధికారులు విచారిస్తున్నారు. ఈ అంశంపై స్థానిక వెలుగు ఏపీఎంను వివరణ కోరగా, సరుకులు అమ్ముడు కానందున నష్టాలు వచ్చాయని, నిర్వహణ భారంగా పరిణమించటంతో మార్టును వెలుగు కార్యాలయానికి తరలించినట్టు చెప్పారు. ఆర్థికపరమైన అవకతవకలు లేవని, ఫర్నీచర్ విలువ రూ.10లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. మిగులు సరుకు రూ. 3లక్షల వరకు ఉంటుందని చెప్పగా, మిగతా సొమ్ము గురించి ప్రస్తావించగా, ఆయన సమాధానం దాటవేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

» సీఎస్‌కు ఎన్ఎంయూ యూనిటీ, ఏపీ జేఏసీ వినతి

బస్‌స్టేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌కు గురువారం ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ, ఏపీ జేఏసీ నాయకులు వినతి పత్రం అందచేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేసి సిబ్బంది ఆందోళనను తొలగించాలని కోరారు. కిందిస్థాయి ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి ఆర్టీసీ నిబంధనల మేరకు వెంటనే ప్రభుత్వం వద్ద ఉన్న ఫైల్‌కు గత ప్రభుత్వం అంగీకరించిన మేరకు పరిష్కారం చూపాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించటం వల్ల ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కిందకు చేర్చారని, అయితే కనీస విద్య లేని వారికి ఈహెచ్ఎస్ అందక ఇబ్బందులకు గురవుతున్నారని, మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉందని, పోలీసులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపు ఇచ్చిన విధంగానే ప్రజా రవాణ సంస్థ ఉద్యోగులకు కూడా మినహాయింపు ఇవ్వాలన్నారు. ఉద్యోగులపై చిన్న కేసులలో కూడా సస్పెండ్‌లు, రిమూవల్స్, పనిష్మెంట్లు ఉన్నాయని, ఒక పద్ధతి లేకుండా అన్యాయం జరుగుతున్నందున 2019 జీవోను అమలు చేయాలని కోరారు. ఎన్టీ రామారావు హయాంలో ప్రారంభమైన ఎస్ఆర్‌డిఎస్ స్కీమ్ గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిందని, దానిని తిరిగి అమలు చేయాలని కోరారు. ఖాళీలను కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఎన్ఎంయూ ఏర్పడి దాదాపు 60 సంవత్సరాలు అయినప్పటికీ నిబంధనల పేరుతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం ఇవ్వకుండా నిలుపుదల చేశారని సీఎస్ చొరవ తీసుకుని సభ్యత్వం ఇప్పించాలని కోరారు. యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట రమణారెడ్డి, జనరల్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు, జేఏసీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నందిగామ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్



పెసరమల్లి రమాదేవి



జిల్లేపల్లి కమల

నందిగామ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నందిగామ ఎంపీపీ స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలకుగాను 13 స్థానాలను వైసీపీ అభ్యర్థులు కైవసం చేసుకోగా రామిరెడ్డిపల్లి ఎంపీటీసీ స్థానాన్ని టీడీపీ గెలుచుకుంది. ఎంపీపీ ఎస్సీ మహిళకు కేటాయించగా గతంలో ఎంపీపీగా పనిచేసిన కేతవీరునిపాడు ఎంపీటీసీ సభ్యురాలు అరిగెల సుందరమ్మ గతేడాది ఎన్నికలకు ముందు పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన పరిణామాల దృష్ట్యా ఎంపీపీ ఎన్నిక నిలిచిపోవటంతో అడవిరావులపాడు ఎంపీటీసీ సభ్యుడు ఆకుల హనుమంతరావు ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఐతవరం ఎంపీటీసీ సభ్యుడు టీడీపీలో చేరినప్పటికీ వైసీపీకి పూర్తి మెజార్టీ ఉంది. గత ఎన్నికల సమయంలో అప్పటి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు బ్రదర్స్ హామీ మేరకు రాఘవాపురం ఎంపీటీసీ సభ్యురాలు పెసరమల్లి రమాదేవిని ఎంపీపీ వరిస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది. కాగా మండలంలో ఎంపీటీసీలుగా ఎన్నికైన వారిలో మహిళలు ముగ్గురు మాత్రమే ఉన్నారు. వీరిలో ఒకరు ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించి రాజీనామా చేయగా మరొకరు రమాదేవి కాగా ఇంకొకరు రుద్రవరం ఎంపీటీసీగా ఎన్నికైన జిల్లేపల్లి కమల ఉన్నారు. వీరిద్దరిలో పదవి ఎవరిని వరిస్తుందో చూడాల్సిందే.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సుధాకర్, ఇన్‌సెట్లో కోటేశ్వరమ్మ (ఫైల్)

మోపెడ్‌ను ఢీకొన్న టిప్పర్

» భార్య మృతి, భర్తకు గాయాలు

మైలవరంరూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న భార్యాభర్తలను టిప్పర్ లారీ ఢీకొనడంతో భార్య మృతిచెందగా, భర్తకు గాయాలైన ఘటన గురువారం మైలవరంలో జరిగింది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరుకు చెందిన వాకా వెంకటేశ్వరరావు, కోటేశ్వరమ్మలు భార్యాభర్తలు. గురువారం ఉదయం ఆగిరిపల్లి సమీపంలోని మామిడి తోటకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా గణపవరం ఊరుబయట ఇబ్రహీంపట్నం నుంచి బూడిద లోడుతో వెళుతున్న టిప్పర్ మూల మలుపు వద్ద మోపెడ్‌ను వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో వెనుక కూర్చున్న కోటేశ్వరమ్మ తలకు రోడ్డు దెబ్బతగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గాయాలైన వెంకటేశ్వరరావును హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోటేశ్వరమ్మ(55) మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మైలవరం ఎస్ఐ కె.సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెట్టింగ్ బాగోతం

(5వ పేజీ తరువాయి)

విజయవాడలో బెట్టింగులను నిర్వహిస్తున్నాడు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న బుల్లితెర నటులతో ఈ ఇద్దరికీ సంబంధాలు ఉన్నట్టు గుర్తించారని విశ్వసనీయంగా తెలిసింది. వారితోపాటు ఇంకా ఎవరెవరున్నారు అనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

బయటకు కనిపించకుండా వ్యవహారాలు

చిట్టినగర్‌కు చెందిన వ్యక్తి హైదరాబాదులో ఉంటూ ఇక్కడ సబ్ బుకీలను తయారు చేశాడు. వాళ్ల ద్వారా మొత్తం వ్యవహారాలను నడిపిస్తున్నాడు. సత్యనారాయణపురానికి చెందిన ఓ బుకీ రాజవిల్లాల్లో ఉంటూ ఉమ్మడి జిల్లాకు నలుదిక్కులా బుకీ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఈ బుకీ నగరంలో నడిబొడ్డున ఓ భారీ వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నట్టు తెలిసింది. ఇందులో ప్రతి ఇసుకలోనూ బెట్టింగ్ సొమ్ము ఉన్నట్టు సమాచారం. ఈ ఇద్దరి బుకీల పేర్లను పంజాగుట్ట పోలీసులు డైరీలో రాసుకున్నట్టు తెలిసింది. హైదరాబాదులో ఉండే కామన్ ఫ్రెండ్స్ ద్వారా ఈ బుకీలు బుల్లితెర నటులకు దగ్గరైనట్టు సమాచారం.

బీఆర్‌టీఎస్ రోడ్డే బెటర్

(5వ పేజీ తరువాయి)

వెళ్తే.. వచ్చే రోడ్డు నేరుగా రైల్వే క్వార్టర్స్ సరిహద్దుకు చేరుతుంది. డీజిల్ లోకో షెడ్ వెంబడిగా ఉన్న డీఆర్ఎం కార్యాలయం రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్‌కు నేరుగా వస్తుంది. ఈ మార్గం మరో 8 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ రోడ్డు మార్గాన్ని విస్తరించగలిగితే బీఆర్‌టీఎస్ రోడ్డుకు నేరుగా రైల్వేస్టేషన్ నుంచి అనుసంధానం ఏర్పడుతుంది. ఎయిర్‌పోర్టుకు ఇలా అనుసంధానం చేయొచ్చు

బీఆర్‌టీఎస్ రోడ్డు పడవల రేవు వద్ద ముగిసి ఏలూరు రోడ్డుకు అనుసంధానమవుతుంది. అక్కడి నుంచి రైవస్ కాల్వ వెంబడి ఉన్న ఆక్రమణల మీదుగా ముందుకు సాగితే వేమినేని రామస్వామి రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డును విస్తరించుకుంటూ పోతే.. సరిగ్గా ఈ రోడ్డు రామవరప్పాడు రింగ్ దాటాక రామవరప్పాడు రైల్వేస్టేషన్ కొత్త వంతెన రోడ్డుకు అనుసంధానమవుతుంది. అలా ఈ మార్గం ఎన్‌హెచ్-16కు కలుస్తుంది. అక్కడి నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు చేరవచ్చు. అలాగే, ఎనికేపాడు వద్ద 100 అడుగుల రోడ్డుకు కాస్త ముందు ఎన్‌హెచ్-16కు అనుసంధానం కావచ్చు. ఇలా కూడా ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ ఏర్పడుతుంది.

సీఆర్‌డీఏ, వీఎంసీల చొరవతో..

ఈ రోడ్డును సీఆర్‌డీఏ, వీఎంసీలు సంయుక్త అభివృద్ధి చేయటం ద్వారా రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ ఏర్పడటంతో పాటు రామవరప్పాడు రింగ్‌పై రద్దీ తగ్గుతుంది. బస్సులు, ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు, కార్లు వంటివి నేరుగా రైల్వేస్టేషన్ నుంచి ఎనికేపాడు మీదుగా ఎన్‌హెచ్-16కు వెళ్లిపోతాయి. రైల్వేస్టేషన్ నుంచి బయట ప్రాంతాలకు వెళ్లే వారికి కూడా ఈ రోడ్డు ప్రత్యామ్నాయంగా ఉంటుంది. దీంతో ఏలూరు రోడ్డుపై ట్రాఫిక్‌ను తగ్గించుకోవచ్చు.

హజ్‌యాత్రకు బెజవాడలో ఎంబార్కేషన్ రద్దు

» 100 మంది లోపే దరఖాస్తు చేయడంతో నిర్ణయం

విజయవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : హజ్‌యాత్రకు విజయవాడ విమానాశ్రయంలో ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రద్దు చేసింది. చాలా తక్కువ సంఖ్యలో హజ్ యాత్రికులు విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించటానికి దరఖాస్తు చేసుకోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. రాష్ట్రం నుంచి గణనీయమైన స్థాయిలోనే హజ్ యాత్రికులు వెళుతున్నా.. విజయవాడ విమానాశ్రయాన్ని తక్కువగా ఉపయోగించుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ప్రస్తుతం 100 మంది లోపు మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఎంబార్కేషన్ పాయింట్ ఇవ్వాలంటే కనీసం 300 మంది ఇక్కడి నుంచి ప్రయాణించాల్సి ఉంటుందని సమాచారం. విజయవాడ విమానాశ్రయం నుంచి టికెట్, ఇతర ప్యాకేజీ ధరలు ఎక్కువగా ఉండటం వల్లే హజ్ యాత్రికుల్లో అత్యధికులు శంషాబాద్‌కు చాయిస్ ఇచ్చినట్టు తెలుస్తోంది.

మే 15 నుంచి మంగినపూడిలో జాతీయ బీచ్ కబడ్డీ పోటీలు

» అనుమతి కోసం ఏకేఎఫ్ఐకి లేఖ

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌లో 12వ జాతీయ సీనియర్ మహిళల, పురుషుల బీచ్ కబడ్డీ పోటీలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని కబడ్డీ రాష్ట్ర సంఘం కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. మే 15 నుంచి 18వరకు జరగనున్న పోటీల అనుమతి కోసం ఏపీ కబడ్డీ అసోసియేషన్‌కు మంత్రి రవీంద్ర గురువారం లేఖ రాసినట్టు తెలిపారు. అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏకేఎఫ్ఐ) నుంచి జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు అనుమతులు తెచ్చి ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని లేఖలో పేర్కొన్నట్టు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో పోటీలకు అనుమతులు వస్తాయని తెలిపారు. పోటీల నిర్వహణకు తమ నుంచి సహకారం అందిస్తామని శ్రీకాంత్ తెలిపారు.

ఇదేం భద్రత?

(5వ పేజీ తరువాయి)

- ఆలయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తక్షణమే స్పందించేందుకు క్రైసిస్ మేనేజ్‌మెంట్ కమిటీ లేదు.
- ప్రధాన ప్రాంతాల్లో బిల్డింగ్ మ్యాప్‌లు, ఫ్లోర్ మ్యాప్‌లు లేవు.
- మహామండపంలో చాలాచోట్ల గేట్లకు తాళాలు వేసి, కొన్నిచోట్ల వెల్డింగ్ చేసి ఉంచారు. అత్యవసర సమయంలో గేట్ల తాళాలు అందుబాటులో లేకపోవటం పెద్ద లోపంగా గుర్తించారు.
- మెడికల్ సెంటర్‌లో తగినంత సిబ్బంది లేకపోవటాన్ని, సీసీ టీవీ నిర్వహణ సక్రమంగా లేకపోవటాన్ని కూడా గుర్తించారు.
- ఎలక్ట్రికల్ సిస్టమ్ ఆఫ్, ఆన్ చేయటానికి ఉండే సిబ్బంది పేర్లు, వారి ఫోన్ నెంబర్లు అందుబాటులో లేవు.
- భద్రతా చర్యలరీత్యా సెల్ జామర్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల సిబ్బంది, అధికారులు మాట్లాడుకోవటానికి, సంప్రదించటానికి సరైన టెలిఫోన్ కమ్యూనికేషన్ వ్యవస్థ లేదు.
- అంతరాలయంలోకి భక్తులు కాలేజీ బ్యాగ్‌లు, లగేజీ బ్యాగ్‌ల సహా ప్రవేశిస్తున్నారు. వీటికి సంబంధించి ఎటువంటి తనిఖీలు లేవు.
- రెగ్యులర్‌గా మెటల్ డిటెక్టర్, హ్యాండ్ డిటెక్టర్లను నిర్వహించడం లేదు. ఏదో పెద్ద ఉత్సవాలప్పుడు తప్ప వీటిని ఏర్పాటు చేయట్లేదు. అప్పుడు కూడా వీఐపీలమంటూ కొంతమంది తమ గుర్తింపు కార్డులు చూపించుకుని యధేచ్ఛగా గుంపులుగా ఆలయంలోకి ప్రవేశిస్తున్నారు.
- దేవస్థానం రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందికి గుర్తింపు కార్డులు లేకపోవటంతో వారెవరనేది తెలుసుకోవడం కష్టమే అవుతుంది. ఆలయానికి సంబంధించి భద్రతాధికారి ఎవరూ లేకపోవటం పెద్ద తప్పిదమే. కేవలం ప్రైవేట్ సెక్యూరిటీ వారినే భద్రతాధికారిగా చూపిస్తున్నారు.

ఈ లోపాలన్నింటినీ గుర్తించిన ఆక్టోపస్ బృందం సంఘ విద్రోహశక్తులు సులభంగా ఆలయంలోకి ప్రవేశించి భద్రతకు విఘాతం కలిగించవచ్చని అభిప్రాయపడింది. సూచించిన అనేక అంశాలు ఆర్థికపరమైనవి కూడా కాకపోవడంతో ఆలోచించి చర్యలు తీసుకోవాలని ఆక్టోపస్ బృందం భావించింది. సదరు నివేదికను ప్రభుత్వానికి అందించనుంది. దేవదాయ కమిషనరే దుర్గగుడి ఈవో కావడంతో ఆక్టోపస్ బృందం సూచించిన సమస్యలకు పరిష్కారం కనుగొనే అవకాశాలు లేకపోలేదు. అలాగే, తక్షణమే కమిటీని ఏర్పాటు చేసి ఆలయ భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకునేందుకు అధ్యయనం చేయించాలని, నివేదిక తెప్పించుకుని, ఆ మేరకు నిపుణులతో చర్చించి, ఆక్టోపస్ సలహాలు కూడా తీసుకుని, కార్యాచరణకు ఉపక్రమించాలని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

ఇద్దరు అరెస్టు

(5వ పేజీ తరువాయి)

పాటు పంపించాడు. వారు ఈ నెల 9వ తేదీన వీరపనేనిగూడెం వచ్చారు. నాలుగు రోజుల తరువాత వివాహిత ఇంట్లో గొడవ జరిగింది. 'ఈ గొడవకు కారణం నువ్వే. మీ నాన్నతో చెబుతాను.' అని వివాహిత.. బాలికను మందలించింది. నాన్నతో చెబితే కొడతాడని భయపడిన బాలిక ఈ నెల 13వ తేదీ రాత్రి 10.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. సగర్లపేటలోని నాలుగు రోడ్ల సెంటర్‌కు రాగానే పక్కనే ఉన్న వెంచర్‌లో కొందరు యువకులు మద్యం తాగుతున్నారు. వారి వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పింది. ఆ యువకులు ఆ బాలికను ద్విచక్ర వాహనంపై తీసుకుని కేసరపల్లిలో వారి స్నేహితుడి సహాయంతో ఒక ఇంట్లో పెట్టారు. ఒకరి తర్వాత మరొకరు చొప్పున ఏడుగురు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. వివాహితకు రెండు రోజుల తర్వాత అనుమానం వచ్చి బాలిక ఇంటికి వెళ్లిందా, లేదా అని ఆరా తీసింది. జి.కొండూరు రాలేదని తెలియడంతో ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎనిమిది బృందాలతో గాలింపు చేపట్టారు. ఆపరేషన్ పేరిట వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేసి లుక్ అవుట్ నోటీసులను రాష్ట్రవ్యాప్తంగా పంపించారు. బాలిక కలర్ ఫొటోను అన్ని పోలీస్ స్టేషన్‌లకు పంపించారు. సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్‌లను ఉపయోగించి ఆత్కూరు, వీరపనేనిగూడెం ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. కలెక్టర్ దృష్టిలో పెట్టి జిల్లాలోని అన్ని సచివాలయాల గ్రూపుల్లో, ఆశా వర్కర్లు, డ్వాక్రా గ్రూపుల్లో బాలిక ఫొటోను వైరల్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ రాత్రి బాలికను ఆటోడ్రైవర్ మాచవరం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ, బాలిక తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి బాలికను పెద్ద అవుటపల్లిలోని బంధువుల ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం కడుపులో నొప్పి వస్తున్నట్లు బాలిక తల్లికి చెప్పగా, ఆమె ఆత్కూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి పంపించారు. మహిళా ఎస్సై సమక్షంలో బాలిక తనపై కొంతమంది అత్యాచారం చేసినట్లు చెప్పగా స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఆ రాత్రి బాలికను కేసరపల్లి తీసుకెళ్లి మూడు రోజుల పాటు ఉంచారు. ఆరుగురు యువకులు, మైనర్ బాలుడు బాలికపై అత్యాచారం చేశారు. మూడు రోజుల అనంతరం బాలికను విజయవాడలో దింపారు. అక్కడ బాలిక ఆటో ఆపి విజయవాడ వెళ్లాలి అని చెప్పటంతో డ్రైవర్‌కు అనుమానం వచ్చి పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో నిందితులు బాణావతు లక్ష్మణ జితేంద్ర, పగడాల హర్షవర్ధన్‌ను అరెస్టు చేశారు. మరో ఐదుగురి కోసం గాలిస్తున్నారు. మీడియా సమావేశంలో డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, ఎస్సై శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి అడుగు

(5వ పేజీ తరువాయి)

ఆమోదింపజేస్తారు. ఆ వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. ఈ సీఎంపీ ఆధారంగా విజయవాడ మెట్రోకు ఉన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తెలుసుకోగలుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఎంఆర్‌సీ అధికారులు కోరినట్టుగా నిధులు ఎంత మేరకు విడుదల చేయాలో నిర్ణయించుకుంటుంది. కోలకతాలో మాదిరిగా కేంద్ర మే పూర్తి నిధులతో మెట్రో ప్రాజెక్టును చేపట్టే అవకాశం ఉంటుంది. సీఎంపీ పూర్తయ్యే వరకు విజయవాడ మెట్రోకు నిధుల అంశం కొలిక్కి వచ్చే పరిస్థితి లేదు. విజయవాడ మెట్రోరైల్ మొదటి కారిడార్.. కృష్ణా జిల్లా గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, బస్టాండ్ వరకు ఉంది. రెండో కారిడార్.. కృష్ణాజిల్లాలోని పెనమలూరు సెంటర్ నుంచి ఎన్టీఆర్ జిల్లాలో బందరు రోడ్డు మీదుగా బస్టాండ్ వరకు సాగుతుంది. ఈ రెండు కారిడార్లకు రూ.11,009 కోట్ల వ్యయమవుతుంది.

విజయవాడ తూర్పు

హుండీ లెక్కింపు

గవర్నర్‌పేట: చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవి ఆలయంలో గురువారం స్వామి వారి హుండీల లెక్కింపు జరిగింది. హుండీలు లెక్కించగా 90 రోజులకు రూ. 3, 87, 121లు నగదు వచ్చినట్లు ఆలయ ఈవో యడ్లవల్లి సీతారామయ్య తెలిపారు. బంగారం, వెండి, ఇతర వస్తువులు ఏమీ రాలేదని తెలిపారు.

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యత

5వ డివిజన్లో అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె

గుణదల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకు తగ్గట్టుగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. స్థానిక 5వ డివిజన్లోని బోస్‌గారి ఇంటి వద్ద కొండపైన రూ. 14 లక్షల వ్యయంతో చేపట్టిన రిటైనింగ్ వాల్, సీసీ డ్రెయిన్, రహదారి నిర్మాణ పనులు, రూ. 11 లక్షల వ్యయంతో జయప్రకాష్ నగర్లో చేపట్టిన రోడ్డు నిర్మాణానికి గురువారం గద్దె స్థానిక పెద్దలతో కలిసి భూమి పూజ చేశారు. రోడ్ల నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. డివిజన్లో పారిశుధ్య సమస్య ఉందని స్థానికులు తెలియజేశారు దానిపై అధికారులతో మాట్లాడానని చెప్పారు. సమస్య పరిష్కారానికి 50మంది సిబ్బందిని కేటాయించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, పార్టీ నాయకులు, ఈఈ సామ్రాజ్యం పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆర్ఏఎంసీ ఎలిమెంటరీ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయండి

భారతీనగర్: తూర్పు పరిధి ఏపీఐఐసీ కాలనీలోని (ఆటోనగర్ పరిధిలోని) రేగుల అనురాధ మున్సిపల్ కార్పొరేషన్ (ఆర్ఏఎంసీ) ఎలిమెంటరీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ గురువారం మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల కోరిక మేరకు రానున్న విద్యా సంవత్సరంలోగా అమలులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులు నూతన టెక్నాలజీని నేర్చుకోవాలి

● కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంవీ బసవేశ్వరరావు, అనురాధ

లబ్బీపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే విద్యార్థులు నూతన టెక్నాలజీని నేర్చుకోవాలని, ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా వివిధ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు తెలిపారు. నలంద డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఐవోటీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎలక్ట్రో 2కే25ను రెండురోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డిగ్రీ తర్వాత కెరీర్‌ను ఎంచుకునేటపుడు తమ ఆసక్తికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ కె.రామ్‌కుమార్, ఎం.అనూష పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌తో భవిష్యత్ అంధకారం

● ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ రమేష్



విద్యార్థినులతో డాక్టర్ రమేష్ బావిశెట్టి

పటమట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మొబైల్ వినియోగం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ రమేష్ బావిశెట్టి తెలిపారు. గురువారం అంతర్జాతీయ ఆనంద దినోత్సవం పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ వీఆర్‌కె నగర్ స్పార్క్ ఆధ్వర్యంలో పటమట స్పార్క్ సైకలాజికల్ సెంటర్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావహ దృక్పథం, ఆత్మ సంతృప్తి, తోటి వారిపై సానుభూతి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్ద వారి పట్ల కృతజ్ఞతభావం ఉంటే ఆనందంగా ఉండవచ్చొన్నారు. నేటి యువతలో ఎక్కువ మంది మొబైల్ గేమ్స్, వీడియోల వీక్షణే ఆనందంగా భావిస్తున్నారన్నారు. ఇకనైనా మేలుకొనకపోతే జీవితం అంధకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జీవో 8 తాత్కాలిక నిలుపుదలపై

మంత్రికి ఆటో కార్మిక సంఘం ధన్యవాదాలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేస్తున్న ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నేతలు

గుణదల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోపభూయిష్టంగా ఉన్న జీవో నెంబరు 8ని తాత్కాలికంగా నిలుపుదల చేయించిన రవాణాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్ రెడ్డిని ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నాయకులు గురువారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. జీవో 8ని సవరించి ఐదు మండలాల ఆటోలతోపాటు అవుట్ ఆఫ్ ఆటోలకు న్యాయం జరిగేలా చూడాలని సంఘం అధ్యక్షుడు దాది శ్రీనివాసరావు రవాణాశాఖ మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జీవో నిలుపుదల వల్ల సమస్య పరిష్కారం కాదని, ఈ విషయాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి అధికారులు, కార్మిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించి అందరికీ న్యాయం జరిగేలా సవరిస్తామని హామీ ఇచ్చారు. కె.పోలారి, దాది శ్రీనివాసరావు, ముని శంకర్, పి.రఫిఖాన్, పి.రాజా, పి.రాంబాబు, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, పి.పైడిరాజు, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగ జంగం

కులాలకు సమన్యాయం చేయాలి

గాంధీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బేడ బుడగ జంగం కులాలకు ఎస్సీ వర్గీకరణ ద్వారా సమన్యాయం జరిగేలా చూడాలని సంఘం జాతీయ అధ్యక్షుడు తాడికొండ నారాయణ, టీడీపీ సీనియర్ నేత కొండపల్లి దుర్గారావు, బీజేపీ నేత ప్రదీప్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపడంపై కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన ఆమోదించి రాష్ట్రంలోని ఆయా కుల సర్టిఫికెట్లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి బేడ బుడగ జంగం కుల సేవా సంఘం అధ్యక్షుడు సంకుల సతీష్‌కుమార్, ప్రధానకార్యదర్శి శిరీషాల అంజి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడికొండ కొండన్న, పత్తి తిరపతిరావు, గంజల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో టీటీడీ ఉదయాస్తమాన సేవలు

● పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

లబ్బీపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉదయాస్తమాన సేవలను దర్శించుకునే అవకాశాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ నగరశాఖ విజయవాడ వాసులకు కల్పిస్తుందని క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ గురువారం బందర్ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో బృందావన్‌కాలనీలోని ఏ కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, తిరుమల శ్రీవారి సన్నిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ప్రతిసేవను కన్నులారా వీక్షించే అవకాశం భక్తులకు అందిస్తున్నామని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్ బాలాజీ, కన్వీనర్ యడ్ల పార్థసారథి, క్లబ్ సెక్రటరీ బి.సుందర్ రెడ్డి, క్లబ్ ప్రతినిధులు కాసుల బ్రహ్మం, సంపత్, వనమా గణేష్, చారుగండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

విద్యారంగంలో పెట్టుబడులు పెట్టాలి

● స్పా డైరెక్టర్ డాక్టర్ రమేష్ శ్రీకొండ

పటమట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ప్రతిఫలాలు అందాలంటే విద్యా రంగంలో పెట్టుబడులు పెట్టాలని, విద్యా వైద్య ఆర్థిక రంగాల్లో అభివృద్ధి కొనసాగాలని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్ శ్రీకొండ పేర్కొన్నారు. మారిస్ స్టెల్లా కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మింగ్ స్మార్ట్ సిటీస్ ఇన్ సస్టైయినబుల్ సొసైటీ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ విభాగం డీన్ డాక్టర్ శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ యువత మెరుగైన విద్యావకాశాలు కలిగి ఉంటే అన్ని రంగాల్లో అవకాశాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జెసింతా క్వాడ్రస్, కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్, డాక్టర్ ఇన్నాసియా, డాక్టర్ నాగ సుందరి, డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కుళాయిలకు ట్యాప్‌లు లేక జలం వృథా



నాల్గవ డివిజన్‌లోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ సమీపంలో జాతీయ రహదారి వెంబడి పచ్చగడ్డి, మొక్కలు పెరగడానికి పైపులు వేసి కుళాయిలు ఏర్పాటు చేశారు. కుళాయిలకు ట్యాపులు సరిగా లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. గురువారం శ్రీనివాసనగర్, భారతీనగర్ సరిహద్దు రోడ్డు సమీపంలోని గ్రీనరీలో ఉన్న మోటార్ ఆన్ చేయడంతో సమీపంలోని కుళాయిలకు ట్యాపులు లేకపోవడంతో అక్కడి ఉన్న సిబ్బంది నీటిని ఆపడానికి ప్లాస్టిక్ సంచిని అడ్డుగా ఏర్పాటు చేసి వెళ్లిపోయారు. గంటకు పైగా నీరు వృథాగా పోయి సర్వీస్ రోడ్డు మీద ప్రవహించాయి. రోడ్డు మీద ప్రజలు ప్రయాణించడానికి నానా అవస్థలు పడ్డారు. - భారతీనగర్, ఆంధ్రజ్యోతి

బస్టాప్ ఎదురుగా వాహనాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



భారతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుణదల మద్ది రావమ్మతల్లి గుడి సెంటర్ వద్ద ఉన్న బస్టాప్ ఎదురుగా పార్కింగ్ చేసిన వాహనాలను నగర ట్రాఫిక్ పోలీస్ శాఖ అధికారులు గురువారం తొలగించారు. బస్టాపా... పార్కింగ్ స్థలమా అనే కథనం గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో స్పందించిన నగర ట్రాఫిక్ పోలీస్ శాఖ అధికారులు బస్టాప్‌కు ఎదురుగా అడ్డంగా ఉన్న వాహనాలను తొలగించారు.

కౌన్సిల్ అజెండాపై శాఖాధిపతులతో మేయర్ సమీక్ష

కార్పొరేషన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జరిగే కౌన్సిల్ అజెండాపై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం తన చాంబర్లో గురువారం వివిధ విభాగాలకు చెందిన శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిల్ అజెండా, అడిషనల్ అజెండాలో ఉన్న ప్రతిపాదనలను చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలరే అధికారులు సహకరించాలని, ప్రజల మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ నిరంతరం పాటుపడుతుందన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈలు, ఈఈలు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి సత్యనారాయణమూర్తి, జేడీ అమృత్, ఎస్టేట్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ లత, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, బయాలజిస్ట్ సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రావిచెట్టుకు మామిడి కాయలా..!



పై చెట్టును చూస్తే రావి చెట్టుకు మామిడి కాయలు కాసినట్లు ఉంది కదా. కూటి కోసం కోటి విద్యలు అన్న సామెతను ఓ చిరు వ్యాపారి నిజం చేశాడు. ఆగిరిపల్లి సమీపంలోని ఈదర గ్రామానికి చెందిన ఓ చిరు వ్యాపారి తన తోటలో కాసిన కొబ్బరి మామిడి పళ్లను అమ్ముకునేందుకు రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్దకు వచ్చాడు. అక్కడ జాతీయ రహదారికి ఫీడర్ రోడ్డుకు మధ్యన ఉన్న ఓ రావిచెట్టు కొమ్మలకు అక్కడక్కడ మామిడి కాయలు తాడుకు కట్టేసి వేలాడదీశాడు. చూసేవారికి రావి చెట్టుకు మామిడి కాయలు కాశాయా అన్నట్టుగా అనిపించేలా చేయడంతో అటుగా వెళ్లే వారంతా అక్కడ ఆగి చూడటం మొదలు పెట్టారు. దీంతో ఆయన వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టుగా సాగింది.

-గుణదల, ఆంధ్రజ్యోతి

ధర్నా విజయవంతం చేయాలని సీపీఎం ర్యాలీ



రాణిగారితోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్లు, టిడ్కో ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో బాధితులంతా పాల్గొనాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం రాణిగారితోట 17వ డివిజన్‌లో ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ, నగర కార్యదర్శివర్గ సభ్యుడు తమ్మిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంచార జాతుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గాంధీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో ఎస్సీలోని 59 కులాలకు అన్ని రంగాల్లో సమ న్యాయం చేయాలని బేడ (బుడ్గ) జంగం జాతీయ అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. వర్గీకరణకు కృషి చేసిన ప్రధానీ మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగ, మాల, రెల్లి కార్పొరేషన్‌లతో పాటు అన్ని రంగాల్లో అన్యాయానికి గురవుతున్న సంచార జాతుల ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్‌ల ద్వారా కుల ధృవీకర పత్రాలు అందజేయాలని కోరారు. నామాల దుర్గా ప్రసాద్, తూరపాటి గణపతి, చిన మరిదయ్య, వనం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో.. కొంత కాలం

కంచలలో 'తత్వవనం' పేరుతో తొలి పీపీపీ ఎకో టూరిజం ప్రాజెక్టు



నిర్వాహకులతో కలిసి తత్వవనంలోని నిర్మాణాలను పరిశీలిస్తున్న నూకసాని బాలాజీ

- వెల్‌నెస్, ఎకో, స్పోర్ట్స్ టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి
- ఏపీటీడీసీతో ఎంవోయూకు నిర్వాహకులు సిద్ధం
- ప్రాజెక్టును సందర్శించిన ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని

జిల్లాలోని నందిగామ దగ్గర్లో ఉన్న కంచలలో పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో తొలి ఎకో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మొట్టమొదటి ఫామ్ గేటెడ్ కమ్యూనిటీగా అభివృద్ధి చేస్తున్న ప్రైవేటు సంస్థ, రాష్ట్ర ప్రభుత్వపు తాజా పర్యాటక పాలసీ ప్రకారం ఎకో టూరిజం, వెల్‌నెస్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)తో కలిసి పని చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం తన విజన్ -2047 ప్రణాళికలో భాగంగా పర్యాటక రంగాన్ని విశేషంగా అభివృద్ధి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించింది. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు పలు రకాల టూరిజాన్ని ప్రోత్సహిస్తూ ప్రత్యేక రాయితీలను అందిస్తోంది. ఏపీటీడీసీతో ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకునేందుకు సిద్ధమవుతోంది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

నందిగామ నియోజకవర్గం తుర్లపాడు మండలం, కంచల గ్రామంలో మున్నేరు నది ఒడ్డున 'తత్వవనం - షేర్ జాయ్ విత్ నేచర్' పేరుతో ఒక రిసార్ట్‌ను నిర్మిస్తున్నారు. దీన్ని ఎకో, వెల్‌నెస్, స్పోర్ట్స్ టూరిజం సెంటర్‌గా తీర్చిదిద్దాలని నిర్వాహకులు భావిస్తున్నారు. పర్యాటకులు ప్రకృతి ఒడిలో కొంతకాలం జీవించాలనుకుంటే ఇక్కడికి రావచ్చు. చుట్టూ ఉన్న పొలాల్లో కూరగాయలు, ఉద్యానతోటలను అభివృద్ధి చేస్తారు. కూరగాయల సాగు, ఉద్యానపంటల సాగు వంటివి చేసుకుంటూ రిసార్ట్‌లో హాయిగా గడపవచ్చు. ఇక్కడ సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి అందాలు, యోగా, ధ్యానం, ఆయుర్వేద చికిత్సలు, సంప్రదాయ వంటకాలతో సేవలందిస్తారు. పూర్తిగా పర్యావరణ అనుకూల నిర్మాణాలు కొన్ని చేపట్టారు. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి. ఇక్కడ పూర్తిగా గ్రామీణ వాతావరణం కనిపిస్తుంది. మున్నేరు నది ఒడ్డున పక్షుల కిలకిలారావాలు, వాగు శబ్దాల మధ్య పర్యాటకులకు మైమరపించే అనుభూతిని పంచేలా రిసార్ట్‌ను రూపొందిస్తున్నారు. టేబుల్ టెన్నిస్, క్రికెట్ నెట్, బ్యాడ్మింటన్ కోర్టు, బాస్కెట్‌బాల్ నెట్, ట్రాంపాలిన్ వంటివి ఆడుకోవచ్చు. రివర్ సైడ్ క్యాంపింగ్, గోశాల, పాకెట్ గార్డెన్, ఆర్గానిక్ ఫుడ్ వంటి 12కు పైగా ఫామ్ హౌసెస్, లగ్జరీ క్లబ్ హౌస్‌లు, జాగింగ్ ట్రాక్, డే వ్యూ, నైట్ వ్యూ వంటి అనేక సదుపాయాలుంటాయి. తత్వవనం ప్రాజెక్టు ఎన్టీఆర్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే ఎకో, వెల్‌నెస్, స్పోర్ట్స్ టూరిజంకు దరఖాస్తు చేసుకున్న ప్రాజెక్టు కావటంతో ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ ఇటీవల దీన్ని సందర్శించారు. దాదాపుగా 85 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ రిసార్ట్ వివరాలను ఫౌండర్ నరేంద్ర, డైరెక్టర్ ఒక్కిలిగడ్డ భాస్కర్ చైర్మన్ బాలాజీకి వివరించారు. దీంతో రిసార్ట్ మొత్తం కలియ తిరిగిన ఆయన ఈ రిసార్ట్ ఒక అద్భుతమైన పర్యాటక ప్రాజెక్టుగా నిలుస్తుందని కొనియాడారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సీఎం సహకారంతో ఈ ప్రాజెక్ట్‌ను మరింత ప్రోత్సహించి, రాష్ట్ర పర్యాటక రంగంలో ప్రత్యేకస్థానం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సాయంతో ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి అన్ని విధాలా మద్దతు ఉంటుందన్నారు.

పర్యాటక రంగంలో కొత్త ఉత్తేజం

తత్వవనం రిసార్ట్‌లో కార్పొరేట్ సమావేశాలు, కుటుంబ సమ్మేళనాలు, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు అనుకూలంగా ప్రత్యేక సదుపాయాలున్నాయి. దీంతో స్థానికులకు ఉపాధితో పాటు, గ్రామీణ సంస్కృతిని ప్రోత్సహించి, స్థానిక వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయిలో ప్రారంభించటానికి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రజాస్వామిక శాస్త్రీయ భాషా విధానం కావాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

గవర్నర్‌పేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకు తగినట్టు ప్రజాస్వామిక పద్ధతిలో భాషలు నేర్చుకునే అవకాశాన్ని ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం 'జాతీయ విద్యావిధానం-భాషావిధానం'పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ త్రిభాషా సూత్రాన్ని ఖచ్చితంగా అమలు చేస్తేనే నిధులు ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. మాతృభాషలో పట్టు లేకుండా దేశం అభివృద్ధి చెందడం సాధ్యం కాదన్నారు. ఏ రాష్ట్రానికి ఏ భాష అవసరం ఉందో దాని ఆధారంగా భాషను నేర్చుకుంటారని అలాకాకుండా బలవంతాన వలానా భాష నేర్చుకోవాలని నిర్దేశించడం సరికాదన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, ఎస్. చిరంజీవి, ఆంధ్ర మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్స్ నిర్వహణ స్థానికులకు అప్పగించాలి: ఎమ్మెల్యే గద్దె

పటమట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, బీసీ సబ్ ప్లాన్, నియోజవకర్గ అభివృద్ధి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ నిర్వహణ బాధ్యతలను స్థానికులకే కేటాయించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి పి.నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆన్‌లైన్‌లో వేలం వేయడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల వారు ఆయా కమ్యూనిటీహాళ్ల నిర్వహణ బాధ్యతలు దక్కించుకొని వాటిలో వ్యాపారాలు చేసుకుంటున్నారని, వాటిని టెంట్ హౌస్‌లు మాదిరిగా తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకే కేటాయిస్తే నామమాత్రపు ఫీజులతో అక్కడి వారికి అవి ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. ఈవిషయాన్ని పరిశీలించాలని ఆయన మంత్రిని కోరారు.

మహారే.. 'మాయా'

ముగిసిన సురభి నాటకోత్సవాలు



నాటకంలో శ్రీకృష్ణుడితో ఘటోత్కచుడి సన్నివేశం

విజయవాడ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ నాటక రంగానికి చిరస్మరణీయంగా నిలిచిన సురభి బృందం 'మాయాబజార్' నాటక ప్రదర్శనతో ప్రేక్షకుల అభినందనల వెల్లువ కురిసింది. సురభి నాట్యకళ మండలి, సురభి ఆర్ట్స్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో మాయాబజార్ పౌరాణిక సురభి నాటకం నగరంలోని శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత, నృత్య కళాశాలలో జరిగిన సురభి నాటక మహోత్సవాల చివరి రోజైన గురువారం 'మాయాబజార్' ప్రదర్శన జరిగింది. హాస్యం, ఇంద్రజాలం, సంగీతం, భావోద్వేగాలతో కూడిన ఈ నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ నాటకంలో ఘటోత్కచుడి అల్లరి, చతురత, మాయాశక్తులతో మెప్పించగా, శ్రీకృష్ణుడు తన మేధస్సుతో కథనాన్ని ముందుకు నడిపించడం, లక్ష్మణ కుమారుడు తన హాస్యంతో ప్రేక్షకులను విపరీతంగా నవ్వించగా, అభిమన్యుడు - శశిరేఖల ప్రేమకథ ఈ నాటకానికి ప్రత్యేక అందాన్ని అందించింది. హిడింబ పాత్రలోని శక్తి, తల్లిగా ఆమె ముద్దుగా మెలిగిన తీరు భావోద్వేగాన్ని పంచింది. మాధుర్యంగా ఆలపించిన పాటలు, ఘటోత్కచుడి మాయా వీరంగాలు, శ్రీకృష్ణుడి చతురత ఇవన్నీ ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు తెచ్చుకొన్నాయి. రంగస్థల రూపకల్పనలో చూపిన క్రియేటివిటీ అద్భుతంగా అనిపించింది. ప్రతి పాత్ర తనదైన శైలిలో న్యాయం చేసింది. దర్శకత్వం, రంగస్థల రూపకల్పనలో దర్శకత్వం - సురభి ప్రసాద్, పర్యవేక్షణ - సురభి రాయలు ప్రతిభను చాటారు. శ్రీకృష్ణుడు - నిఖిలేష్ సురభి, బలరాముడు - నాగబాబు, ఘటోత్కచుడు - సురభి సంతోష్, అభిమన్యుడు - భానుప్రసాద్, హిడింబ - ప్రియాంక, సతీష్‌లు తమ పాత్రల నటన అభినయాలతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.



మాయాబజార్ నాటకంలో హావభావాలు పలికిస్తున్న కళాకారులు

కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బెంజిసర్కిల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (ఏపీకేజీబీవీ) ప్రవేశాలకు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి. శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో 2025-26 విద్యాసంవత్సరానికిగాను 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు, అదే విధంగా 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానేసినవారు పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ పరిధిలోని బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు https://apkgbv.apc ద్వారా పొంద వచ్చన్నారు. వివరాలకు, 7075159996, 7075039990 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

హెల్త్ సెక్రటరీలకు పనిభారం తగ్గించాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

ధర్నాచౌక్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హెల్త్ సెక్రటరీలకు పనిభారం తగ్గించాలని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్‌లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న హెల్త్ సెక్రటరీల సమస్యల పరిష్కారానికి ఏపీ యునైటెడ్ వీలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెలలో మాస్ రిప్రజెంటేషన్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కార్యాలయాల ఎదుట జెండాల ఎగరవేత, మే 20 నుంచి పెన్ యాప్ డౌన్ నిర్వహించాలని ప్రకటించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, ఎ.విద్యాసాగర్ దీక్ష శిబిరాన్ని సందర్శించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంగా తీసుకెళ్లాలి

- ఖరీఫ్ కార్యాచరణ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ



రైతును సత్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మన మనుగడకు ప్రతి మట్టి రేణువూ, వర్షపు చినుకూ ఆధారమేనని, ప్రకృతి వ్యవసాయాన్ని జిల్లాలో ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయం - ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రసాయన పురుగుమందులు, ఎరువులు నెమ్మది నెమ్మదిగా మనిషి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, సాగులో సేంద్రీయ ఎరువులు, జీవ ఉత్ప్రేరకాలు, కషాయాలు/ద్రావణాల వినియోగంతో ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు చేతికందుతాయని కలెక్టర్ వివరించారు. ప్రతి గ్రామంలో రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలని, స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రకృతి సాగుదిశగా నడిపించాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేయూతతో నిమ్మ, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ బేర్, దానిమ్మ తదితర పండ్ల తోటలతో పాటు పూలసాగు వంటి 19 రకాల ఉద్యాన పంటలను చేపట్టవచ్చన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో వ్యవసాయ రంగ వృద్ధిని 6 నుంచి 15 శాతానికి తీసుకెళ్లేందుకు అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగుతో ముందుకెళ్తున్న రైతులు వెంకట గురుప్రసాద్ (నున్న), శ్రీనివాసరెడ్డి (రెడ్డిగూడెం)ని కలెక్టర్ సత్కరించారు. జిల్లా వ్యవసాయ అధికారి, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ డీఎంఎఫ్ విజయకుమారి, డ్వామా పీడీ ఏ రాము, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన, జిల్లా ఉద్యాన అధికారి పీ బాలాజీ కుమార్, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారి పీఎం సుభానీ, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కే ఉషారాణి, ఏటీఎంఏ పీడీ యూ నర్సింహారావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్, ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ అధికారులు, సిబ్బంది డి.జాన్, జీవీఎస్ జానకమ్మ, బి.ప్రభాకర్ పాల్గొన్నారు.

శిరీష్మ ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకం

వేసవిలో చల్లని తాగునీటిని అందించే కార్యక్రమం అందరూ భాగస్వాములవ్వాలని, ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావాలని, చలసాని శిరీష్మ కుటుంబసభ్యుల సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని దాతల సహకారంతో జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు చల్లని నీరు, మజ్జిగ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. చలసాని శిరీష్మ జ్ఞాపకార్థం కుటుంబసభ్యుల అధ్వర్యంలో రాఘవయ్య పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీరు ఆర్వో ప్లాంట్, వైద్యశిబిరాలను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీరు అందించేందుకు పెద్దగా ఖర్చు చేయనవసరం లేదని ప్రతి ఒక్కరూ ఇల్లు లేదా వ్యాపార సంస్థ వద్ద మట్టికుండలను, కూలింగ్ టిన్నులను ఏర్పాటు చేసుకొని దాహంతో వున్న వారికి చల్లని నీరు, మజ్జిగలను పంపిణీ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధా న కార్యదర్శి ఎ.విద్యాసాగర్, చలసాని శ్రీనివాసరావు, డాక్టర్ రామశేషయ్య, టి.లక్ష్మీనారాయణ, సామంతపూడి చైతన్య, ఎన్.నారాయణ, డి.సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, సీవీఆర్ ప్రసాద్, నజీరుద్దీన్ పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

వన్‌టౌన్: విజయవాడ బందరు రోడ్డులోని ఒక రెస్టారెంట్‌లో గురువారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. మాచవరం పోలీసులు వివరాల మేరకు బందరు రోడ్డులోని మ్యాక్స్ షోరూంలోని పై అంతస్తులోని ప్లాంట్ పామ్65 రెస్టారెంట్ వద్ద కిచెన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కిచెన్ పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొస్తున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కబ్జా బాధితులకు దొరకని న్యాయం

- నెలరోజులైనా కేసు నమోదు చేయని నున్న పోలీసులు
- రాజకీయ ఒత్తిళ్లే కారణమని బాధితుల ఆరోపణ

పాయకాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కండ్రిక కాలనీ సమీపంలోని ప్రైవేట్ వెంచర్ స్థలాలని నమ్మి కార్పొరేషన్ స్థలాలు కొని మోసపోయిన బాధితులకు న్యాయం దొరకడం లేదు. ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ స్థలంగా నమ్మించి మోసగించిన కబ్జాదారులు బయట దర్జాగా తిరుగుతుంటే, లక్షలాది రూపాయలు మోసపోయిన బాధితులు పోలీసు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమను మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు చేసి నెల రోజులైనా కేసు నమోదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వివరాల ప్రకారం స్థానిక కండ్రిక కాలనీకి సమీపంలోని ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ హౌస్ సొసైటీ లిమిటెడ్ వెంచర్‌కు మధ్య 4000 గజాల వీఎంసీ స్థలం ఉంది. గత వైసీపీ పాలనలో వైసీపీ ఎమ్మెల్సీ అనుచరుడు ఈ స్థలాన్ని కబ్జా చేసి సిమెంట్ ఫ్యాక్టరీ వెంచర్‌గా నమ్మించి అమ్మకానికి పెట్టాడు. ఈ స్థలాలను అతడు తన తండ్రితో రిజిస్ట్రేషన్లు చేయించాడు. ఇటీవల స్థలాలు కబ్జా చేసి అమ్మకాలు జరుపుతున్నట్టు ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి ఆ స్థలాల్లో వేసిన సరిహద్దు రాళ్లను తొలగించి హెచ్చరిక బోర్డులు పెట్టారు. అప్పటికే 20 స్థలాలను అమ్మేసినట్టు తెలిసింది. దీంతో బాధితులంతా న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. అప్పట్లోనే నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేస్తామన్న పోలీసులు నేటికీ బాధితులను గానీ, మోసగించిన వ్యక్తులను గానీ విచారించలేదు. బాధితులు స్టేషన్‌కు వెళ్లినా తిప్పించడమే తప్ప కేసు నమోదు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వార్డు సభ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు



బోర్డు సమావేశంలో మహిళలపై దురుసుగా ప్రవర్తిస్తున్న వార్డు సభ్యుడు చిట్టిబాబు (ఫైల్‌ఫొటో)

మైలవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మైలవరం పంచాయతీ సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి ఫిర్యాదు మేరకు 12వ వార్డు సభ్యుడు ముద్ర నాగ వెంకట చిట్టిబాబు, 18వ వార్డు సభ్యుడు ఎర్రా రమేష్‌పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశారు. ఈనెల 17న మైలవరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన బోర్డు సమావేశం మధ్యలోనే సర్పంచ్ వెళ్లిపోయినట్టు చిట్టిబాబు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. కులం పేరుతో రమేష్ అనే వార్డు సభ్యుడు హేళనగా మాట్లాడినట్టు సర్పంచ్ ఫిర్యాదు చేయడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ


మిషన్ వాత్సల్యతో శిశు క్షేమం, సంక్షేమం

- జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నిస్సహాయ స్థితిలో ఉన్న, అవసరాలున్న చిన్నారుల క్షేమం, సంక్షేమం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న మిషన్ వాత్సల్యను లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఏర్పాటైన గ్రామ, వార్డు స్థాయి కమిటీలు క్రియాశీలం కావాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మిషన్ వాత్సల్య - శిశు సంక్షేమ, రక్షణ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. మిషన్ వాత్సల్య లక్ష్యాలు, జిల్లాలో వాటి సాధనలో పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశు సంరక్షణ చట్టాలు, కుటుంబ ఆధారిత సంరక్షణకు ప్రోత్సాహం, సంస్థాగత మద్దతు, ఆర్థిక సహకారం, శిశు సంరక్షణ పథకాల అనుసంధానంతో మిషన్ వాత్సల్య అమలుకు చర్యలు తీసుకొంటున్నామని, ఈ క్రమంలో సర్పంచ్ / కౌన్సిలర్ / కార్పొరేటర్ చైర్మన్‌గా గ్రామ, వార్డుస్థాయి కమిటీలు ఏర్పాటయ్యాయని, ఇవి 15 రోజులకొకసారి తప్పనిసరిగా సమావేశం కావాలని సూచించారు. జిల్లా న్యాయసేవల సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, డీసీపీ కేజీవీ సరిత, జడ్పీ సీఈవో వై.కన్నమనాయుడు, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా శిశు సంరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జి.మహేశ్వరరావు, ఏసీపీ కె.లతాకుమారి, సాంఘిక సంక్షేమ అధికారి కెఎస్.శిరోమణి, లేబర్ కమిషనర్ సిహెచ్. ఆశారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ టి.జ్యోతి, డీసీపీయూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి భూముల వేలం పాట రద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వన్‌టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మైలవరం నియోజకవర్గం, జి.కొండూరు మండలం, ఆత్కూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన రూ.23.82 సెంట్ల భూమికి ఇటీవల నిర్వహించిన బహిరంగ వేలం పాటలో జరిగిన అవకతవకలపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి బహిరంగ వేలంపాటను రద్దు చేశారు. దేవస్థానం నిబంధనలకు విరుద్ధంగా ఆదాయానికి గండికొట్టేలా వ్యవహరించటంపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'రామలింగేశ్వరస్వామికే శఠగోపం' అనే ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ పామర్తి సీతారామయ్య, ఇన్‌స్పెక్టర్ సుజన్ ఈవో నాగరాజుతో కలిసి దేవస్థానం భూమిని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలం పాటలో అవకతవకలు జరిగాయని నిర్ధారించుకున్న సహాయ కమిషనర్ పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వేలం పాటను రద్దు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఉన్నతాధికారుల అనుమ తి తీసుకుని త్వరలోనే మరోసారి వేలం పాట నిర్వహిస్తామన్నారు.



ఎన్జీవో రాష్ట్ర నేతలకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పాదయాత్రలో హామీని నిలబెట్టుకోండి

- రాష్ట్ర ప్రభుత్వానికి ఈ-సేవ ఉద్యోగుల వినతి

ధర్నాచౌక్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగావకాశాలు కల్పించి న్యాయం చేయాలని గవర్నమెంట్ అర్బన్ ఈ-సేవ ఉద్యోగులు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ ఈ (మీ) సేవ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో 'విజ్ఞాపన దీక్ష గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల ముందు చేసిన పాదయాత్రలో తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీక్షకు సంఘీభావం తెలిపిన ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కేవీ.శివారెడ్డి, ఏ విద్యాసాగర్‌కు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ దీక్షను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ప్రారంభించారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సీహెచ్.శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెనుమాక రైతులకు ప్లాట్ల కేటాయింపు

- సీఆర్‌డీఏ ఆఫీసులో ఈ - లాటరీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతి రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక రైతులకు సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. 510 మంది రైతులకు గురువారం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ- లాటరీ విధానంలో మొత్తం 1,352 ప్లాట్లను కేటాయించారు. వీటిలో 787 నివాస ప్లాట్లు కాగా 565 వాణిజ్య ప్లాట్లున్నాయి. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ-లాటరీ విధానంలో సీఆర్‌డీఏ అధికారులు రైతులకు కేటాయించారు. ముందుగా వారికి ట్రయల్ రన్ వేసి చూపించారు. తర్వాత అసలైన ప్రక్రియను చేపట్టారు. ప్లాట్లు పొందిన రైతులకు అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందజేశారు. సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు మాట్లాడుతూ రైతులకు కేటాయించిన ఎల్పీఎస్ లే అవుట్లలో అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, కొత్తగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ప్రారంభించామన్నారు. డైరెక్టర్ (ఆఫీస్ మేనేజ్‌మెంట్) వల్లభనేని శ్రీనివాస రావు, సీఆర్‌డీఏ ల్యాండ్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎజి.చిన్నికృష్ణ, వసంత రాయుడు, ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరరరావు, పాల్గొన్నారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఆయా విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను దేవస్థానం ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గురువారం అంతర్గత బదిలీలు చేశారు. పరిపాలనా విభాగం మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్, ట్రస్ట్ బోర్డు, కనకదుర్గ ప్రభ బాధ్యతలను నిర్వహిస్తున్న ఏఈవో జంగం శ్రీనివాసమ్ అన్నదానం, హెడ్ ఆఫ్ టెంపుల్, నిత్య పూజలు, కనకదుర్గ ప్రభతో పాటు వేద పాఠశాలకు బదిలీచేశారు. అన్నదానం ప్రధాన స్టోర్, ప్రసాదం తయారీ, శానిటేషన్ విభాగం, వేద పాఠశాలలో పనిచేస్తున్న ఏఈవో పి.చంద్రశేఖర్‌ను పరిపాలనా విభాగం, లీగల్ సర్వీస్ మేటర్, మెయిన్ టెంపుల్స్, శానిటేషన్, ట్రస్ట్‌బోర్డు, సబ్ టెంపుల్ విభాగాలకు బదిలీ చేశారు. ల్యాండ్స్ లీజ్, లీగల్ సెక్షన్, శివాలయం, ఓవరాల్ ఇన్‌చార్జి, ఫెస్టివల్, పూజలు, దత్తత ఆలయాలు విభాగం నుంచి ప్రసాదం తయారీ, సర్వీసు మేటర్స్, ఫెస్టివల్, పూజలతో పాటు ల్యాండ్స్, లీగల్ సర్వీస్ బాధ్యతలను అప్పగించారు. కాగా, ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లను అంతర్గత బదిలీలు చేశారు. 31 మంది జూనియర్ అసిస్టెంట్లను కూడా వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

సందేశం

వరాల వసంతం... రంజాన్

రంజాన్ నెల ప్రధానంగా ఆత్మప్రక్షాళన మాసం. విశ్వాసులు తమ జీవితాలను ఆధ్యాత్మికతకు పునరంకితం చేసే మాసం. వ్యక్తి జీవన విధానంలో చైతన్యాన్ని ప్రేరేపించే మాసం. క్రమశిక్షణను నేర్పి, దైవ సేవలో నిమగ్నమయ్యేలా చేసే మాసం. దైవం కరుణా కటాక్షాలను, ప్రసన్నతను పొందే మాసం. సౌభ్రాతృత్వానికి అద్దం పట్టే మాసం. పరస్పర ఆత్మీయతా భావాన్ని అనుసంధానించే ఈ మాసం ఒక సత్కార్యానికి పదిరెట్లు పుణ్యఫలాలను అందిస్తుంది.

ఈ నెలలో స్వర్గద్వారాలు పూర్తిగా తెరిచి ఉంటాయి, నరక ద్వారాలు మూతపడతాయి. వయసుతో నిమిత్తం లేకుండా విశ్వాసులు ఇంటిల్లిపాదీ రాత్రింబవళ్ళు ఆధ్యాత్మికతలో మునిగి తేలుతారు. దైవం పట్ల విశ్వాసాన్ని పటిష్టపరచుకుంటారు. పుణ్యకార్యాలపట్ల ఆకాంక్షను, పాపకార్యాల పట్ల విముఖతను పెంచుకుంటారు. అల్లాహ్ తన బోధనామృతాన్ని ప్రజలకు అందజేసిన మాసం ఇది. ఆయన తన అపార అనుగ్రహాన్ని వర్షిస్తాడు. ధనవంతులకు పేదల హక్కును గుర్తు చేసి, జకాత్ ఫిత్రా లాంటి ధర్మాలను నిర్వర్తించడాన్ని విధిగా నిర్దేశించిన రంజాన్ నెల... ఉపవాసాల ద్వారా... ఆర్తుల ఆకలిదప్పులను సంపన్నులకు అనుభవపూర్వకంగా తెలియజేస్తుంది.

ఖుర్ఆన్ అవతరించిన మాసం

ఈ మాసం పేరిట ఉన్న పర్వదినాన్ని 'ఈద్-ఉల్-ఫితర్' అని కూడా వ్యవహరిస్తారు. రంజాన్ మాసం... ఖుర్ఆన్ అవతరించిన నెల. "ఈ దివ్య గ్రంథం మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన నిదర్శనాలు ఇందులో ఉన్నాయి. ఈ నెలను ఎవరు చూస్తారో వారు ఉపవాసాలు ఉండాలి" అని దివ్య ఖుర్ఆన్ చెబుతోంది. "వెయ్యి నెలలకన్నా శ్రేష్ఠమైన రాత్రి ఒకటి ఈ మాసంలోనే ఉంది. దాని శుభాలను కోల్పోయినవారు దౌర్భాగ్యులు. స్వర్గానికి ఎనిమిది ద్వారాలు ఉన్నాయి. వాటిలో ఒక ద్వారాన్ని కేవలం ఉపవాసులకే ప్రత్యేకంగా కేటాయించడం జరిగింది" అని పేర్కొంది.

రంజాన్ మాసంలోనే ఇబ్రహీమ్ ప్రవక్త 'సహీఫాల'ను, మూసా ప్రవక్త 'తౌరాత్' గ్రంథాన్ని, దావూద్ ప్రవక్త 'జబూర్' గ్రంథాన్ని, ఈసా ప్రవక్త 'ఇంజీల్' గ్రంథాన్ని దైవ కృపతో అందుకున్నారు. ఈ నెలలో ప్రపంచవ్యాప్తంగా మసీదులు కళకళలాడతాయి. దానధర్మాలకు సంబంధించిన కార్యాలు ముమ్మరం అవుతాయి. సోదర భావం పరస్పరం బలపడుతుంది. శాంతియుత వాతావరణంలో... విశ్వాసులు భక్తి ప్రపత్తులతో ప్రార్థనలు చేస్తారు. యంత్రాలు ఎడతెరిపి లేకుండా కొంతకాలం పని చేసిన తరువాత... వాటికి విశ్రాంతి కావాలి. వాటి భాగాలను ఊడదీసి శుభ్రం చేయాలి. అప్పుడే మలినాలన్నీ పోతాయి. మళ్ళీ సమర్థమైన విధి నిర్వహణకు సిద్ధమవుతుంది. అలాగే మన జీర్ణ వ్యవస్థకు విశ్రాంతిని ఇచ్చి, దానికి క్రమబద్ధతను చేకూర్చే ఆరాధనే... రోజా (ఉపవాసం).

• మహమ్మద్ వహీదుద్దీన్

తెలుసుకుందాం

పురాణ గ్రంథాల ప్రకారం... అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాళ లోకాలను 'అధోలోకాలు' అంటారు. ఈ లోకాలలో విలాసవంతమైన పట్టణాలను, భవనాలను దానవరాజు, మహా శిల్పి అయిన మయుడు నిర్మించాడు. వీటిలో భూమి తెల్లగా, నల్లగా, ఎర్రగా, పసుపు పచ్చగా... ఇలా అనేక రంగుల్లో ఉంటుంది.

ఏ లోకంలో ఎవరుంటారు?



అతలం

అతల లోకంలో మయుడి కుమారుడు బలాసురుడు ఉంటాడు. అతను ఎదుటివారి మీద మాయలను ప్రయోగించి వినోదిస్తూ ఉంటాడు. అతనికి 96 రకాల మాయలు తెలుసు.

వితలం

వితల లోకానికి హాటకేశ్వరుడనే పేరున్న శివుడు అధిపతి. అక్కడ భవానీదేవితో కలిసి ఉంటాడు. ఈ లోకంలో హాటకీ అనే నది ఉంది. ఆ జలంతో బంగారం తయారవుతుంది.

సుతలం

వితలలోకం కింద ఉన్నది సుతల లోకం. బలి చక్రవర్తి అక్కడే ఉంటాడు. శ్రీ మహావిష్ణువు... త్రివిక్రమరూపం ధరించి, ముల్లోకాలను తన పాదాలతో ఆక్రమించాడు. బలి చక్రవర్తిని భూమి కిందికి పంపినప్పుడు... అతనికి సుతలలోకంలో ఇంద్రత్వాన్ని ఆ శ్రీహరి అనుగ్రహించాడు.

తలాతలం

ఈ లోకానికి మయుడు ప్రభువు. రాక్షసుల పట్టణాలను నిర్మించినది అతనే. శివుడు త్రిపురాసుర సంహారం చేసినప్పుడు... మహావిష్ణువును మయుడు శరణు కోరాడు. ఆయన మయుణ్ణి కరుణించి తలాతలానికి రాజును చేశాడు.

మహాతలం

తలాతలానికి దిగువన ఉండే మహాతలంలో... కద్రువ సంతానమైన సర్పరాజులు ఉంటాయి. ఒక్కొక్కదానికి అనేక పడగలు ఉంటాయి. నారాయణుడి వాహనమైన గరుత్మంతుడంటే భయంతో అనుక్షణం కలవరపడుతూ జీవిస్తాయి.

రసాతలం

మహాతలానికి కింద ఉండే రసాతలం... దైత్యులు, దానవులు అయిన నివాతకవచులు, కాలకేయులకు నిలయం. వారికి దేవతలతో సరిపడదు. కానీ శ్రీహరికి లొంగి ఉంటారు.

పాతాళం

అన్నిటికన్నా దిగువన ఉండేది పాతాళ లోకం. శంఖుడు, మహాశంఖుడు, ధనుంజయుడు మొదలైన మహానాగులు అక్కడ ఉంటాయి. వాటిలో కొన్నిటికి అయిదు, మరికొన్నిటికి పది, ఇంకొన్నిటికి వంద తలలు ఉంటాయి. వాటి పడగలమీద మణులు మెరుస్తూ ఉంటాయి. వాటి మెరుపులు పాతాళంలోని చీకట్లను తొలగిస్తూ ఉంటాయి. పాతాళ లోకం అడుగున ఆదిశేషుడు ఉంటాడు. అనంతుడు, సంకర్షణుడు అని పేర్లు ఉన్న ఆయన తల మీద ఆవగింజలా ఈ భూమండలం ఉంది.

• ప్రయాగ రామకృష్ణ

ఏది అసలైన ధ్యానం?

చింతన

'ధ్యానం' అంటే రోజూ ఒక భంగిమలో కాసేపు కళ్ళు మూసుకొని, శ్వాస లాంటి ఏదో ఒక విషయం మీద దృష్టి నిలపడం అనే అభిప్రాయం చాలా బలంగా ఉంది. ఈ ప్రక్రియ వల్ల తాత్కాలికమైన ప్రశాంతత కలుగుతుందేమో కానీ... మనసులోని సంఘర్షణలు, జీవితంలో దుఃఖం మాత్రం తొలగిపోవడం లేదు. ఈ వాస్తవం మనందరికీ తెలుస్తూనే ఉంది. మరి ఏది అసలైన ధ్యానం? మనం ఏ విషయాన్నైనా మనసుతోనే గ్రహిస్తాం. అందుకే జీవితం గురించి స్పష్టత రావాలంటే... మనసు గురించి లోతుగా తెలియాలి. శరీరాన్ని అద్దంలో చూసుకోవడం మనకు అలవాటే. ఆ సమయంలో మన ఆకార వికారాలు మన అవగాహనలోకి వస్తాయి. అలాగే, మన మనసును మనమే అద్దంలో చూసుకోగలమా? దాని తీరుతెన్నులను సాక్షిలా గమనించగలమా? అవును. అటువంటి నిశితమైన, నిరంతరమైన పరిశీలనే ధ్యానం. మనసు మాయలు కనిపెట్టడమే ధ్యానం

అరువు తెచ్చుకున్న జ్ఞానం

దేవుడు, మత విశ్వాసాలు, జీవితం పట్ల దృక్పథం... ఇలా మన జీవితాన్ని నడిపే ముఖ్యమైన విషయాల పట్ల మనకున్న అభిప్రాయాల్లో ఎక్కువ శాతం మన అనుభవంలోంచి వచ్చినవి కావు. ఇది ఇతరుల నుంచి వచ్చిన 'సెకెండ్ హ్యాండ్' జ్ఞానం. అలా అనేకానేక ప్రభావాలు, నమ్మకాలు, అరువు తెచ్చుకున్న జ్ఞానంతో మన మనసు కండిషన్ (నిబద్ధీకరణ) అయిపోయింది. అలాంటి మనసు... దుమ్ము పట్టిన కళ్ళద్దాలలాంటిది. కళ్ళద్దాల మీద మురికి పేరుకుపోతే వాటి ద్వారా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని సరిగ్గా చూడలేం. అలాగే, రకరకాల నిబద్ధీకరణలతో నిండిన మనసు వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్టుగా చూడలేదు. సరైన నిర్ణయాలు తీసుకోవడంలో మనకు సహకరించలేదు. అలాంటి మనసు ఉన్నంతవరకూ... దుఃఖం, సంఘర్షణల నుంచి మనకు విముక్తి లేదు. సత్యం వైపు మనం ప్రయాణించే అవకాశమే లేదు. శరీరం మీద ఆచ్ఛాదనలు తొలగినప్పుడు అసలు రూపం బయటపడినట్టే... మనసు మీద ఏర్పడిన ప్రభావాల గురించి, నిబద్ధీకరణ పొరల గురించి స్పృహ కలిగినట్టైతే... అవి వాటంతట అవే తొలగిపోతాయి. అలాంటి అవగాహనతో మానసికంగా అనాచ్ఛాదితం కావడమే నిజమైన ధ్యాన సాధన. జీవితం అంటే వర్తమాన క్షణాల దొంతర అని మనకు తెలుసు. అయితే గతం తాలూకు జ్ఞాపకాలు-గాయాలు, భవిష్యత్తు గురించిన ఊహలు-భయాలు నిరంతరం వర్తమాన క్షణంలోకి చొచ్చుకువస్తూ ఉంటాయి. అంటే గడచిపోయిన కాలం, ఇంకా రాని భవిష్యత్తు అనేవి అత్యంత విలువైన, తాజాది అయిన ప్రస్తుత క్షణాన్ని కలుషితం చేస్తున్నాయన్న మాట. ఈ అవగాహనతో... ప్రతిక్షణంపై నిత్యం ఎరుక (అవేర్‌నెస్‌తో) కలిగి ఉండడం కూడా ధ్యానంలో భాగమే.



మన మనసును మనమే అద్దంలో చూసుకోగలమా? దాని తీరుతెన్నులను సాక్షిలా గమనించగలమా? అటువంటి నిశితమైన, నిరంతరమైన పరిశీలనే ధ్యానం. మనసు మాయలు కనిపెట్టడమే ధ్యానం.

స్వీయాన్వేషణ... సత్యాన్వేషణ

"మనసు వేసే మోసపు వేషాలను కనిపెట్టడం, దాని తాలూకు కపటాన్ని కడిగి వేయడమే ధ్యానం" అంటారు ప్రఖ్యాత తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి. ప్రతి విషయాన్నీ ప్రశ్నించి, లోతుగా ఆలోచించి, సత్యాసత్యాలను బేరీజు వేసి తేల్చుకొనే సమయం, ఓపిక మనలో చాలామందికి ఉండవు. అందుకే ఎవరో ఇతరులు చెప్పిన జవాబులను ఇట్టే నమ్మేసి సమాధానపడమంటూ మనసు మభ్యపెడుతుంది. ఈ మాయకు లొంగకుండా అప్రమత్తంగా ఉండడం, దేనినైనా సొంత అన్వేషణ, స్వీయ అనుభవం ద్వారా తెలుసుకోవడం, తేల్చుకోవడం... ఇవన్నీ ధ్యానంలో భాగమే. నిజమైన ధ్యానం అంటే స్వీయాన్వేషణ... సత్యాన్వేషణ. తనను తాను తెలుసుకొనే ప్రయాణంలో భాగంగా మనసును నిశితంగా పరిశీలన చేయడమే నిజమైన ధ్యాన సాధన. వాహనం నడిపేవారి కళ్ళు, కళ్ళద్దాలు సరిగ్గా పని చేస్తేనే ప్రయాణం భద్రంగా సాగుతుంది. అలాగే జీవిత ప్రయాణం సవ్యంగా సాగాలంటే... స్పష్టంగా చూడగలిగే మనసు ద్వారానే కుదురుతుంది. నమ్మకాలు, గత జ్ఞానం తాలూకు దుమ్ము వదిలించుకోవడం ద్వారా తేటపడిన మనసు... ఉన్నదాన్ని ఉన్నట్టుగా చూడగలుగుతుంది. అంతర్గత సంఘర్షణలన్నిటినీ అంతం చేస్తుంది. అసత్యమైన వాటిని గుర్తించి, తొలగించుకొనే తీక్షణతను సంతరించుకుంటుంది. అలాంటి ధ్యానాత్మకమైన మనసే సత్యానికి ద్వారాలు తెరుస్తుంది.

• ఈదర రవికిరణ్

గీతాసారం

చరిత్రలో ఇద్దరు జ్ఞానులు పరస్పరం సంభాషించిన సందర్భాలు చాలా తక్కువ. జనక మహారాజు, అష్టావక్ర మహర్షి మధ్య జరిగిన అలాంటి సంభాషణను 'అష్టావక్ర గీత' అని పిలుస్తారు. ఇది 'సాధకులకు ఉపయోగపడే అత్యుత్తమమైన సంభాషణ' అని పెద్దలు పేర్కొన్నారు. ఒకసారి ఒక గురువు తన శిష్యుణ్ణి చివరి పాఠం కోసం జనక మహారాజు దగ్గరకు పంపాడు. అతను కట్టుకున్న గోచీ, భిక్షాపాత్రతో జనకుడి వద్దకు వచ్చాడు. 'విలాసాల మధ్య ఉన్న రాజు దగ్గరకు తనను ఎందుకు పంపించాడా?' అని ఆ శిష్యుడు ఆశ్చర్యపోయాడు.

ఆసక్తి, విరక్తి

ఒక రోజు ఉదయం జనకుడు అతణ్ణి స్నానానికి దగ్గరలోని నది దగ్గరకు తీసుకువెళ్ళాడు. స్నానం చేస్తూ ఉండగా... రాజభవనం కాలిపోయిందనే వార్త వచ్చింది. శిష్యుడు తన గోచీ గురించి ఆందోళన చెందుతున్నాడు. కానీ జనకుడు రాజ భవనం గురించి ఏమాత్రం కలవరపడలేదు. సాధారణమైన గోచీతో కూడా అనుబంధం అనేది అనుబంధమేననీ, దాన్ని వదిలేయాల్సిన అవసరం ఉన్నదనీ ఆ క్షణంలో శిష్యుడు గ్రహించాడు.

అనాసక్తంగా... కర్తవ్య కర్మలను ఆచరించే మనిషి అత్యున్నత స్థాయికి చేరుకుంటాడని శ్రీకృష్ణుడు మనకు హామీ ఇస్తున్నాడు. అనాసక్తుడిగా... ఆసక్తి, విరక్తి... ఈ రెండిటినీ వదిలేసిన వాడు... కర్మద్వారా మాత్రమే పరిపూర్ణత పొందినవాడు అయిన జనక మహారాజు ఉదాహరణను ఇచ్చాడు. విలాసాలలో నివసించేవాడు, అనేక బాధ్యతలను కలిగి ఉన్నవాడు అయిన మహారాజు కూడా... అనాసక్తుడై చర్యలను చేయడం ద్వారా సర్వోన్నతమైన స్థితిని పొందగలడనే విషయాన్ని శ్రీకృష్ణుడు నొక్కి చెప్పాడు. పరిస్థితులతో సంబంధం లేకుండా మనం కూడా అదే విధంగా ఉన్నత స్థితికి చేరుకోగలమని ఇది సూచిస్తుంది.



అనాసక్తితో కర్మలు చేయడం అనేది భగవద్గీతలోని ప్రధాన బోధన. ఇది ఆసక్తి, విరక్తుల ప్రత్యేక సంగమం. ఒక వ్యక్తి పూర్తిగా బాధ్యత వహించి, తన వంతు సర్వోత్కృష్టమైన కృషి చేయాలి. బాధ్యతలను నిర్వహించడానికి చేసే పని తాలూకు ఫలితం ప్రయత్నాలను బట్టి ఉండవచ్చు లేదా దానికి పూర్తి విరుద్ధంగా ఉండవచ్చు. ఎలాంటి సందర్భంలోనైనా అనాసక్తుడైన వ్యక్తి ఆందోళన చెందడు, కలవరపడడు. అదే సమయంలో అతని చర్యల ఫలితం అతణ్ణి ప్రభావితం చేయడం లేదు కాబట్టి, అంతర్గతమైన కలవరం ఉండదు. ఆధునిక యుగంలో వృత్తి-జీవితం మధ్య సమతుల్యతను కాపాడుకోవడానికి ఇది కీలకమైన మార్గం.


కె. శివప్రసాద్

సద్బోధ

మనసు నిర్మలం కావాలంటే...


భారత దేశం నుంచి బౌద్ధ మతాన్ని చైనాలోకి తీసుకువెళ్ళిన ప్రముఖ బౌద్ధ గురువు బోధిధర్మ. ఆ కాలంలో 'వు' అనే వ్యక్తి చైనా చక్రవర్తిగా ఉండేవాడు. అతను బోధిధర్మ బోధల పట్ల చాలా ఆకర్షితుడయ్యాడు. ఒక రోజు అతను బోధిధర్మతో "నా మనసు ప్రశాంతంగా, నిర్మలంగా ఉండడానికి దయచేసి ఏదైనా చేయండి" అని కోరాడు. తప్పకుండా చేస్తాను. "రేపు తెల్లవారుజామున రండి. వస్తూ వస్తూ మీ మనసును తీసుకురండి. రాజమందిరంలో మరచిపోయి రాకండి" అన్నాడు బోధిధర్మ. 'ఇదేమిటి? మనసును మరచిపోయి రావద్దంటున్నాడేమిటి? ఈయనకేమైనా పిచ్చి పట్టిందా?' అనుకున్నాడు. కానీ బోధిధర్మతో "సరే! వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

రాజమందిరానికి వచ్చిన తరువాత... 'బోధిధర్మ దగ్గరకు రేపు వెళ్ళాలా? వద్దా?' అని చక్రవర్తి చాలాసేపు ఆలోచించాడు. బోధిధర్మ మాటలే అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. 'ఆ పిచ్చివాడు ఏం చేస్తాడో? వెళ్ళకపోవడమే మంచిది' అనిపిస్తోంది. మరోవైపు 'బోధిధర్మ సామాన్యమైన గురువు కాదు. వెళ్ళినట్టయితే ఏదో శ్రేయస్సు కలుగుతుంది' అనిపించింది. బోధిధర్మ ముఖవర్చస్సు, కళ్ళలో వెలుగు, బుద్ధికుశలత చక్రవర్తికి గుర్తుకువచ్చాయి. తెల్లవారకముందే బయలుదేరి బోధిధర్మ దగ్గరకు వెళ్ళాడు. అతని రాకకోసం ఎదురుచూస్తున్నట్టు తన కుటీరం ముందే బోధిధర్మ కూర్చొని ఉన్నాడు. ..రండి మహారాజా! రండి. నా ముందు కూర్చోండి. కళ్ళు మూసుకోండి. మీ చంచలమైన మనసు ఎక్కడుందో బాగా వెతికి నాకు చెప్పండి. దాని కథ నేను చూసుకుంటాను" అంటూ తన చేతిలో ఉన్న కర్రను (దండాన్ని) చక్రవర్తి కళ్ళముందు ఊపాడు. "కళ్ళు మూసుకోండి" అన్నాడు.

చక్రవర్తి మరో మాట చెప్పలేక కళ్ళు మూసుకొని, తన మనసు తనలో ఎక్కడుందో వెతకడం ప్రారంభించాడు. క్షణాలు గడిచేకొద్దీ... నిశ్శబ్దమైన, ప్రశాంతమైన ఆ వాతావరణంలో... చక్రవర్తి ప్రశాంతత క్రమంగా వృద్ధి చెంది, స్థిరపడింది. అతనికి కళ్ళు తెరవాలనిపించలేదు. అలాగే ఉండిపోవాలనిపించింది. అలా రెండుగంటలు గడిచాయి. సూర్యోదయం అయింది. సూర్యకిరణాలు వారిపై పడుతున్నాయి.

"ఇక చాలు! కళ్ళు తెరవండి" అన్నాడు బోధిధర్మ. చక్రవర్తి మెల్లగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఉన్న బోధిధర్మ పాదాలపై తల ఉంచాడు. ప్రశాంతవదనంతో లేచి నిలబడి, చేతులు జోడించి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించాడు. ఆ తరువాత ఏమీ మాట్లాడకుండా... నడుస్తూ తన భవనం వైపు వెళ్ళిపోయాడు. సద్గురువులపట్ల నమ్మకం, జ్ఞానం పొందాలనే కోరిక, అంతరంగంలోకి వెళ్ళడానికి దోహదడే ప్రశాంతతలతో మనసు నిర్మలం కాగలదనే సూచన ఓషో చెప్పిన ఈ కథలో ఉంది. మహనీయుల సామీప్యంలో మాటలతో చెప్పలేని ప్రశాంతత లభిస్తుందని, సందేహాలు తీరుతాయనీ రమణ మహర్షిని దర్శించిన ఎందరో ప్రముఖులు పేర్కొన్నారు.

సద్గురువులపట్ల నమ్మకం, జ్ఞానం పొందాలనే కోరిక, అంతరంగంలోకి వెళ్ళడానికి దోహదడే ప్రశాంతతలతో మనసు నిర్మలం కాగలదనే సూచన ఓషో చెప్పిన ఈ కథలో ఉంది. మహనీయుల సామీప్యంలో మాటలతో చెప్పలేని ప్రశాంతత లభిస్తుందని, సందేహాలు తీరుతాయనీ రమణ మహర్షిని దర్శించిన ఎందరో ప్రముఖులు పేర్కొన్నారు.



• రాచమడుగు శ్రీనివాసులు

సహజయోగ

దేశ విముక్తి నుంచి ఆత్మ స్వాతంత్ర్యం వైపు...

"మానవులు అంతర్గత శాంతి పొందనంతవరకూ ప్రపంచ శాంతి పొందడం సాధ్యం కాదు. అంతర్గత శాంతిని పొందడానికి ఆత్మసాక్షాత్కారం ఒక్కటే మార్గం" అని చాటి చెప్పిన ఆధ్యాత్మిక గురువు శ్రీమాతాజీ నిర్మలాదేవి. శారీరక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక సమస్యలకు పరిష్కారంగా సహజ యోగాన్ని మానవాళికి అందించారు. నేడు ఆమె జయంతి.

ఏది ఆదర్శమో బోధించడమే కాదు, ఆదర్శంగా ఎలా ఉండాలో ఆచరించి చూపిన శ్రీమాతాజీ నిర్మలా దేవి... మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో... 1923లో... మార్చి 21న జన్మించారు. చిరునవ్వులొలుకుతూ, ప్రకాశవంతంగా ఉన్న ఆ శిశువును చూసిన ఆమె అమ్మమ్మ తను 'నిష్కళంక' (ఏ మచ్చా లేనిది) అని సంబరపడ్డారు. నిర్మలా దేవి తండ్రి ప్రసాదరావ్ సాల్వే అప్పట్లో నాగపూర్‌లో ప్రసిద్ధి చెందిన క్రిమినల్ లాయర్. పద్నాలుగు భాషల్లో పండితుడు. దివ్య 'ఖుర్ఆన్' గ్రంథాన్ని మరాఠీ భాషలోకి అనువదించారు. భారత రాజ్యాంగ కమిటీలో సభ్యుడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక.. మొదటి పార్లమెంట్‌లో సభ్యునిగా ఉన్నారు. ఆమె తల్లి కార్నెలియా సాల్వే మన దేశంలో గణిత శాస్త్రం ఆనర్స్‌లో పట్టభద్రురాలైన తొలి మహిళ. స్వాతంత్ర్య ఉద్యమం కోసం ఆస్తులన్నిటినీ త్యాగం చేసిన ఆ కుటుంబం పూరి గుడిసెలో నివసించాల్సి వచ్చినా, పోరాట మార్గాన్ని విడిచిపెట్టలేదు. ఉద్యమం సందర్భంగా తల్లిదండ్రులు జైలుకు వెళ్ళడంతో... చిన్న వయసులోనే ఇంటి బాధ్యతలను నిర్మలాదేవి తీసుకున్నారు. ఆమె కూడా బాల్యం నించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీతో సన్నిహితంగా మెలిగారు. లాహోర్ మెడికల్ కాలేజీలో చదువుతున్నప్పుడు... క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఆ కాలేజీపై భారత జెండాను నిర్మలాదేవి ఎగురవేశారు. దానితో ఆమెను కాలేజీ నుంచి బహిష్కరించారు. ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించి అరెస్టయ్యారు.

జైలులో విద్యుత్ షాక్ ఇచ్చినా, మంచు గడ్డల మీద పడుకోబెట్టినా ఉద్యమ పంథాను నిర్మలాదేవి విడిచిపెట్టలేదు. గ్రామగ్రామానికీ తిరిగి రహస్యంగా కరపత్రాలను పంచిపెట్టి... ప్రజలను చైతన్యపరిచారు. 'మా తెరి జయహో' అనే దేశభక్తి గీతాన్ని కూడా రాశారు.

భగవంతుడంటే...

వివాహమై, గృహిణిగా బాధ్యతలు నెరవేర్చిన తరువాత... 1970లో 'సహజయోగం' అనే ఆధ్యాత్మిక ఉద్యమాన్ని నిర్మలాదేవి ప్రారంభించారు. ఈసారి మానవుల ఆత్మ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. "భగవంతుడంటే మన లోపల ఉన్న ఆత్మే" అని స్పష్టం చేసిన ఆమె... మానవులలో నిద్రాణంగా ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేయడం ద్వారా ఆత్మసాక్షాత్కారం చాలా సులభతరమని నిరూపించారు. ప్రపంచ వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో కూడా సహజ యోగ సందేశాన్ని వినిపించడం కోసం అలుపెరగకుండా ప్రయాణించారు. అనేకమంది సత్యాన్వేషకులను కలిశారు. లక్షల మందికి స్వస్థత చేకూర్చడంతో పాటు వారిలో ఆధ్యాత్మిక వికాసాన్ని కలిగించారు. నలభై ఏళ్ళ కాలంలో వందకు పైగా దేశాల్లో పర్యటించిన ఆమె... ఒక్క 1990లోనే... 26 దేశాల్లో 200కు పైగా బహిరంగ కార్యక్రమాల్లో ఉపన్యసించడం విశేషం. మానవాళిపట్ల తనకున్న కరుణను వ్యక్తపరచడం కోసం అనేక ధార్మిక కార్యక్రమాలను నిర్మలాదేవి చేపట్టారు. ముంబాయి, గ్రేటర్ నోయిడాల్లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సహజయోగ పరిశోధన, ఆరోగ్య కేంద్రాలు, సంగీతం, కళల అభివృద్ధి కోసం ముంబాయిలో ప్రారంభించిన 'శ్రీ పి.కె.సాల్వే కళాప్రతిష్ఠాన్', నిరాశ్రయులైన మహిళలు పిల్లల కోసం నోయిడాలో స్థాపించిన 'విశ్వనిర్మల ప్రేమ ఆశ్రమం', హిమాచల్ ప్రదేశ్‌లోని అంతర్జాతీయ పబ్లిక్ స్కూల్ వీటిలో కొన్ని.



'మానవరత్నం'

తను చేసిన విశిష్టమైన సేవలకు గుర్తింపుగా వివిధ దేశాల అధ్యక్షుల నుంచి, ప్రముఖుల నుంచి అనేక ప్రశంసా పత్రాలను ఆమె అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 500కు పైగా పురస్కారాలు స్వీకరించారు. మహారాష్ట్ర ప్రభుత్వం 'మానవ రత్న' పురస్కారంతో, యుఎన్‌ఓ 'యూనిటీ ఇంటర్నేషనల్ పీస్' అవార్డుతో సత్కరించాయి. రష్యాలో 'ప్రిసీడియం ఆఫ్ పెట్రోవ్ స్కా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌అండ్ సైన్సెస్' లో గౌరవ సభ్యత్వం అందుకున్నారు. ప్రసిద్ధ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్‌తో పాటు ప్రపంచంలో కేవలం 12 మంది ప్రముఖులకు మాత్రమే ఈ గౌరవం లభించింది. అమెరికాలోని అనేక రాష్ట్రాల్లో ఆమె జన్మదినమైన మార్చి 21ని 'శ్రీమాతాజీ నిర్మలాదేవి డే'గా ప్రకటించారు. ఆమె శతజయంతి సందర్భంగా... ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం వంద రూపాయల నాణేన్ని విడుదల చేసింది. నిర్మలాదేవి నేడు భౌతికంగా మన మధ్య లేకపోయినా... ప్రపంచంలో ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వాలు నెలకొనడానికి ఆమె చేసిన ప్రయత్నాలు... సహజయోగ మార్గంలో నడిచే ప్రతి ఒక్కరి హృదయాలను నిత్యం స్పృశిస్తూనే ఉంటాయి. నిర్మలాదేవి అడుగుజాడలు మహోన్నతమైన ఆమె ఆదర్శాలను గుర్తు చేస్తూనే ఉంటాయి.


డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్, తెలంగాణ

బౌలర్లకు ఊరట

ఐపీఎల్ రేపటి నుంచే



బంతికి ఉమ్మిపై నిషేధం ఎత్తివేత

రెండో కొత్త బాల్‌కు అవకాశం

ఐపీఎల్‌లో నయా రూల్స్

ముంబై: ధనాధన్ బ్యాటింగ్‌కు మారుపేరుగా నిలిచే ఐపీఎల్‌లో ఇక బౌలర్లు కూడా తడాఖా చూపనున్నారు. శనివారం ఆరంభం కానున్న ఈ లీగ్‌లో బంతికి ఉమ్మి (సలైవా) రాయడంపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. ఈ నిర్ణయం ఫాస్ట్ బౌలర్లకు అద్భుతంగా మేలు చేకూర్చుతుంది. గురువారం బీసీసీఐ కార్యాలయంలో ఫ్రాంచైజీల కెప్టెన్ల సమావేశం జరిగింది. దీంట్లో భాగంగా బంతి మెరుపు కోసం ఉమ్మి రాయడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసేందుకు మెజార్టీ కెప్టెన్లు సుముఖత వ్యక్తం చేయడంతో బోర్డు ముందడుగు వేసింది. బంతి పాతబడ్డాక ఉమ్మితో దాన్ని మెరిసేలా చేసి బౌలర్లు రివర్స్ స్వింగ్‌ను రాబట్టడం పరిపాటి. కానీ కొవిడ్ సమయంలో ఆటగాళ్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బంతికి ఇలా ఉమ్మి పూయడాన్ని ఐసీసీ నిషేధించింది. ఆ తర్వాత ఐపీఎల్‌లోనూ అదే నిర్ణయాన్ని అమలు చేశారు. ఇన్నాళ్లూ బౌలర్లు చెమటను మాత్రం ఉపయోగిస్తూ వచ్చారు. కానీ దాంతో బంతి బరువు పెరుగుతుందని, స్వింగ్ రాబట్టడం కష్టమనే అభిప్రాయం ఉంది. అయితే కొవిడ్ ప్రభావం తగ్గడంతో సలైవాపై ఉన్న నిషేధాన్ని తొలగించాలన్న డిమాండ్ ఎక్కువైంది. ఇటీవల భారత పేసర్ మహ్మద్ షమి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. మరోవైపు బోర్డు నిర్ణయాన్ని గుజరాత్ టైటాన్స్ పేసర్ మహ్మద్ సిరాజ్ స్వాగతించాడు. 'బౌలర్లు ఇది శుభవార్తే. బంతి ఎలాంటి ప్రభావం చూపని స్థితిలో ఉమ్మితో రివర్స్ స్వింగ్‌ను రాబట్టి బ్యాటర్లను కట్టడి చేయవచ్చు' అని సిరాజ్ తెలిపాడు.

11వ ఓవర్‌నుంచి మరో బంతి..

రాత్రి జరిగే మ్యాచ్‌ల్లో కొన్నిసార్లు మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈకారణంగా బంతి తడిగా మారి బౌలర్లకు పట్టు లభించదు కాబట్టి.. సెకండ్ బ్యాటింగ్ జట్టు భారీగా పరుగులు సాధించే చాన్సుంటుంది. దీన్ని ఎదుర్కొనేందుకు రెండో ఇన్నింగ్స్‌లో 11వ ఓవర్ నుంచి మరో బంతిని తీసుకునేందుకు బీసీసీఐ అవకాశం కల్పించనుంది. అయితే ఇది రూల్ మాత్రం కాదని, కొత్త బంతిని కెప్టెన్లు కోరినప్పటికీ మంచు అధికంగా ఉందా? లేదా? అని పరిశీలించి ఫీల్డ్ అంపైర్లే తుది నిర్ణయం తీసుకుంటారని బోర్డు స్పష్టం చేసింది. ఒకవేళ అంపైర్లు బంతిని మార్చాలనుకున్నా కొత్త బంతిని మాత్రం ఇవ్వరు. ఏ బంతిని మార్చుతున్నారో.. దాదాపు అలాంటి మరో బాల్‌తో మ్యాచ్‌ను కొనసాగిస్తారు. మధ్యాహ్నం మ్యాచ్‌కు ఈ రూల్ వర్తించదు.

హాక్ఐ ద్వారా వైడ్ బాల్

కెప్టెన్ల సమావేశంలో మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. ఇక నుంచి వైడ్ బాల్‌ను సరిగ్గా అంచనా వేసేందుకు హాక్ఐ, బాల్ ట్రాకింగ్ సహకారం కూడా తీసుకోనున్నారు. ఎక్కువ ఎత్తు వైడ్స్‌తో పాటు ఆఫ్ స్టంప్ ఆవలగా వెళ్లే వైడ్స్‌పై నిర్ణయం తీసుకునేందుకు వీటిని ఉపయోగించనున్నారు.

రాజస్థాన్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్

సంజూ శాంసన్ స్థానంలో తొలి మూడు మ్యాచ్‌లకు రియాన్ పరాగ్ సారథ్యం వహిస్తాడని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ పూర్తి ఫిట్‌నెస్‌తో లేకపోవడంతో తొలి మూడు మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఇంపాక్ట్ ప్లేయర్ కెప్టెన్‌గా ఉండేందుకు వీల్లేదు కాబట్టి పరాగ్ నేతృత్వంలో ఆ మ్యాచ్‌లను ఆడతాడు.

మళ్లీ దబిడి దిబిడే!



ఫుల్ జోష్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్

వరుసగా మూడు సీజన్లలో పేలవ ప్రదర్శనతో చివరి స్థానాలకే పరిమితమవుతూ వస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. 2024 సీజన్‌లో ఒక్కసారిగా దుమ్మురేపింది. దూకుడైన ఆటకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే హైదరాబాద్.. లీగ్ చరిత్రలోనే అత్యధికంగా 287/3 స్కోరు సాధించింది. అలవోకగా భారీ స్కోర్లు సాధిస్తూ ఫైనల్‌కు చేరింది. కానీ, తుది పోరులో మాత్రం కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. అయితే, సన్‌రైజర్స్ విధ్వంసకర బ్యాటింగ్ మాత్రం అభిమానులను ఉర్రూతలూగించింది. 2016లో టైటిల్ సాధించిన హైదరాబాద్.. 2018 ఫైనల్లో ఓడి రెండో స్థానంతో సరిపెట్టుకొంది. అయితే, వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను సన్‌రైజర్స్ భారీ ధరకు కొనుగోలు చేసి అతడికే జట్టు పగ్గాలు అప్పజెప్పింది. జట్టు మళ్లీ పుంజుకోవడానికి ఈ సాహసోపేత నిర్ణయం ఓ రకంగా దోహదం చేసింది. మూడు సీజన్లలో అట్టర్‌ఫ్లాపైన హైదరాబాద్.. 2024 లీగ్‌లో తమ బ్యాటింగ్ విన్యాసాలతో ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యంగా ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ ప్రత్యర్థి బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. క్లాసెన్ కూడా బౌలర్లను వదిలిపెట్టలేదు. దీంతో వేలానికి ముందే కమిన్స్, హెడ్, అభిషేక్, నితీశ్ కుమార్‌లను రిటైన్ చేసుకొని కోర్ టీమ్‌ను సిద్ధం చేసుకొంది. ఈసారి ఇషాన్ కిషన్‌ను కూడా తీసుకున్నారు. ఇక, ఆల్‌రౌండర్‌గా నితీశ్ కుమార్ అంతర్జాతీయ క్రికెట్ అనుభవం లాభించనుంది. కమిన్స్‌తోపాటు పవర్‌ప్లేలో వికెట్లు పడగొట్టగలిగే అనుభవం ఉన్న షమిని వేలంలో కొనుగోలు చేయడంతో పేస్ విభాగం కూడా మెరుగ్గానే ఉంది. ఆడమ్ జంపా, రాహుల్ చాహర్‌లు స్పిన్ విభాగాన్ని నడిపించనున్నారు. గాయం నుంచి కోలుకొన్న కమిన్స్ నేరుగా ఐపీఎల్ ఆడుతుండగా.. షమి ఫిట్‌నెస్ కొంత ఆందోళన కలిగిస్తోంది.

జట్టు **బ్యాటర్లు:** ట్రావిస్ హెడ్, అథర్వ తైడే, అభినవ్ మనోహర్, అనికేత్ వర్మ, సచిన్ బేబీ; **వికెట్ కీపర్లు:** క్లాసెన్, ఇషాన్ కిషన్; **ఆల్‌రౌండర్లు:** అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్, హర్షల్ పటేల్, కమిందు మెండిస్, వియాన్ ముల్డర్; **బౌలర్లు:** కమిన్స్ (కెప్టెన్), షమి, రాహుల్ చాహర్, జంపా, సిమ్రన్‌జీత్, జీషన్ అన్సారీ, ఉనాద్కట్, ఇషాన్ మలింగ.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

బాసెల్: గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 21-12, 21-8తో సెలిన్/అమీలీ (జర్మనీ) జంటని చిత్తు చేసింది. అయితే శ్రీకాంత్ 15-21, 11-21తో లీ షీఫెంగ్ (చైనా) చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. అలాగే ప్రియాన్షు రజావత్ 10-21, 11-21తో పోపోవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్ రౌండ్-16లో అనుపమా ఉపాధ్యాయ 17-21, 19-21తో పీకే వర్దని (ఇండోనేసియా) చేతిలో, ఇషారాణి బారువా 19-21, 21-18, 18-21తో హున్ (మలేసియా) చేతిలో పరాజయం చవిచూశారు.

ఐవోసీ బాస్‌గా కోవెంట్రీ

తొలి మహిళగా చరిత్ర



కోస్టా నవరినో (గ్రీస్): అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) అధ్యక్షపదవిని చేపట్టనున్న తొలి మహిళగా ఒలింపిక్ మాజీ స్విమ్మర్ క్రిస్టీ కోవెంట్రీ (జింబాబ్వే) చరిత్ర సృష్టించింది. 131 ఏళ్ల చరిత్ర కలిగిన ఐవోసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న తొలి మహిళగా, ఆఫ్రికా జాతీయురాలిగా కూడా కోవెంట్రీ రికార్డులకెక్కింది. గురువారం జరిగిన ఎన్నికల్లో వరల్డ్ అథ్లెటిక్స్ చీఫ్ సెబాస్టియన్ కో, మాజీ అధ్యక్షుడి కుమారుడు జువాన్ ఆంటోనియో సమరాంచ్ జూనియర్ సహా ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే, వీరిద్దరినీ ఓడించిన కోవెంట్రీ జెయింట్ కిల్లర్‌గా నిలిచింది. ఐవోసీ సభ్యత్వం కలిగిన 97 మంది ఓటింగ్‌లో పాల్గొనగా.. తొలి రౌండ్‌లోనే గెలుపునకు కావాల్సిన 49 ఓట్లు కోవెంట్రీకి లభించాయి. సమరాంచ్‌కు 28, సెబాస్టియన్‌కు 8 ఓట్లు పోలయ్యాయి.

టీమిండియాకు రూ. 58 కోట్లు

చాంపియన్స్ ట్రోఫీ గెలిచినందుకు బీసీసీఐ రివార్డు

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. టోర్నీ ఆసాంతం దుమ్ము రేపిన జట్టుకు రూ. 58 కోట్లు ఇవ్వనున్నట్టు తెలిపింది. ఆటగాళ్లు, శిక్షణ, సహాయ సిబ్బంది, జాతీయ సెలెక్షన్ కమిటీ సభ్యులకు ఈ నగదు అందజేయనున్నట్టు పేర్కొంది. ఈ రివార్డులో 15 మంది జట్టు ఆటగాళ్లు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌లకు రూ. మూడు కోట్ల చొప్పున లభిస్తాయి. మిగిలిన మొత్తంలో ఇతర సహాయ సిబ్బంది, సెలెక్షన్ కమిటీ సభ్యులు రూ. 50 లక్షల చొప్పున అందుకుంటారు.

చాహల్-ధనశ్రీకి విడాకులు



ముంబై: భారత వెటరన్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మకు ఇక్కడి బాంద్రా ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుంటున్నందున ఆరు నెలల కూలింగ్ పీరియడ్‌ను బాంబే హైకోర్టు రద్దుచేసిందని చాహల్ తరఫు న్యాయవాది నితీష్‌కుమార్ గుప్తా చెప్పారు. ఈనెల 20లోగా విడాకుల పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు.. ఫ్యామిలీ కోర్టును ఆదేశించిందన్నారు. కాగా రూ.4.75 కోట్ల భరణంలో భాగంగా చాహల్ ఇప్పటికే ధనశ్రీకి రూ.2.37 కోట్లు చెల్లించాడు. కోర్టు డిక్రీ అందిన అనంతరం మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తామని న్యాయవాది తెలిపారు. విడాకుల కోసం గురువారం చాహల్-ధనశ్రీ కోర్టుకు వచ్చారు.

టీ-షర్టే చెప్పేసిందా?

కోర్టుకు వచ్చినప్పుడు చాహల్ ధరించిన టీ-షర్ట్‌పై 'బీ యువర్ ఓన్ షుగర్ డాడీ' అని ఉండడం అందరి దృష్టినీ ఆకర్షించింది. 'ఎవరో ఇచ్చే డబ్బు, బహుమతులపై ఆశపడకుండా.. నీకాళ్లపై నువ్వు నిలబడు. నీ బాగోగులు నువ్వే చూసుకో' అని దీని అర్థం. ఒకరకంగా ధనశ్రీ మనస్తత్వాన్ని ఉద్దేశించి చాహల్ ఈ విధంగా రాసిన షర్ట్‌ను వేసుకొన్నాడని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

ఢిల్లీ దశ తిరిగేనా?



రాహుల్, అక్షర్‌పై ఆశలు

మెగా లీగ్‌లో తొలి టైటిల్ కోసం 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న జట్టు ఢిల్లీ క్యాపిటల్స్. 18వ సీజన్‌లో సరికొత్త లుక్‌తో బరిలోకి దిగుతున్న ఢిల్లీ.. ఈసారైనా కలల కప్‌ను ముద్దాడాలనుకొంటోంది. ఆ జట్టు 2020లో ఫైనల్ చేరుకున్నా..ముంబై చేతిలో ఓడి రన్నరప్‌గా సరిపెట్టుకొంది. రిషభ్ పంత్‌ను వదులుకోవాలన్న షాకింగ్ నిర్ణయం తీసుకొన్న యాజమాన్యం.. వేలంలో ఆచితూచి వ్యవహరించింది. కేఎల్ రాహుల్, డుప్లెసి, స్టార్క్‌లను కొనుగోలు చేసినా.. అనూహ్యంగా అక్షర్ పటేల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. వైస్ కెప్టెన్‌గా డుప్లెసి వ్యవహరిస్తాడు. స్టబ్స్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, రాహుల్, డుప్లెసి, కరుణ్ నాయర్‌తో బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగానే కనిపిస్తోంది. స్టార్క్‌తోపాటు నటరాజన్, ముకేశ్ కుమార్, మోహిత్ శర్మను కొనుగోలు చేసి బౌలింగ్‌ను బలోపేతం చేసింది. అక్షర్, కుల్దీప్ యాదవ్ ప్రధాన స్పిన్నర్లు. పాంటింగ్ స్థానంలో హెడ్ కోచ్‌గా హేమంగ్ బదానీని తీసుకొన్న మేనేజ్‌మెంట్.. కెవిన్ పీటర్సన్‌ను మెంటార్‌గా నియమించుకొంది. ఓవరాల్‌గా జట్టు సమతుల్యంగా కనిపిస్తున్నా.. కెప్టెన్‌గా అనుభవంలేని అక్షర్ జట్టును ఎలా నడిపిస్తాడో చూడాలి.

జట్టు **బ్యాటర్లు:** ఫా డుప్లెసి, కరుణ్ నాయర్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్; **వికెట్ కీపర్లు:** రాహుల్, ట్రిస్టన్ స్టబ్స్, అభిషేక్ పోరెల్, డోనోవాన్ ఫెరీరా; **ఆల్‌రౌండర్లు:** అక్షర్ పటేల్ (కెప్టెన్), సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, దర్శన్ నల్కండే, విప్‌రాజ్ నిగమ్, అజయ్ మండల్, మన్వంత్ కుమార్, త్రిపురాన విజయ్, మాధవ్ తివారీ; **బౌలర్లు:** మిచెల్ స్టార్క్, నటరాజన్, ముకేశ్ కుమార్, మోహిత్ శర్మ, దుష్మంత చమీర, కుల్దీప్ యాదవ్.

బిజినెస్

టెక్ నైపుణ్యాలకు అడ్డా భారత్

టెక్ ప్రభావం లేని పరిశ్రమ లేదు.. ఎవరికైనా మనమే కీలక భాగస్వాములం

- ప్రపంచ సాఫ్ట్‌వేర్ నిపుణుల్లో 23 శాతం మనోళ్లే
- నాస్కామ్ చీఫ్ రాజేశ్ నంబియార్



న్యూఢిల్లీ: అత్యున్నత టెక్ నైపుణ్యాలకు భారత్ ప్రధాన కేంద్రం (హబ్)గా ఎదిగిందని ఐటీ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నాస్కామ్ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాజేశ్ నంబియార్ అన్నారు. ఈ కారణంగానే టెక్నాలజీ రంగంలో మన దేశం అనేక ప్రముఖ ప్రపంచ కంపెనీలకు ప్రాధాన్యతా భాగస్వామిగా ఎదిగిందన్నారు. నాస్కామ్ నిర్వహిస్తున్న 'గ్లోబల్ కన్‌ఫ్లూయెన్స్- 2025 సదస్సులో ఆయన ఈ విషయాలు తెలిపారు. ప్రస్తుత ప్రపంచ సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) నిపుణుల్లో 28 శాతం, సాఫ్ట్‌వేర్ నిపుణుల్లో 23 శాతం మన దేశంలోనే ఉన్న విషయాన్ని నంబియార్ గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేనంత బలంగా, టెక్నాలజీ ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను మార్చివేస్తోందన్నారు. సాంకేతిక మార్పుల ప్రభావం లేని పరిశ్రమగానీ, దేశంగానీ ప్రస్తుతం లేవన్నారు. ఈ మార్పులతో ఏర్పడే సవాళ్లు, అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అత్యున్నత నైపుణ్యాలు ఉన్న ఉద్యోగుల డిమాండ్ రోజురోజుకీ పెరుగుతోందని నంబియార్ తెలిపారు.

రూ.24 లక్షల కోట్ల టర్నోవర్

గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 25,400 కోట్ల డాలర్ల టర్నోవర్ నమోదు చేసిన భారత ఐటీ పరిశ్రమ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దాదాపు 28,300 కోట్ల డాలర్ల (సుమారు రూ.24.43 లక్షల కోట్లు) టర్నోవర్ నమోదు చేసే అవకాశం ఉందని నంబియార్ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా ఇది 30,000 కోట్ల డాలర్లు మించిపోతుందన్నారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ కూడా మన దేశంలో శరవేగంతో అభివృద్ధి చెందుతున్న విషయాన్ని గుర్తు చేశారు. 2030 నాటికి మన జీడీపీలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వాటా లక్ష కోట్ల డాలర్లు (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.86.36 లక్షల కోట్లు) మించిపోనుందని నాస్కామ్ చీఫ్ తెలిపారు.

ప్రస్తుతం దాదాపు 58 లక్షల ఉద్యోగులున్న ఐటీ రంగంలో కొత్త ఉద్యోగాల కల్పన ముందు ముందూ కొనసాగుతుందన్నారు. దేశంలో పెరుగుతున్న స్టార్టప్‌లు, జీసీసీలు ఇందుకు మరింత దోహదం చేస్తాయన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్‌లోనూ మన దేశానికి మంచి భవిష్యత్ ఉందన్నారు.

బెయిన్ క్యాపిటల్‌కు మణప్పురంలో 18% వాటా

డీల్ విలువ రూ.4,385 కోట్లు

MANAPPURAM FINANCE LIMITED

BainCapital

న్యూఢిల్లీ: బంగారం తాకట్టుపై రుణాలిచ్చే మణప్పురం ఫైనాన్స్‌లో 18 శాతం వాటాను రూ.4,385 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ గురువారం వెల్లడించింది. ఈ డీల్ ద్వారా బెయిన్ క్యాపిటల్.. మణప్పురం ఫైనాన్స్ ప్రమోటర్లలో ఒకటిగా మారడంతో పాటు ఉమ్మడి నియంత్రణ హక్కులు సైతం దక్కించుకోనుంది. ఈక్విటీ, వారంట్ల ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా ఈ లావాదేవీ జరగనుంది. ఇందులో భాగంగా మణప్పురం ఫైనాన్స్‌లో 18 శాతం వాటాకు సమానమైన ఈక్విటీ షేర్లను ఒక్కొక్కటీ రూ.236 చొప్పున కొనుగోలు చేయనుంది. సంస్థ షేరు 6 నెలల సగటు ట్రేడింగ్ ధరతో పోలిస్తే 30 శాతం అధికమిది. ఈ ఒప్పందం అనంతరం మణప్పురం వ్యవస్థాపక ప్రమోటర్ వీపీ నందకుమార్, ఆయన కుటుంబం కంపెనీలో 28.9 శాతం వాటా కలిగి ఉండనుంది.

మరో 26 శాతం వాటా కోసం ఓపెన్ ఆఫర్: ఈ డీల్‌తో సెబీ నిబంధనల ప్రకారం మరో 26 శాతం వాటా షేర్ల కొనుగోలుకు బెయిన్ క్యాపిటల్ తప్పనిసరి ఓపెన్ ఆఫర్‌ను సైతం ప్రకటించింది. ఓపెన్ ఆఫర్ ధరనూ ఒక్కో షేరుకు రూ.236గా నిర్ణయించారు. ఓపెన్ ఆఫర్ పూర్తయ్యాక మణప్పురంలో బెయిన్ క్యాపిటల్ వాటా 41.7 శాతానికి పెరిగే అవకాశం ఉంది. కేరళకు చెందిన మణప్పురం ఫైనాన్స్ 1949లో ప్రారంభమైంది. ప్రస్తుతం దేశంలోనే రెండో అతిపెద్ద గోల్డ్ లోన్ కంపెనీ ఇది. దేశవ్యాప్తంగా 5,357 శాఖలను నిర్వహిస్తోంది. వీటిల్లో 50,795 మంది పనిచేస్తున్నారు. 65.9 లక్షల మంది కస్టమర్లకు సేవలందిస్తోంది. మణప్పురం ఫైనాన్స్ తన వ్యాపారాన్ని బంగారం తాకట్టు రుణాల నుంచి సూక్ష్మ రుణాలు, వాహన రుణాలు, గృహ రుణాలు, ఎస్ఎంఈ రుణాల విభాగాల్లోకీ విస్తరించింది.



మచిలీపట్నంలో రామ్‌రాజ్ షోరూమ్

మచిలీపట్నం (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వస్త్ర తయారీ కంపెనీ రామ్‌రాజ్ కాటన్ మచిలీపట్నంలో గురువారం కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. బృందావన్ టాకీస్‌కు ఎదురుగా గొడుగుపేటలో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను రాష్ట్ర గనులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీ గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ ప్రారంభించారు. ప్రత్యేకమైన హోదా, గౌరవం చేకూర్చేలా రామ్‌రాజ్ కాటన్ వస్త్రాలు ఉంటాయని ఈ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులు అన్నారు. అలాగే, దేశంలో అత్యంత విశ్వసనీయమైన, ఆకర్షణీయమైన బ్రాండ్ జాబితాలో రామ్‌రాజ్ ధోతీలు, చొక్కాలు, ఇతర దుస్తులు ఉన్నాయని వారు పేర్కొన్నారు.

సీఐఐ ఏపీ చైర్మన్‌గా మురళీకృష్ణ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఛైర్మన్‌గా మురళీకృష్ణ గన్నమని నియమితులయ్యారు. కాగా వైస్ ఛైర్మన్‌గా ఎస్ నరేంద్ర కుమార్ ఎన్నికయ్యారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వీరు ఈ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ప్రస్తుతం మురళీకృష్ణ ఫ్లూయింట్ గ్రిడ్ సీఈఓ, ఛైర్మన్‌గా వ్యవహరిస్తుండగా నరేంద్ర కుమార్ ఎపెక్స్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఒప్పో ఎఫ్29 సిరీస్ స్మార్ట్‌ఫోన్స్

రెండు వేరియంట్లలో లభ్యం.. ప్రారంభ ధర రూ.23,999



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్మార్ట్‌ఫోన్స్ తయారీ సంస్థ ఒప్పో ఇండియా.. మార్కెట్లోకి సరికొత్త మిడ్-రేంజ్ ఫోన్లను తీసుకువచ్చింది. ఒప్పో ఎఫ్29 5జీ, ఒప్పో ఎఫ్29 ప్రో 5జీ పేరుతో ఈ స్మార్ట్‌ఫోన్స్‌ను విడుదల చేసింది. దేశంలోని అన్ని రకాలైన వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా ఈ ఫోన్ల ను ఐపీ66, ఐపీ68, ఐపీ69 ప్రమాణాలతో తీసుకువచ్చినట్లు ఒప్పో ఇండియా ప్రొడక్ట్ కమ్యూనికేషన్స్ హెడ్ సావియో డిసౌజా వెల్లడించారు. బెంగళూరులోని ఎస్‌జీఎస్ (సొసైటీ జనరల్ డి సర్వియలెన్స్)లో ఈ ఎఫ్29 సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ఐపీ ప్రమాణాలను పరీక్షించినట్లు పేర్కొన్నారు. దుమ్ము ధూళి, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవటంతో పాటు వర్షంలో తడిచినా, నీటిలో పడినా రక్షణ కల్పించేలా ఈ స్టాండర్డ్స్ ఉంటాయని ఆయన తెలిపారు. ఉత్తరప్రదేశ్, గ్రేటర్ నోయిడాలోని ప్లాంట్‌లో ఈ స్మార్ట్‌ఫోన్స్ ఉత్పత్తి చేస్తున్నట్లు డిసౌజా పేర్కొన్నారు. ఒప్పో ఎఫ్27 సిరీస్ తీసుకువచ్చిన సమయంలో అమ్మకాలు 30 శాతం మేర పెరిగాయని, ఎఫ్29 సిరీస్‌కు అదే స్థాయిలో స్పందన వస్తుందని అంచనా వేస్తున్నట్లు డిసౌజా తెలిపారు. ఈ నెల 27 నుంచి ఎఫ్29 5జీ మోడల్, ప్రో మోడల్ ఏప్రిల్ 1 నుంచి మార్కెట్లో అందుబాటులో ఉంటాయని తెలిపింది.

ఫీచర్లు: ఈ రెండు స్మార్ట్‌ఫోన్స్‌ను 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ-అమోలెడ్ స్ర్కీన్‌తో ఒప్పో తీసుకువచ్చింది. ఇందులో ఎఫ్29 ప్రో 5జీ.. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎనర్జీ చిప్ ప్రాసెసర్‌తో తీసుకురాగా ఎఫ్29 5జీని క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 6 జెనరేషన్ 1 ప్రాసెసర్‌తో తీసుకువచ్చింది. 50ఎంపీ ప్రైమరీ కెమెరా, 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఈ ఫోన్ల ప్రత్యేకతలు.

వేరియంట్స్: ఒప్పో ఎఫ్29 5జీ.. 8జీబీ రామ్+128జీబీ స్టోరేజ్ మోడల్ ధర రూ.23,999గా ఉండగా 8జీబీ+256 జీబీతో కూడిన ఫోన్ ధర రూ.25,999గా ఉంది. కాగా ఎఫ్29 ప్రో 5జీ రూ.27,999 (8జీబీ+128జీబీ), రూ.29,999 (8జీబీ+256జీబీ), రూ.31,999 (12 జీబీ+256జీబీ)ధరతో అందుబాటులో ఉండనుంది.

జీనోమ్ వ్యాలీలో సీజీటీ కేంద్రం

రూ.650 కోట్ల పెట్టుబడి
భారత్ బయోటెక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో సెల్, జీన్ థెరపీ (సీజీటీ), వైరల్ వెక్టార్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (బీబీఐఎల్) ప్రకటించింది. దీంతో సరసమైన ధరల్లో వ్యాక్సిన్ల అభివృద్ధి, తయారీ నుంచి రీజెనరేటివ్, పర్సనలైజ్డ్ థెరపీల విభాగంలోకి తమ నైపుణ్యాలను విస్తరించినట్టయిందని తెలిపింది. సుమారు రూ.650 కోట్ల (7.5 కోట్ల డాలర్లు)తో ఈ ప్లాంట్‌ను నెలకొల్పినట్లు బీబీఐఎల్ వెల్లడించింది. జీన్, సెల్ థెరపీలకు శాస్త్రీయంగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి క్యాన్సర్ రోగులకు రక్షణ కల్పించేందుకు ఇది సహాయకారి అవుతుందని పేర్కొంది. 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక సీజీటీ కేంద్రం బీబీఐఎల్ ప్రయాణంలో ఒక మైలురాయి అని భారత్ బయోటెక్ చైర్మన్ కృష్ణ ఎల్లా అన్నారు. భారత్ బయోటెక్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రేచస్ ఎల్లా ఈ కేంద్రానికి నాయకత్వం వహిస్తారు.

జియో ఫైనాన్షియల్‌తో అలియాంజ్ జట్టు?

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ఆర్థిక దిగ్గజం అలియాంజ్ గ్రూప్.. ముకేశ్ అంబానీ నాయకత్వంలోని జియో ఫైనాన్షియల్ కంపెనీతో చర్చలు జరుపుతోంది. జియో ఫైనాన్షియల్ ప్రారంభించే లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ వ్యాపారాల్లో వాటా కోసం ఈ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ రెండు వ్యాపారాల్లో కనీసం 50 శాతం వాటా అయినా కావాలని అలియాంజ్ అడుగుతోంది. అలియాంజ్ ఇటీవలే బజాజ్ ఫైనాన్స్ గ్రూప్‌తో ఉన్న ఈ రెండు వ్యాపారాల నుంచి నుంచి తప్పుకుంది. బజాజ్ గ్రూప్ నుంచి తప్పుకున్నా ఈ రంగాల్లో ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జియో ఫైనాన్స్‌తో జట్టు కట్టాలని భావిస్తోంది.

ఓలా ఎలక్ట్రిక్‌కు మరో షాక్

న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ ప్రకటించిన విక్రయ గణాంకాలు, వాస్తవ రిజిస్ట్రేషన్లలో భారీ వ్యత్యాసంతో పాటు కంపెనీపై పెరుగుతున్న ఫిర్యాదులపై దర్యాప్తు జరిపి, 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ)ను కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కోరినట్లు తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు వాహన్ పోర్టల్‌లో కేవలం 8,652 ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల రిజిస్ట్రేషన్లు నమోదు కాగా.. కంపెనీ మాత్రం ఆ నెలలో 25,000కు పైగా వాహనాలను విక్రయించినట్లు ప్రకటించింది. ఈ నెలలోనూ 20వ తేదీవరకు కంపెనీ రిజిస్ట్రేషన్లు 11,781 యూనిట్లుగా నమోదయ్యాయి. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రకటించిన ఫేమ్ రెండో విడత పథకంతో పాటు పీఎం ఈ-డ్రైవ్ స్కీమ్ లబ్ధిదారుల్లో ఓలా ఎలక్ట్రిక్ ఒకటి. భారీ పరిశ్రమల శాఖ పర్యవేక్షణ పరిధిలోని సర్టిఫికేషన్, టెస్టింగ్ ఏజెన్సీ అయిన ఏఆర్ఏఐనే ఓలా ఎలక్ట్రిక్‌కు ఈ పథకాలకు సంబంధించిన అర్హత పత్రం జారీ చేసింది. అందుకే కంపెనీపై దర్యాప్తు చేపట్టాలని కేంద్రం ఏఆర్ఏఐని నిర్దేశించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వాహనాల్లో తయారీ లోపాలు, వాహన సర్వీసింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంపై కస్టమర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఏజెన్సీ సీసీపీఏ ఇప్పటికే ఓలా ఎలక్ట్రిక్‌పై దర్యాప్తునకు ఆదేశించింది.

23,000 పైకి నిఫ్టీ

సెన్సెక్స్ మరో 899 పాయింట్లు అప్

సూచీలకు ఫెడ్ బూస్ట్

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో వరుసగా నాలుగో రోజూ బుల్ ర్యాలీ కొనసాగింది. ఈక్విటీ మదుపరుల కొనుగోళ్ల జోరుతో గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 76,000, నిఫ్టీ 23,000 స్థాయిలను మళ్లీ అధిగమించాయి. ఇంట్రాడేలో 1,000 పాయింట్లకు పైగా వృద్ధి చెందిన సెన్సెక్స్.. చివరికి 899.01 పాయింట్ల (1.19 శాతం) లాభంతో 76,348.06 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 283.05 పాయింట్ల (1.24 శాతం) వృద్ధితో 23,190.65 వద్ద ముగిసింది. అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ తాజా పరపతి సమీక్షలో ప్రామాణిక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ, ఈ ఏడాది చివరి నాటికి వడ్డీ రేట్లను మరో రెండు సార్లు తగ్గిస్తామని సంకేతాలివ్వడం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిరవధిక అమ్మకాలకు ముగింపు పలికారన్న అంచనాలు మార్కెట్ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపాయి. గడిచిన నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 2,519.15 పాయింట్లు (3.41 శాతం) బలపడగా.. స్టాక్ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17.43 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.408.62 లక్షల కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	96	విజయవాడ	105
వరంగల్	96	గుంటూరు	103
కరీంనగర్	96	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	84
కర్నూలు	96	నెల్లూరు	89
విశాఖపట్నం	99	అనంతపురం	89
గోదావరి	105		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,660 ▲	83,100 ▲	1,14,100 ▲
విజయవాడ	91,800 ▲	87,500 ▲	1,00,700 ▼
విశాఖపట్నం	89,080 ▲	81,680 ▲	99,500 ▼
రాజమండ్రి	90,650 ▲	83,100 ▲	1,02,700 ▼
ప్రొద్దుటూరు	90,300 ▲	83,620 ▲	1,00,700 ▼
ముంబై	88,506 ▼	81,072 ▼	98,392 ▼



హృదయం ఆనందంతో నిండిపోయింది

చిరంజీవి



మెగాస్టార్ చిరంజీవి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరింది. బుధవారం యూకే పార్లమెంటులోని హౌస్ ఆఫ్ కామన్స్ లో ఆయనకు ఘన సన్మానం జరిగింది. బ్రిడ్జ్ ఇండియా సంస్థ ఆయనకు జీవిత సాఫల్య పురస్కారం అందించింది. తనకు దక్కిన ఈ సత్కారానికి హృదయమంతా ఆనందంతో నిండిపోయిందని చిరు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "యూకేలో నాకు దక్కిన ఈ గౌరవం మరిచిపోలేనిది. ఈ అనుభూతిని వర్ణించడానికి మాటలు చాలట్లేదు. హృదయమంతా ఆనందంతో ఉప్పొంగిపోతోంది. నాకు సన్మానం చేసిన యూకే పార్లమెంటు సభ్యులకు, జీవిత సాఫల్య పురస్కారం అందించిన బ్రిడ్జ్ ఇండియా సంస్థకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. చిరంజీవికి ఈ పురస్కారం దక్కినందుకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు తమ్ముడిగా పుట్టినందుకు గర్వంగా ఉందని తెలిపారు.

అలాంటి పనులకు నేను వ్యతిరేకిని

యూకేలో తనను కలవడానికి ప్రయత్నిస్తున్న అభిమానుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారంపై చిరంజీవి స్పందిస్తూ అది అవాస్తవం అని పేర్కొన్నారు. "లండన్‌లో నన్ను కలవాలనుకుంటున్న ప్రియమైన అభిమానులారా.. నన్ను కలిసేందుకు 'ఫ్యాన్ మీటింగ్స్' పేరిట మీ నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది. ఒకవేళ ఎవరి నుంచైనా ఇలా డబ్బులు వసూలు చేసి ఉంటే తిరిగివచ్చే ఏర్పాటు చేస్తాను. నేను ఇలాంటి పనులకు పూర్తి వ్యతిరేకిని. మన మధ్య ఉండే అపురూపమైన బంధానికి వెలకట్టలేం" అని పేర్కొన్నారు.

అందుకే ఆ టైటిల్ పెట్టాం



సిద్దు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ఈ మూవీ ట్యాగ్‌లైన్. వైష్ణవి చైతన్య హీరోయిన్. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'కిస్' పాటను మేకర్స్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ 'ప్రతి మనిషి జీవితంలో ఓ లక్ష్యం ఉంటుంది. అయితే ఏ పని చేస్తున్నామనేది కూడా చాలా ముఖ్యం. ఓ పనిని ఇలానే ఎందుకు చేయాలి.. మరోలా చేస్తానని కొందరు అంటుంటారు. అలాంటి వారిని చూస్తే మనం క్రాక్ అంటాం. అందుకే ఈ టైటిల్ పెట్టాం. ప్రేక్షకులను నవ్విస్తూనే బాధ్యతను నిర్వర్తించే పాత్రలో కనిపిస్తాను' అని తెలిపారు. హీరోయిన్ వైష్ణవి మాట్లాడుతూ 'ఈ పాట యూత్‌కి బాగా కనెక్ట్ అయ్యేలా ఉంటుంది' అని అన్నారు.














పుస్తకం పట్టిన చిన్నారి..!

మొన్న మిరప చేలో..


మిరపకాయలు కోస్తున్న దృశ్యం

నేడు పాఠశాలలో..


పరీక్షకు సిద్ధమవుతున్న చిన్నారి

- నేడు కోసిగిలో ఇంగ్లిష్ పరీక్షకు హాజరు
- 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు చెప్పిన విద్యార్థిని

కోసిగి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కోసిగి మండలం చింతకుంటకు చెందిన సన్నక్కి చిన్నారి పదో తరగతి పరీక్షలు రాసేందుకు ఎట్టకేలకు పుస్తకం పట్టింది. శుక్రవారం కోసిగిలోని మౌంట్ కార్మెల్ పరీక్ష కేంద్రంలో ఇంగ్లిష్ పరీక్షకు హాజరు కానుంది. తల్లిదండ్రుల వలస కారణంగా సదరు విద్యార్థినికి వచ్చిన కష్టంపై ఈనెల 19న 'పరీక్ష హాలులో కాదు.. వలస వెళ్లి పొలంలో' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ఇవ్వడం, దానిపై మంత్రి లోకేశ్ స్పందించడం, ఆయన ఆదేశాలతో పరీక్షలు రాసేందుకు అధికారులు బాలికను స్వగ్రామానికి పంపించడం తెలిసిందే. ఈ క్రమంలో చిన్నారి గురువారం ఉదయం తన తల్లి కమలమ్మతో కలిసి సొంత గ్రామం చింతకుంటకు చేరుకుంది. బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి ఎంఈవో-2 శోభారాణి, హెచ్ఎం నాగేశ్వరి చేతుల మీదుగా హాల్‌టికెట్ అందుకుంది. చిన్నారి మాట్లాడుతూ పరీక్షలు రాసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని చెప్పింది. దీనికి కారణమైన 'ఆంధ్రజ్యోతి'కి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొంది.

ఆర్ట్స్ విద్యార్థికి 1.3 కోట్ల ప్యాకేజీ..!



- ఏయూలో ఎంహెచ్ఆర్ఎం చేసిన హనుమంతు
- పోలాండ్ కంపెనీకి హెచ్ఆర్ అసిస్టెంట్‌గా ఎంపిక

విశాఖపట్నం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): భారీ ప్యాకేజీలు, కోట్లలో వార్షిక వేతనాలు అంటే ముందుగా గుర్తొచ్చేది ఇంజనీరింగ్ విద్యార్థులే..! కానీ.. ఆర్ట్స్ విద్యార్థులు కూడా భారీ ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించవచ్చని శ్రీకాకుళం జిల్లా వాసి హనుమంతు సింహాచలం నిరూపించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్ఆర్ఎం) పూర్తి చేసిన హనుమంతు.. రూ.1.3 కోట్ల వార్షిక ప్యాకేజీతో పోలాండ్‌కు చెందిన ప్రముఖ డెయిరీ సంస్థ (కోవైస్క్)లో హెచ్ఆర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించారు. ఈ క్రమంలో ఏయూలో ఇంజనీరింగ్ విద్యార్థి పేరిట ఉన్న అత్యధిక ప్యాకేజీ రికార్డును ఆయన బద్దలు కొట్టారు. ఈ ఉద్యోగం సాధించేందుకు అనుసరించిన ప్రణాళికలు, నేర్చుకున్న స్కిల్స్ గురించి హనుమంతు సింహాచలం 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రభుత్వ పాఠశాలలో చదువు.. పోలాండ్‌లో కొలువు

మాది శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం ఉద్దండపాలెం గ్రామం. తల్లిదండ్రులు భీమారావు, కమల కుమారి వ్యవసాయం చేస్తుంటారు. విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోనే సాగింది. 2022లో ఏయూలో ఎంహెచ్ఆర్ఎం కోర్సులో చేరినప్పటి నుంచి అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సలహా మేరకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాను. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నా. 2024లో కోర్సు పూర్తయిన వెంటనే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో హిందుస్థాన్ ఫుడ్స్ లిమిటెడ్‌లో రూ.3.6 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. అక్కడ పనిచేస్తూనే క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సలహా మేరకు మెరుగైన అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే ఉన్నా. ఈ క్రమంలో పోలాండ్‌లోని డెయిరీ సంస్థ తమ హెచ్ఆర్ విభాగంలో పోస్టుల భర్తీకి వర్సిటీ అధికారులను సంప్రదించగా... ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నాకు సమాచారం ఇచ్చారు. లింక్డిన్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఇంటర్వ్యూకు హాజరైతే.. నేను ఇంగ్లీషు మాట్లాడిన తీరు వారికి నచ్చింది. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని సదరు సంస్థ నన్ను హెచ్ఆర్ అసిస్టెంట్‌గా ఎంపికచేసింది. మేలో విధుల్లో చేరేందుకు సిద్ధంకావాలని సమాచారం ఇచ్చింది."అని తెలిపారు.

పీ4కు సూచనలు ఇవ్వండి: ముఖ్యమంత్రి

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047లోని 10 సూత్రాల్లో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ4 కార్యక్రమాన్ని ఉగాది పండుగ రోజున ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏర్పాట్ల గురించి గురువారం సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. ఈ పథకం అమలు కోసం చేస్తున్న సర్వేలో ప్రజలందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజలంతా పీ4 పథకం పట్ల తమ సూచనలు, అభిప్రాయాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీపై ఓ కానిస్టేబుల్ వీరాభిమానం

- సోషల్ మీడియాలో పవన్, లోకేశ్‌లపై బూతుల పోస్టులు

శ్రీకాకుళం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఓ కానిస్టేబుల్ హద్దులు దాటి ఓ పార్టీపై అభిమానాన్ని చాటుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. అతని నిర్వాకం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో చిక్కుల్లో పడ్డాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బైరి చంద్రశేఖర్ కొన్నేళ్ల క్రితం కృష్ణా జిల్లాలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. మూడేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై శ్రీకాకుళం ఏసీబీలో చేరాడు. వైసీపీపై తనకున్న వీరాభిమానాన్ని చాటుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. పవన్ కల్యాణ్, లోకేశ్‌పై విమర్శలు గుప్పించాడు. ప్రభుత్వం మారాక కూడా అదే తీరు కొనసాగించాడు. అంతేకాదు.. పలువురి పోస్టులకు బదులిస్తూ తన సోషల్ మీడియా ఖాతాలో అసభ్యకర పదాలను వాడాడు. దీంతో టీడీపీ, జనసేన కార్యకర్తలు తాజాగా ఆధారాలతో ప్రభుత్వ ఉన్నతాధికారులను ట్యాగ్ చేస్తూ ఫిర్యాదు చేశారు. వాస్తవానికి వైసీపీ హయాంలోనే చంద్రశేఖర్ పోస్టులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేరినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజా ఫిర్యాదు నేపథ్యంలో కృష్ణా జిల్లాలో చంద్రశేఖర్‌పై సైబర్ క్రైమ్ కేసు నమోదయింది. అంతర్గత విచారణ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో అతడిని కృష్ణా జిల్లాకు పంపించేశారు.

పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు.. బాపట్లలో కేసు

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాపట్ల పట్టణంలోని ఉమ్మారెడ్డి సరోజనీదేవి కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త పాలపర్తి గోపీపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటమే కాకుండా గ్రూపుల మధ్య విభేదాలు రెచ్చగొట్టే విధంగా అసభ్యకర వ్యాఖ్యలు చేశాడంటూ జనసేన నాయకురాలు మాధురి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి: ఏపీజేఏసీ

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించాలని ఏపీ ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ జేఏసీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు విజ్ఞప్తి చేసింది. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్‌ను, జేఏసీ చైర్మన్ కేవీ శివారెడ్డి, జనరల్ సెక్రటరీ కేఎస్ఎస్ ప్రసాద్, ఏపీఎన్జీవో ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఇతర నేతలు కలిసి, వినతి పత్రాన్ని అందజేశారు. పలు డిమాండ్లు, ఇటీవల ఏపీజేఏసీ తీసుకున్న నిర్ణయాలతో కూడిన లేఖను సీఎస్‌కు అందజేశారు.

రూ.765 కోట్లతో వెలిగొండ పనులకు ఓకే

ప్రకాశం జిల్లాలో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-2, ప్యాకేజీ-5 పనులను రూ.765 కోట్లతో చేపట్టేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ పాలనా మోదం తెలిపింది. ప్రాజెక్టు పనులు ఇంకా మిగిలి ఉన్నాయని.. వాటిని పూర్తి చేయాలంటే ఇంత మొత్తం అవసరమని పేర్కొంటూ ఒంగోలు చీఫ్ ఇంజనీర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఈ మేరకు ఉత్తర్వు జారీ చేశారు. దీంతో నాటి సీఎం జగన్ గత ఏడాది మార్చి 6న ఆర్భాటంగా చేసిన ప్రారంభోత్సవం ఉత్తుత్తిదేనని స్పష్టమైంది. ఎన్నికల్లో లబ్ధి కోసం.. పనులు పూర్తికాకుండానే పూర్తిచేసినట్లుగా ప్రకటించి.. జాతికి అంకితం చేసి అప్పట్లోనే నవ్వులపాలయ్యారు. అయితే మొన్నటి బడ్జెట్‌లో ప్రాజెక్టుకు తక్కువ నిధులు కేటాయించారంటూ వైసీపీ గగ్గోలు పెట్టింది. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు మండలిలో దిమ్మదిరిగేలా సమాధానమివ్వడంతో ఆ పార్టీ ఎమ్మెల్సీలు మిన్నకుండిపోయారు.

జీవో 24ను రద్దు చేయాలి

- తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా అందులోని అంశాలు: టీటీడీ ఈవో

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి జిల్లా పేరూరు పరిధిలో హోటళ్ల నిర్మాణానికి ఒబెరాయ్ గ్రూప్‌నకు 20 ఎకరాలు కేటాయిస్తూ ఇచ్చిన జీవో 24ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ గతేడాది నవంబరు 18న టీటీడీ తీర్మానం చేసిందని ఈవో జె.శ్యామలరావు పేర్కొన్నారు. ఈ మేరకు హైకోర్టులో ఆయన అఫిడవిట్ దాఖలు చేశారు. విలాసవంతమైన విల్లాలతో పాటు బార్, లాంజ్, స్పా, పార్టీ హాళ్ల నిర్మాణానికి ఒబెరాయ్ గ్రూపునకు చెందిన ముంతాజ్ హోటల్స్ ట్రైడెంట్ ఫైవ్‌స్టార్ హోటళ్లకు గత ప్రభుత్వం అనుమతిస్తూ జీవో ఇవ్వడం తిరుమల కొండల పవిత్రత, ఆధ్యాత్మికత, మత సంప్రదాయాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని తగిన ఉత్తర్వులు ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు.

రైతు రిజిస్ట్రీలో ఆంధ్రకు మూడో స్థానం

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): భూ యజమానులకు విశిష్ట సంఖ్య జారీ కోసం వ్యవసాయశాఖ చేపట్టిన రైతు రిజిస్ట్రీలో మన రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో మధ్యప్రదేశ్, రెండో స్థానంలో మహారాష్ట్ర నిలిచాయి. రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్య ఇవ్వడానికి గత నెల రెండో వారంలో రైతు రిజిస్ట్రీని ప్రారంభించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 38.50లక్షల మంది(64%) రైతులకు విశిష్ట సంఖ్య జారీకి అవకాశం కల్పించిన రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు, డిజిటల్ సెల్ ఎస్ఈ బాలసుబ్రహ్మణ్యంలను కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

పంట ఉత్పత్తుల సేకరణకు 547 కేంద్రాలు: మార్క్‌ఫెడ్

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024-25 ఖరీఫ్‌లో పండిన కంది, 2025 రబీలో పండిన శనగ, మినుము, పెసర ఉత్పత్తులను మద్దతు ధరలకు సేకరించడానికి 547 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్ చెప్పారు. సీఎంయాప్ ద్వారా సేకరించి, రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామన్నారు.

శారదా పీఠం భూ ఆక్రమణలపై సర్వే

పెందుర్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగర పరిధిలోని చినముషిడివాడలోని శారదా పీఠం భూ ఆక్రమణలపై పెందుర్తి తహశీల్దార్ ఆనంద కుమార్ నేతృత్వంలో సిబ్బంది గురువారం సర్వే చేపట్టారు. 'పీఠం వెనుక మోసం' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో జేసీ కె.మయూర్ అశోక్ స్పందించి విచారణకు ఆదేశించారు. సిబ్బంది గురువారం పీఠానికి వెళ్లగా నిర్వాహకులు కొన్ని డాక్యుమెంట్లను అందజేశారు. సర్వే నివేదికను జేసీకి తహశీల్దార్ అందజేశారు. దానిని ఆయన శుక్రవారం రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ సిసోడియాకు అందజేస్తారు.

రాజధానికి ఐటీ సొగసు

- అమరావతిలో తొలి ఐటీ టవర్ నిర్మాణానికి ఎల్అండ్‌టీ సిద్ధం
- ఎలక్ట్రానిక్ సిటీలో పదెకరాలు కేటాయించిన ప్రభుత్వం


గతంలో జెనెసిస్ సంస్థ రూపొందించిన ఐటీ టవర్స్ నమూనా

మంగళగిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఒకపక్క రాజధాని అమరావతిలో నిర్మాణ పనులకు వేగంగా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం.. మరోపక్క ఈ ప్రాంతాన్ని త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. దీనిలో భాగంగా పలు సంస్థలకు ఏపీ సీఆర్‌డీఏ భూములను కేటాయించింది. ఈ కేటాయింపుల్లో భాగంగా మంగళగిరి సమీపంలోని నిడమర్రులో ఐటీ టవర్‌ను నిర్మించేందుకు ఎల్అండ్‌టీ సంస్థకు గురువారం 10 ఎకరాలు కేటాయించారు. అమరావతి నవ నగరాల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నిడమర్రు వద్ద 6,577 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ సిటీని నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదలనకు అనుగుణంగా ఇపుడు ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోనే ఐటీ టవర్ కోసం ఎల్అండ్‌టీ సంస్థకు భూమి కేటాయించారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో తొలినాళ్లలో సైబర్ టవర్స్‌ను నిర్మించిన తరహాలో అమరావతిలో కూడా ఐటీ రంగం అభివృద్ధికి దోహదపడే విధంగా దీనిని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ టవర్‌ను డీప్ టెక్ ఐకానిక్ భవనంగా తీర్చిదిద్దుతారు. రాబోయే కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ టెక్నాలజీ ప్రధాన భూమిక పోషిస్తాయన్న అంచనాల నేపథ్యంలో వాటికి అనుగుణంగా ఈ టవర్ నిర్మాణాన్ని చేపడతారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో విశాఖ తరువాత మంగళగిరి ప్రాంతంలో మాత్రమే కొన్ని ఐటీ కంపెనీలు పనిచేస్తున్నాయి. అయితే హైదరాబాద్, బెంగళూరు మాదిరి అమరావతిని కూడా ఐటీ ఉద్యోగులకు ప్రధానకేంద్రంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాజధాని ప్రాంతంలో తొలి ఐటీ టవర్‌గా దీనిని నిర్మించనున్నారు. నిడమర్రులో ఐటీ టవర్ నిర్మాణం పూర్తయ్యాక దానిని ఐటీ సంస్థలకు అద్దె ప్రాతిపదికన కేటాయించనున్నారు. దీనివల్ల వేలాది నిరుద్యోగ యువతకు రాజధానిలో ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు. హైదరాబాద్‌లో సైబర్ టవర్స్‌ని నిర్మించడంతో పాటు గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో మేధా టవర్స్‌ను అభివృద్ధి చేసిన అనుభవం ఎల్ అండ్ టీకి ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకునే సీఎం చంద్రబాబు అమరావతిలో ఎల్ అండ్ టీ సంస్థకే ఐటీ టవర్ నిర్మాణ పనులు అప్పగించారని తెలుస్తోంది.

గతంలో భవన నమూనా ఎంపిక

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐటీ మంత్రిగా ఉన్న లోకేశ్ రాజధానిలో ఐటీ టవర్స్ నిర్మించేందుకు కృషిచేశారు. అప్పట్లో 12 నమూనాలు విడుదల చేసి బెస్ట్ నమూనా కోసం ప్రజాభిప్రాయాలను కూడా కోరారు. హైదరాబాద్‌కు చెందిన జెనెసిస్ ప్లానర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూపొందించిన ఓ భవన నమూనాను ఎంపిక చేసి నిర్మాణ పనులకు ఉపక్రమించారు. అప్పట్లో దానిని అయిదెకరాల విస్తీర్ణంలో 3బి+జి+12 భవనంగా నిర్మించాలని ప్రతిపాదించారు. టవర్ నిర్మాణపనులు సన్నాహకదశలో ఉండగా ఎన్నికలు రావడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో రాజధాని పనులన్నింటికీ పాతరపడింది.


దివ్యాంగుడికి చెక్కు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

వెతికి మరీ ప్రభుత్వ సాయం!

- ఈ నెల 15న సీఎం చంద్రబాబు తణుకు పర్యటనలో తమ పరిస్థితిపై ఓ మహిళ మొర
- భర్తను కోల్పోయానని, కుమారుడు దివ్యాంగుడని ఆవేదన
- రూ.లక్ష సాయం అందించాలని సీఎం ఆదేశం
- ఫొటో ఆధారంగా మహిళ వివరాలు గుర్తింపు
- రూ.లక్ష చెక్కు అందజేసిన అధికారులు

తణుకు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దువ్వ గ్రామానికి చెందిన నందివాడ ఏసమ్మ 14 ఏళ్ల క్రితం భర్తను కోల్పోయింది.. కుమారుడు మానసిక వైకల్యంతో సరిగా నడవలేడని, మాట్లాడలేని పరిస్థితి. పింఛను కూడా రావడం లేదు. ఈ నెల 15న పశ్చిమగోదావరి జిల్లా తణుకు పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుకు ఏసమ్మ తన గోడు చెప్పుకొంది. తన కుమారుడికి కనీసం దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరింది. దీంతో సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.లక్ష ఆమె బిడ్డ పేరున డిపాజిట్ చేయాలని సీఎం అక్కడికక్కడే కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. మహిళ నుంచి దరఖాస్తు లేకున్నా, ఏసమ్మ వివరాలు లేకపోయినా సీఎంను కలిసిన ఆమె ఫొటో ఆధారంగా రెవెన్యూ, పోలీసు అధికారులు వివరాలు సేకరించారు. రూ.లక్ష చెక్‌ను గురువారం కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి భీమవరంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏసమ్మ, ఆమె కుమారుడికి అందజేశారు. సీఎం చంద్రబాబు చేసిన సహాయం ఎన్నటికీ మరువలేమని ఏసమ్మ పేర్కొన్నారు. పింఛన్ మంజూరుకు, ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆమెకు కలెక్టరు భరోసా ఇచ్చారు.

ఉద్యోగుల బకాయిలు 6,200 కోట్లు చెల్లించండి

- ఆర్థిక శాఖకు చంద్రబాబు ఆదేశం
- గత ప్రభుత్వంలో పెండింగ్

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. రూ.6,200 కోట్ల మేర ఉద్యోగుల బిల్లులు చెల్లించాలని శుక్రవారం ఆర్థిక శాఖను ఆదేశించారు. ఈ బకాయిలన్నీ సీపీఎస్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐకి సంబంధించినవని ప్రభుత్వం ప్రకటించింది. గత జగన్ ప్రభుత్వం వీటిని బకాయి పెట్టింది. ఈ ఏడాది జనవరిలోనూ ఉద్యోగులకు వివిధ పెండింగ్ బకాయిల కింద కూటమి ప్రభుత్వం రూ.1,033 కోట్లు చెల్లించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది. వైసీపీ హయాంలో ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.25,000 కోట్లకు చేరాయి. ఇప్పుడు ఆ పెండింగ్ బిల్లులనే విడతల వారీగా ప్రభుత్వం చెల్లిస్తోంది.

వచ్చే 3 నెలలు ఎండలతో జాగ్రత్త!

- అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులపై ప్రజలను అప్రమత్తం చేయాలి
- అధికారులకు సీఎస్ ఆదేశాలు

అమరావతి/విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు చోట్ల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న మూడు నెలలు అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించారు. గురువారం ఆయన సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందన్నారు. అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకునేందుకు విపత్తు నిర్వహణ సంస్థతో సహా సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ, టెంట్లు, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల పరీక్షా కేంద్రాల్లోనూ తాగునీరు, నిరంతర విద్యుత్, ఇతర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారి పర్యవేక్షణలో వేసవి ప్రణాళికల అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఏయే ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయో, వడగాడ్పులు వీస్తాయో ముందుగానే సంక్షిప్త సందేశాలు జారీ చేసి, ప్రజల్ని అప్రమత్తం చేయాలని సీఎస్ ఆదేశించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు అవసరమైతే తప్ప బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ మాట్లాడుతూ వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా తాము అలెర్ట్ మెస్సేజ్‌లు జారీ చేస్తున్నామని తెలిపారు.

రాయలసీమలో ఎండల తీవ్రత

వాయవ్య గాలుల ప్రభావంతో రాయలసీమలో ఎండల తీవ్రత పెరిగింది. దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో 41.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని 49 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది.

సీఎం ఆదేశాలతో పశువుల యూనిట్లు మంజూరు

సీఎం చంద్రబాబు హామీ మేరకు శ్రీకాకుళం జిల్లాలో పశుపోషకులకు 7 పాడి గేదెల యూనిట్లు, 15 గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కో పాడి రైతుకు రూ.లక్ష చొప్పున 7 పాడి గేదెల యూనిట్లు, ఒక్కో గొర్రెల కాపరికి రూ.2.20 లక్షల చొప్పున (20+1 గొర్రెలు) 15 యూనిట్లకు ప్రభుత్వం రూ.33 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మంచి రోజు చూసుకుని టీడీపీలో చేరుతా

- జగన్ తీరుతోనే వైసీపీ నుంచి బయటకు
- అహర్నిశలు కష్టపడినా ప్రాధాన్యం లేదు: మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 'వైసీపీకి రాజీనామా చేస్తున్నా. మంచి రోజు చూసుకుని టీడీపీలో చేరబోతున్నా' అని ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన మర్రి రాజశేఖర్ ప్రకటించారు. ఆయన గురువారం తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. 'వైసీపీని వీడి నేను బయటకు రావడానికి పార్టీ అధినేతే కారణం. ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే పరిస్థితి జగన్ జమానాలో కనిపించలేదు. ఎంతో ఓర్పుగా ఉన్నప్పటికీ జగన్ విధానాలు, నిర్ణయాలు నచ్చక బయటకు రాక తప్ప లేదు. 40 ఏళ్లుగా మా కుటుంబం రాజకీయాల్లో ఉంది. నా మామ సోమేపల్లి సాంబయ్య, నేను కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ చిలకలూరిపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో మంచి పనులు చేశాం. మాపై ప్రజలకు గౌరవభావం ఉంది. నియోజకవర్గంలో పార్టీ నిర్మాణం చేసి ఎంతో కష్టపడితే మాకు తీరని అన్యాయం జరిగింది. వైసీపీని బలోపేతం చేసి, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడినప్పటికీ నాకు ప్రాధాన్యం ఇవ్వలేదు. నాకు మంత్రి పదవి, ఎమ్మెల్సీ ఇస్తానని 2019లో ఎన్నికల ప్రచార బహిరంగ సభలో జగన్ ప్రకటించారు. ఆ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కష్టపడ్డాం. అయితే ఎప్పటికప్పుడు దాటవేస్తూ నాలుగు సంవత్సరాల తర్వాత ఎమ్మెల్సీ ఇచ్చారు. 2024 ఎన్నికల సమయంలో చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి ఎంపిక నిర్ణయాన్ని నాకు తెలియకుండానే చేశారు. అంతా అయ్యాక నన్ను పిలిపించి పార్టీని గెలిపించమని కోరారు. ఇద్దరు అభ్యర్థులను వెంటవెంటనే మార్చారు. మాజీ మంత్రి రజినీని ఇక్కడ నుంచి గుంటూరుకు ఎందుకు పంపారో, 53 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన ఆమెను మళ్లీ అక్కడి నుంచి ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చారో వాళ్లకే తెలియాలి. 2024 ఎన్నికల అనంతరం జగన్ నన్ను ప్రత్యేకంగా పిలిపించి చిలకలూరిపేటకు పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించాలని, మంచి రోజు చూసి ప్రకటన చేస్తామని చెప్పారు. ఇది జరిగిన కొద్ది రోజులకే మళ్లీ ఆ పదవిని కూడా నాకు తెలియకుండా ఆమెకే కట్టబెట్టారు. కార్యకర్తలకు అండగా ఉండాలని అన్నీ ఓర్చుకొని ఇంతకాలం పార్టీలో కొనసాగా. నాకే అనుకుంటే పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకూ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అన్యాయం జరిగింది. కొంతమందిపై కేసులు కూడా పెట్టారు. మా అవసరం పార్టీకి లేనప్పుడు, మాకు విలువ ఇవ్వనప్పుడు ఆ పార్టీలో ఎందుకు ఉండాలన్నది కార్యకర్తల అభిప్రాయం. నేను ఎమ్మెల్సీ పదవికి స్వచ్ఛందంగానే రాజీనామా చేశాను. కార్యకర్తలందరితో మాట్లాడి, మంచి రోజు చూసి టీడీపీలో చేరతాను' అని మర్రి తెలిపారు.

నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం గ్రీవెన్స్

- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లకు చంద్రబాబు, లోకేశ్ ఆదేశం

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 'ఇకపై రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం ఉదయం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలి. మధ్యాహ్నం నుంచి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి, వారి సమస్యలు పరిష్కరించాలి' అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ సంస్థాగత నిర్మాణం, అన్ని విభాగాల కార్యక్రమాలలో ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని అభినందించాలని వారు దిశానిర్దేశం చేశారు. ప్రతి నెల ఇన్‌చార్జ్ మంత్రులు తమకు కేటాయించిన జిల్లాలో రెండు రోజులు పర్యటించాలని కోరారు. కాగా, తన నియోజకవర్గం మంగళగిరి పర్యటనలో ముందుగా పార్టీ కార్యకర్తలను కలుసుకుని, వారి యోగక్షేమాలు అడిగి లోకేశ్ తెలుసుకుంటున్నారు.

పాస్టర్ల గౌరవ వేతనానికి రూ.12 కోట్లు విడుదల

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని క్రైస్తవ పాస్టర్లకు గౌరవ వేతనాల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12.82 కోట్లు విడుదల చేసింది. ఈ విషయాన్ని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 8,427 మంది పాస్టర్లకు నెలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనం ఇస్తారు. గత ఏడాది మే నెల నుంచి పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లింపులకు ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేసింది.

15 రోజులు.. 86 గంటలు

- ఫలప్రదంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫలప్రదంగా ముగిశాయి. గత నెల 24న గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో మొదలైన సమావేశాలు.. గురువారం వరకు కొనసాగాయి. 15 పనిదినాల్లో ఉభయసభలు జరిగాయి. తొమ్మిది బిల్లులు ఆమోదం పొందాయి. ఈ 15 రోజుల్లో శాసనసభలో 85 గంటల 52 నిమిషాల పాటు సభ్యులు మాట్లాడారు. నక్షత్ర గుర్తు కలిగిన 113 ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలిచ్చింది. రెండు స్వల్ప వ్యవధి ప్రశ్నలకు మౌఖికంగా జవాబిచ్చింది. 17 నక్షత్ర మార్కు ప్రశ్నలకు సమాధానాలను సభలో ఉంచారు. 344 నిబంధన కింద ఒకటి, 74వ నిబంధన కింద రెండు అంశాలు చర్చించారు. ఎస్సీ వర్గీకరణపై చివరి రోజు చర్చించారు. సహకార బ్యాంకుల అవకతవకలపై సభాసంఘం విచారణ కోసం ఆమదాలవలస శాసనసభ్యుడు కూన రవికుమార్ చేసిన డిమాండ్‌ను అసెంబ్లీ ఆమోదించింది. దీనిపై సభాసంఘం వేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఈసారి జీరో అవర్‌లో ఎక్కువ మంది సభ్యులు తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే అవకాశాన్ని స్పీకర్ స్థానంలో కూర్చున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కల్పించడంపైనా సంతృప్తి వ్యక్తమైంది. మండలి 14 రోజులు జరిగింది. 103 నక్షత్ర మార్కు ప్రశ్నలకు, 3 స్వల్ప వ్యవధి ప్రశ్నలకు ప్రభుత్వం జవాబిచ్చింది. 9 అంశాలపై స్వల్పకాలిక చర్చ జరిగింది. అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టినా.. ఎమ్మెల్సీలు మండలి సమావేశాల్లో పాల్గొన్నారు. కీలకమైన ప్రశ్నలు వేసి ప్రభుత్వం నుంచి సహేతుకమైన సమాధానాలు రాబట్టగలిగామని ఆ పార్టీ ఎమ్మెల్సీలు కొందరు తెలిపారు. మొత్తానికి.. ఐదేళ్ల తర్వాత మళ్లీ శాసనసభ సంప్రదాయాలకు అనుగుణంగా ఉభయసభలూ అర్థవంతంగా జరిగాయన్న అభిప్రాయం సభ్యుల్లో కనిపించింది.


వేడుకగా ఆటల పోటీలు..

అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆటల పోటీలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో ఈ క్రీడా పోటీలను నిర్వహించేవారు. రాష్ట్ర విభజన జరిగాక.. 2014-19 నడుమ కూడా నాటి టీడీపీ ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని కొనసాగించింది. అయితే జగన్ సీఎం అయ్యాక.. 2019-24 మధ్య ఆటలు లేవు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక.. మళ్లీ ఇప్పుడు శాసనసభ, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను సభాపతి అయ్యన్నపాత్రుడు పునఃప్రారంభించారు. సభ్యులు కూడా ఉత్సాహంగా పాలు పంచుకున్నారు.

ఎస్సీలుగా బేడ, బుడగజంగాలు!

- కేంద్రానికి సిఫారసు చేస్తూ అసెంబ్లీ తీర్మానం

బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలని కేంద్రానికి సిఫారసు చేస్తూ అసెంబ్లీ తీర్మానించింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభలో ఈ తీర్మానాన్ని చదివి వినిపించగా.. సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బేడ, బుడగ జంగాలను గ్రూప్-1 కేటగిరీలో చేర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. మద్రాసు రాష్ట్రం ఉన్నప్పుడు బేడ, బుడగ జంగాలు ఎస్సీలుగా లేరని, తెలంగాణతో కలిసిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వారిని ఎస్సీలుగా పరిగణించారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఎస్సీల్లో లేరని తెలిపారు. అత్యంత వెనుకబడిన ఈ వర్గాలు ఎంతో కాలంగా తమను ఎస్సీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు.





ఇవ్వాళన్నా రండి

స్పీకర్ ఆదేశాలు పాటిస్తా


అయ్యన్న, లోకేశ్ సరదా సంభాషణ

శాసన సభ గురువారం నిరవధికంగా వాయిదా పడిన తరువాత సభ నుంచి బయటకు వస్తున్న స్పీకర్ అయ్యన్న, మంత్రి లోకేశ్ మధ్య సరదా సంభాషణ జరిగింది. తన ముందు వెళ్తున్న మంత్రిని అయ్యన్న పిలిచారు. 'ఎమ్మెల్యేల క్రీడా పోటీలకు గైర్హాజరయ్యారు. ఈరోజు జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకైనా తప్పకుండా రండి' అని లోకేశ్‌ను కోరారు. స్పీకర్ ఆదేశాలు తప్పక పాటిస్తామని మంత్రి సరదాగా అన్నారు. 'నేనిక సెలవు తీసుకుంటా' అన్న స్పీకర్‌తో... నేనూ వస్తానంటూ లోకేశ్ వెళ్లి.. కారు డోర్ తీసి అయ్యన్నను సీటులో కూర్చోపెట్టి వీడ్కోలు పలికారు.

మాట నిలబెట్టుకున్నాం

వర్గీకరణపై ముప్పై ఏళ్ల నిరీక్షణను నిజం చేశాం: చంద్రబాబు

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై శాసనసభలో గురువారం జరిగిన చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ ఉపకులాల్లో సమన్యాయం కోసం సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తున్నామని తెలిపారు. 1995లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో మొదలై, ఇప్పటివరకు సాగిన వర్గీకరణ అంశం... తన హయాంలోనే సాకారం కావడం సంతృప్తినిచ్చిందన్నారు. 2011 జనాభాలెక్కల ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని, 2026 జనగణన తర్వాత జిల్లా యూనిట్‌గా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని వివరించారు. "మాదిగల సమస్యలను ప్రత్యక్షంగా చూశాను. వారు డిమాండ్లు సమంజసమని భావించి 1996 సెప్టెంబరు 10న జస్టిస్ రామచంద్రరావు కమిషన్ వేశాను. కమిషన్ రాష్ట్రమంతా తిరిగి అధ్యయనం చేసి 1997 మే 28న నివేదిక ఇచ్చింది. సమాజంలో అసమానతలు తొలగి, పేదరికంలేని సమాజం లక్ష్యంగా 1997 జూన్ 6న ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చాను. 1999 నవంబర్ 30న రాష్ట్రపతి ఆమోదంతో వర్గీకరణ పాలసీ అమల్లోకి తెచ్చాం. దీనివల్ల మాదిగలు, ఉపకులాలకు 22 వేలకు పైగా ఉద్యోగాలు లభించాయి. అయితే వర్గీకరణ అంశంపై అధికారం ఒక్క పార్లమెంటుకే ఉందని 2004 నవంబర్ 5న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో నాటి కేంద్ర ప్రభుత్వం వేసిన ఉషామెహ్రా కమిషన్ వర్గీకరణ అమలైన 2000-2004 మధ్య మంచి ఫలితాలొచ్చాయని స్పష్టం చేసింది. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా గత ఏడాది ఆగస్టులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది." అంటూ చరిత్రను సభలో వివరించారు. ఇంకా ఏమన్నారంటే..



20 ఇళ్లు ఉండే ఊరు మాది.. రోడ్డూ లేదు.. : చంద్రబాబు

20 ఇళ్లు మాత్రమే ఉన్న మారుమూల గ్రామంలో పుట్టానని చంద్రబాబు తెలిపారు. "మా ఊరికి అప్పట్లో సరైన రోడ్డు లేదు. రోడ్డు వేయించేందుకు ఇంటికో ఎడ్ల బండి కట్టి మట్టి తోలేవాళ్లం. ఢిల్లీలో బిల్‌గేట్స్‌తో మాట్లాడినప్పుడు 30 ఏళ్ల కిందటి సంగతులు ఆయన గుర్తు చేస్తే చాలా సంతోషమేసింది. ఒకప్పుడు పీ-3 తెచ్చి సంపద సృష్టించి పేదలను ఆదుకున్నాం. ఈ ఉగాది నాడు పీ-4 తెస్తున్నాం. తూర్పు కాపులకు కుల సర్టిఫికెట్ అంశంపై కసరత్తు చేస్తున్నాం." అని వివరించారు.

వివక్షను కళ్లారా చూశాను..

"తొలిసారి సీఎంగా పనిచేసిన కాలంలో ఎస్సీల పట్ల జరుగుతున్న వివక్షను కళ్లారా చూశాను. జస్టిస్ పున్నయ్య కమిషన్ వేశాం. కుల వివక్ష ఉండకూడదనే ఉద్దేశంతో 25 మెమోలు, జీవోలు ఇచ్చాం. కుల వివక్ష చూపేవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టేందుకు ఆదేశాలిచ్చాం. రాష్ట్ర స్థాయిలో నోడల్ ఆఫీసర్‌ని నియమించాం. ప్రతినెలా 30న ప్రతిగ్రామంలో పౌరహక్కుల ఉత్సవాలు జరిపాం."

దళిత చాంపియన్ టీడీపీయే..

"ఎస్సీ వర్గీకరణపై 2024 నవంబరు 15న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ వేశాం. ఈ ఏడాది మార్చి 10న కమిషన్ సమగ్ర నివేదిక ఇచ్చింది. 59 ఉపకులాలను మూడు కేటగిరీలుగా విభజించి రిజర్వేషన్లను కేటాయించారు. దాని ప్రకారం.. 8శాతం పోస్టులు మాలలు, ఉప కులాలు; ఆరు శాతం మాదిగలు, ఉపకులాలు; 1 శాతం రెల్లి సామాజిక వర్గానికి వస్తాయి. మూడూ కలిపితే 15 శాతం అవుతుంది. మొదటిసారిగా దళితుణ్ని లోక్‌సభ స్పీకర్‌ని చేసిన ఘనత మాది. దళిత మహిళ ప్రతిభాభారతిని అసెంబ్లీ స్పీకర్‌ని చేశాను. దళిత ఐఏఎస్ కాకి మాధవరావును సీఎస్‌గా నియమించాం. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే అంబేడ్కర్‌కు భారతరత్న ప్రదానం జరిగింది. వాజపేయి హయాంలో అంబేడ్కర్ ఫొటో పార్లమెంట్‌లో పెట్టారు. నేను యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్నప్పుడు ఎస్సీ వర్గానికి చెందిన కేఆర్ నారాయణన్‌ను రాష్ట్రపతిని చేశాం. అబ్దుల్ కలామ్‌ని రాష్ట్రపతిని చేశాం. దళిత చాంపియన్ టీడీపీ. గత ప్రభుత్వం ఐదేళ్లలో వెనకబడిన కులాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. వారి సంక్షేమం పట్టించుకోలేదు" అని చంద్రబాబు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేపట్టామన్నారు. ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, కాలువ శ్రీనివాసులు, కొణతాల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్ కూడా మాట్లాడారు.

జిల్లా యూనిట్‌గా వర్గీకరణ: ఎమ్మెల్యేలు

ఎస్సీ వర్గీకరణ జిల్లా యూనిట్‌గా జరిగితేనే సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఎస్సీ ఉపకులాల జనాభా ఒక్కో ప్రాంతంలో ఒక్కోవిధంగా ఉందని.. కాబట్టి రాష్ట్ర యూనిట్‌గా చేస్తే అందరికీ సమాన అవకాశాలు లభించే అవకాశం ఉండదని అన్నారు. అయితే 2011 జనాభా లెక్కలే ఇప్పటికీ ప్రామాణికంగా ఉన్నందున కొత్త జనగణన చేసిన తర్వాత జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. చర్చలో నక్కా ఆనంద్‌బాబు, బి.రామాంజనేయులు, కొండ్రు మురళీ, మద్దిపాటి వెంకటరాజు, బోనెల విజయచంద్ర పాల్గొన్నారు.

అందరికీ సమాన అవకాశాలు లభించాలి

ప్రక్రియకు జనసేన మద్దతు ఇస్తోంది: డిప్యూటీ సీఎం పవన్



అందరికీ సమాన అవకాశాలు లభించడం కోసం ఎస్సీ వర్గీకరణకు జనసేన సంపూర్ణ మద్దతునిస్తోందని ఆ పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వర్గీకరణ పోరాట యోధుడు మందకృష్ణ మాదిగ అయితే, వర్గీకరణ రూపకర్త చంద్రబాబు అని, వర్గీకరణ ఫలప్రదాత ప్రధాని మోదీ అని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ అంశం ఈ స్థాయికి చేరుకోవడానికి కారణం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అయితే, దాన్ని ముందుకు తీసుకెళ్లిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు.

వర్గీకరణపై ఆర్డినెన్స్!?

(మొదటి పేజీ తరువాయి)

అనుమతితో మరింత చట్టబద్ధత వస్తుంది" అని బుధవారం చంద్రబాబు పార్టీ నేతలతో అన్నారు. దీంతో... గురువారం ఉభయ సభల్లో వర్గీకరణపై తీర్మానం ప్రవేశపెట్టడం ఖాయమని అంతా భావించారు. అసెంబ్లీలో తీర్మానం అమలుకు ఎలాంటి అడ్డంకీ లేదు. కానీ మండలిలోనూ సాఫీగా సాగడం ముఖ్యం. దీంతో... ప్రభుత్వం తరఫున కొందరు ప్రతినిధులు బుధవారమే మండలి ఛైర్మన్ మోషేన్ రాజును కలిశారు. 'ఎస్సీ వర్గీకరణపై మండలిలో తీర్మానం ప్రవేశపెడతాం. దీనికి ఆమోదించండి' అని కోరారు. ఆయన అంగీకరించలేదని తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 'కమిషన్ నివేదికను నేను చూడాలి. చదవాలి. ఇప్పటికిప్పుడు ప్రవేశపెట్టి తీర్మానం చేయడమంటే కుదరదు' అని పేర్కొన్నట్లు తెలిసింది. మండలిలో వైసీపీకే ఎక్కువ బలముంది. ఛైర్మన్ నియామకం కూడా వైసీపీ హయాంలోనే జరిగింది. దీంతో దాని వైఖరేమిటో పాలక పక్షానికి అర్థమైంది.

అసెంబ్లీలో ఇలా.. మండలిలో అలా..

ఎస్సీ వర్గీకరణపై శాసనసభలో తీర్మానం ఆమోదించి... మండలిలో ఆగిపోతే దాని అమలుకు బ్రేకులు పడినట్లే. మండలిలో విషయం పెండింగ్‌లో ఉండగా.. వర్గీకరణ అమలు చేయడం కుదరదు. అందుకే శాసనసభలోనూ తీర్మానం ప్రవేశపెట్టలేదు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను సభ ముందుంచి, లఘు చర్చ మాత్రమే జరుపుతున్నట్లు అజెండాలో పేర్కొన్నారు. ఆ మేరకు మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి నివేదికను సభముందుంచారు. దీనిపై సభ్యులు మాట్లాడారు. ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. అదే సమయంలో... ఈ నివేదికను మండలిలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. తీర్మానం ఆమోదించాలని కోరారు. అభ్యంతరాలు, అభిప్రాయాలు చెప్పాలని పదేపదే అడిగారు. వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు లేచి... దీనిపై చర్చించాలంటుండగానే, విపక్ష నేత బొత్స సత్యనారాయణ చెయ్యి ఊపుతూ ఆయన్ను ఆపేశారు. మరోవైపు ఛైర్మన్ దీనిపై చర్చ లేదని తేల్చేశారు. అప్పటికీ పండుల మాట్లాడుతుండగా 'మీరు చెప్పేది రికార్డుల్లోకి రాదు' అని స్పష్టం చేశారు. అనిత ప్రకటన చేస్తుండగానే సభను వాయిదా వేసి వెళ్లిపోయారు.

అడ్డంకిని తొలగించే 'ఆర్డినెన్స్' రూటు...

ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో మాత్రమే తీర్మానం చేసి.. మండలిలో అడ్డంకి ఎదురై ఉంటే దీని అమలుకు ఆటంకాలు ఏర్పడేవి. వైసీపీ కుయుక్తిని గ్రహించిన పాలక పక్షం.. శాసనసభలోనూ తీర్మానం చేయలేదు. వెరసి... ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ అమలుకు రంగం సిద్ధం చేసింది. కమిషన్ నివేదికను ఇప్పటికే సభకు సమర్పించిన నేపథ్యంలో... సిఫారసుల సారాంశాన్ని జాతీయ ఎస్సీ కమిషన్‌కు వివరించనున్నారు. అసెంబ్లీ ప్రొరోగ్ కాగానే ఆర్డినెన్స్ తీసుకొచ్చి వర్గీకరణ అమలు చేయాలని భావిస్తున్నారు.



రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కొత్త పాలసీ

సినీ పెద్దలతో సీఎం, డిప్యూటీ సీఎం చర్చించారు: మంత్రి దుర్గేశ్

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి త్వరలో కొత్త పాలసీ తీసుకువస్తామని పర్యాటక, సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. సినీ ప్రముఖులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విశాఖపట్నంలో సినీ పరిశ్రమ అభివృద్ధి, గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధిపై గురువారం వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి కందుల దుర్గేశ్ సమాధానం ఇచ్చారు. విశాఖ, తిరుపతిలో సినీ పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలు సినీ పరిశ్రమ పెద్దలతో చర్చించారన్నారు. గిరిజనుల భాగస్వామ్యంతో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.



త్వరలో 277 మందికి డీఎస్పీలుగా పదోన్నతి

అసెంబ్లీలో తెలిపిన మంత్రి అనిత

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 277 మందికి డీఎస్పీలుగా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. గురువారం అసెంబ్లీలో డీఎస్పీల పదోన్నతులపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. సీనియార్టీ జాబితాను సవరించడం వల్ల కొంతమంది కోర్టుకు వెళ్లారని, దీనివల్ల పదోన్నతులకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. 1995 నుంచి పలువురు పదోన్నతులకు నోచుకోలేదని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు చెప్పారు. కొత్త కానిస్టేబుళ్లను త్వరలోనే శిక్షణకు పంపిస్తామని మంత్రి తెలిపారు. కానిస్టేబుల్ నియామకాలకు మెయిన్ పరీక్ష నిర్వహించాల్సి ఉందని, కోర్టు కేసు కూడా పరిష్కారం కావల్సి ఉందని చెప్పారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కానిస్టేబుళ్ల పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రశ్నించారు.

రాష్ట్ర అప్పులు 9,74,556 కోట్లు

ఉద్యోగుల నిధి 80,914 కోట్లు వాడేశారు

సివిల్ డిపాజిట్లు, ధాన్యం డబ్బులు కూడా..



అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల రుణాలపై ప్రశ్నోత్తరాల సమయంలో శాసనమండలిలో గురువారం అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడిగా చర్చ జరిగింది. వైసీపీ ఆరోపణలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ దీటుగా బదులిచ్చారు. 2018-19 నాటికి ప్రభుత్వానికి రూ.2,57,509 కోట్లు, కార్పొరేషన్లకు రూ.49 వేల కోట్ల అప్పులు ఉన్నాయని చెప్పారు. 2024 జూన్ 12 నాటికి ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల అప్పులు రూ.9,74,556 కోట్లకు చేరాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 జూన్ 12 నుంచి, 2024 డిసెంబరు 31వరకు పెరిగిన నికర ప్రజారుణం రూ.44,124కోట్లు మాత్రమేనని, వీటిలో 41,599కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పుల కోసమే చెల్లించామన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ 2014-19, 2019-24 సంవత్సరాల్లో అప్పులను వేర్వేరుగా చూపిస్తూ శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పయ్యావుల మాట్లాడుతూ ఏజీ నివేదిక ప్రకారం ప్రభుత్వానికి 9,74,556 కోట్ల అప్పులు ఉన్నాయన్నారు. ఉద్యోగులు దాచుకున్న 80,914 కోట్ల నిధిని కూడా గత ప్రభుత్వం వాడుకుందన్నారు. ఉద్యోగుల డబ్బు వాడుకుంటే అది అప్పు కాదా? అని ప్రశ్నించారు. సివిల్ డిపాజిట్లు, రైతుల ధాన్యం డబ్బులను వాడేశారని, రీయింబర్స్‌మెంట్ బకాయిలు తామే చెల్లిస్తున్నామని చెప్పారు.

కేంద్ర పథకాలకు 7,230 కోట్లు చెల్లించాం: పయ్యావుల

కేంద్ర ప్రాయోజిత పథకాలకు చెల్లించాల్సిన బకాయిలు రూ.7,230కోట్లు ఉన్నాయని, పథకాల కోసం కేంద్రం వాటా కింద ఇచ్చిన రూ.4,350 కోట్లనూ గత ప్రభుత్వం దారి మళ్లించిందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. గురువారం అసెంబ్లీలో ధూళిపాళ్ల నరేంద్ర, కూన రవికుమార్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర, రాష్ట్ర వాటా కింద ఇవ్వాల్సిన నిధులు మొత్తం రూ.7,230 కోట్ల బకాయిలు విడుదల చేశామన్నారు. నిలిచిన కేంద్ర పథకాలు తిరిగి ప్రారంభించేందుకు 4వేల కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు. కేంద్రం వాటా ఇచ్చినా మనం వేయకపోవడంతో పెనాల్టీలు విధించిందని అవి దాదాపు 350కోట్లు ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని కేంద్రంతో చర్చలు జరుపుతున్నామన్నారు.

భారతి సిమెంట్ పెట్టుబడులు పెడతామన్నా ఆహ్వానిస్తాం

రాష్ట్రాభివృద్ధి.. ఉద్యోగ కల్పనే లక్ష్యం

- పెట్టుబడిదారులను తరిమేయడం మా విధానం కాదు: పయ్యావుల
- మీ ప్రభుత్వం వచ్చాకే జేఎస్‌డబ్ల్యూ వెళ్లిపోయింది
- మా హయాంలో 1 లక్ష 70 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చాం: బొత్స

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎంవోయూలపై శాసనమండలిలో గురువారం అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడీగా చర్చ జరిగింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం జరిగింది. మంత్రి కేశవ్ మాట్లాడుతూ దావోస్‌లో మూడు రోజుల్లో 67 కంపెనీల సీఈవోలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారన్నారు. సీఎం చర్చించిన వాటిలో ఇప్పటికే మూడు ప్రాజెక్టుల డీపీఆర్‌లు వచ్చాయన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చిన వారికి కూటమి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. వైఎస్ జగన్ వచ్చి భారతి సిమెంట్స్ కంపెనీ లేదా మరొకటి పెడతామన్నా ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. సంస్థలతో అగ్రిమెంట్లు చేయడంతో వదిలేయడంలేదని, పరిశ్రమలు పెట్టి.. ఉద్యోగాలిచ్చే వరకు శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వంలో అమర్ రాజా సంస్థ రాష్ట్రం నుంచి తరలిపోయిందన్నారు. సాఫ్ట్‌వేర్ సంస్థలే కాదు.. అండర్‌వేర్ కంపెనీలను కూడా వేధించడంతో రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయన్నారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక జేఎస్‌డబ్ల్యూ సంస్థ రాష్ట్రం నుంచి వెళ్లిపోయిందన్నారు. గత ఐదేళ్లలో వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలపై చర్చకు తాము సిద్ధమని చెప్పారు. రాష్ట్రం నుంచి జిందాల్ ఎందుకు వెళ్లిందో అందరికీ తెలుసన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేశాం

- వర్గీకరణ కమిషన్ నివేదికపై ప్రకటన మాత్రమే చేశారు: బొత్స

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి ప్రయత్నం చేశామని మండలిలో వైసీపీ పక్షనేత బొత్స సత్యనారాయణ చెప్పారు. గురువారం మండలి నిరవధిక వాయిదా పడిన తర్వాత వైసీపీ ఎమ్మెల్సీలతో కలిసి, ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రధాన ప్రతిపక్షంగా మేం సమస్యలను ప్రస్తావిస్తే... ప్రభుత్వం మార్షల్స్‌ను పిలిచి మమ్మల్ని బయటకి పంపించాలని చూసింది. 15 రోజుల సభలో ప్రభుత్వ తీరును ఖండిస్తున్నాం. అధికారం కోసం కూటమి నేతలు ప్రకటించిన 'సూపర్ సిక్స్'కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదు. జనం ఓట్లేశారు... మేం గెలిచాం... దోచుకుందాం... అనే భావనే వారిలో కనిపిస్తోంది. రాబోయే రోజుల్లోనైనా హామీలు నెరవేర్చి, ప్రజలకు మంచి చేస్తారని ఆశిస్తున్నాం. ఎస్సీ వర్గీకరణ కమిషన్ రిపోర్ట్‌పై చర్చ పెట్టకుండా, మండలిలో ప్రకటన మాత్రమే చేశారు. గతంలో వర్గీకరణ కోసం పోరాడిన వారిపై టీడీపీ ప్రభుత్వం కేసులు పెట్టింది. ఆ కేసుల్ని జగన్మోహన్‌రెడ్డి ఎత్తేశారు. జగన్ దళిత వర్గాలను గౌరవించారు. పదవుల్లో సమన్యాయం చేశారు' అని బొత్స అన్నారు. 'వచ్చే సమావేశాలకైనా జగన్ సభకు వస్తారా?' అని ప్రశ్నించగా... అడిగి చెప్తానని బొత్స బదులిచ్చారు. కాగా పలువురు వైసీపీ ఎమ్మెల్సీలు ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

ఎమ్మెల్సీలను అభినందించిన సీఎం

శాసనమండలి సభ్యులుగా పదవీకాలం పూర్తి చేసుకున్న టీడీపీ ఎమ్మెల్సీలు పరచూరి అశోక్‌బాబు, దువ్వారపు రామారావులను సీఎం చంద్రబాబు శాలువా కప్పి సన్మానించారు. 'సభలో వారు హుందాగా వ్యవహరించి ప్రజా సమస్యలపై పోరాడారు' అని సీఎం వ్యాఖ్యానించారు.

ఐదు అసెంబ్లీ కమిటీల ఏర్పాటు

ఐదు అసెంబ్లీ కమిటీల ఏర్పాటుకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆమోదం తెలిపారు. ప్రతి కమిటీలో ఛైర్మన్, ఆరుగురు సభ్యులు ఉంటారు. స్పీకర్ ఛైర్మన్‌గా నిబంధనల కమిటీ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఛైర్మన్‌గా వినతుల కమిటీ, కామినేని శ్రీనివాస్ ఛైర్మన్‌గా ప్రభుత్వ హామీల కమిటీ, మండలి బుద్ధ ప్రసాద్ ఛైర్మన్‌గా నైతిక విలువల కమిటీ, పితాని సత్యనారాయణ ఛైర్మన్‌గా ప్రివిలేజెస్ కమిటీని నియమించారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం: గొట్టిపాటి

రాష్ట్రంలో కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గురువారం అసెంబ్లీలో బత్తుల బలరామకృష్ణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. త్వరలోనే వ్యవసాయ అవసరాలకు ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తామన్నారు.

సీజీఎఫ్ నిధులు ఇచ్చేశారు: ఆనం

రాష్ట్రంలో దేవాలయాల నిర్వహణపై శాసనమండలిలో టీడీపీ సభ్యులడిగిన ప్రశ్నకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమాధానం చెప్పారు. ప్రైవేటు సంస్థలు నిర్వహించే ఆలయాలకు సర్వశ్రేయోనిధి (సీజీఎఫ్) కింద నిధులు ఇవ్వకూడదన్నారు. అయితే గత ఐదేళ్లలో రాష్ట్రంలోని 88 దేవాలయాలకు ఈ నిధులు ఇచ్చారని తెలిపారు. పులివెందులలో 40 ప్రైవేటు ఆలయాలకు నిధులు ఇచ్చారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఆలయాలకు రూ.27 కోట్లు సీజీఎఫ్ నుంచి నిధులు మంజూరు చేశారని, ఇలా ఇవ్వడాన్ని నిలిపివేస్తున్నామని అన్నారు.

ఆస్పత్రుల నిర్మాణం నాడు గాలికి: సత్య

రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునికీకరణను కొనసాగిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మండలిలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం నాడు నేడు కింద రూ.14,106 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా రూ.2,445 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కాగా, రాష్ట్రంలోని ప్రతి మూడు జిల్లాలకొక క్రీడా పాఠశాల నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు.

దొంగల్లా వచ్చి వెళ్తున్నారు..!

వైసీపీ ఎమ్మెల్యేలపై స్పీకర్ ఆగ్రహం

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొంత మంది సభ్యులు ఎవరికీ కనిపించకుండా అసెంబ్లీకి వచ్చి హాజరుపట్టికలో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వైసీపీ ఎమ్మెల్యేలపై మండిపడ్డారు. 'దొంగల్లా వచ్చి వెళ్తున్నారు. మిమ్మల్ని ప్రజలెన్నుకున్నారు.. మీరంతా ఎమ్మెల్యేలు. దొంగల్లా వచ్చి సంతకాలు పెట్టాల్సిన కర్మ ఏమొచ్చింది? గౌరవప్రదమైన ఎమ్మెల్యే స్థానంలో ఉండి ఇలా చేయడం కరెక్టు కాదు. హాజరు పట్టికలో సంతకం చేసి సభకు ముఖం చాటేయడం వారి గౌరవాన్ని తగ్గించింది తప్ప పెంచలేదు' అని అన్నారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యులు బాలనాగిరెడ్డి, బి.విరూపాక్షి కర్నూలులో గ్రీన్‌కో ప్రాజెక్టుపై అడిగిన ప్రశ్న వచ్చింది. ఈ ప్రశ్నకు జవాబు చెప్పినట్లుగా (డీమ్డ్ టూ బీ ఆన్సర్) స్పీకర్ ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం నుంచీ వైసీపీ సభ్యుల నుంచి వస్తున్న ప్రశ్నలకు ఆయన అలాగే ప్రకటిస్తున్నారు. గురువారం మాత్రం సీరియస్ అయ్యారు. ప్రశ్నోత్తరాల మధ్యలో కీలకమైన విషయాన్ని సభ్యుల దృష్టికి తీసుకొస్తున్నట్లు సభలో ప్రకటించారు. 'ఈ సభలో మీ దృష్టికి ఒక విషయం తీసుకురావలసిన అవసరముంది. ఈ సమావేశాల్లో దురదృష్టవశాత్తు దాదాపు 25 ప్రశ్నలకు సభలో సమాధానాలు లభించలేదు. ప్రతిపక్షానికి చెందిన గౌరవ సభ్యులు ప్రశ్నలు వేస్తున్నారు. కానీ సభకు రావడం లేదు. వారు ప్రశ్నలు వేయడం వల్ల సభలో ఉన్న మరో ఇద్దరు సభ్యులకు మాట్లాడే అవకాశం పోతోంది. సభకు ఎన్నికైన సభ్యులు సగౌరవంగా సభకు రావాలి. అసెంబ్లీకి వెళ్లి మా సమస్యలపై మాట్లాడమని ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నారు' అని చెప్పారు. ఇదే సమయంలో ఎవరికీ కనిపించకుండా కొంత మంది సభ్యులు అసెంబ్లీకి వచ్చి హాజరుపట్టికలో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని తెలిపారు. వీరిలో ముఖ్యంగా వై.బాలనాగిరెడ్డి (మంత్రాలయం), తాటిపర్తి చంద్రశేఖర్ (యర్రగొండపాలెం), వేగం మత్స్యలింగం (అరకు), బి.వి రూపాక్షి (ఆలూరు), విశ్వేశ్వర రాజు(పాడేరు), అమరనాథ్‌రెడ్డి (రాజంపేట), దాసరి సుధ (బద్వేలు) ఉన్నారని.. గత నెల 24న గవర్నర్ ప్రసంగం ముగిశాక.. వేర్వేరు తేదీల్లో హాజరుపట్టికలో వారు సంతకాలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. 'అంత దొంగచాటుగా వచ్చి దొంగల మాదిరిగా సంతకాలు చేయాల్సిన అవసరం లేదు. సంతకాలు చేసిన వారెవరూ సభలో నాకు కనిపించలేదు. ఇది ఎంత వరకూ సమంజసమో వారే నిర్ణయించుకోవాలి. ఎన్నుకున్న ప్రజలకు ఆదర్శప్రాయంగా నిలవాలే తప్ప.. ఓట్లేసినవారికి తలవంపులు తెచ్చేలా ప్రవర్తించకూడదు' అని హితవు పలికారు. అధికార పక్షం సభకు రానివ్వదని వైసీపీ ఎమ్మెల్యేలు భయపడ్డారా అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. జనసేన సభ్యుడు కొణతాల రామకృష్ణ స్పందిస్తూ.. ప్రజల సొమ్ము జీతంగా తీసుకుంటూ సభకు రాకుండా సంతకాలు పెట్టడంపై ఎథిక్స్ కమిటీకి నివేదించాలని కోరారు. దీనిపై ఆలోచించి రూల్స్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ చెప్పారు.

సంతకాలు చేసినవారిలో

వై.బాలనాగిరెడ్డి (మంత్రాలయం), తాటిపర్తి చంద్రశేఖర్ (యర్రగొండపాలెం), వేగం మత్స్యలింగం (అరకు), బి.విరూపాక్షి (ఆలూరు), విశ్వేశ్వరరాజు(పాడేరు), అమరనాథ్‌రెడ్డి (రాజంపేట), దాసరి సుధ (బద్వేలు)



రెండు నెలల్లో ఆయకట్టు సమస్యల పరిష్కారం

తోటపల్లి, గొట్టా బ్యారేజీ పనులు పూర్తి : నిమ్మల

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు సమస్యలను రెండు నెలల్లో పరిష్కరిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం అసెంబ్లీలో ఆయకట్టు స్థిరీకరణపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 4.02 కోట్ల ఎకరాల భూమి ఉంటే, 1.99 కోట్ల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉందని, దీనిలో 1.06 కోట్ల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని వివరించారు. మిగిలిన భూమికీ సాగు నీరు అందించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. 2018లో తోటపల్లి ప్రాజెక్టు ఆధునీకరణ పనులు చేపట్టి, రూ.41.22 కోట్ల పనులు పూర్తి చేశామన్నారు. గొట్టా బ్యారేజీ మరమ్మతులకు రూ.12.68 కోట్లు కేటాయించామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

నవ్వుల్... పువ్వుల్!



దుర్యోధనుడి వేషధారణలో ఏకపాత్రాభినయం ప్రదర్శిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ

- కామెడీ స్కిట్లతో అలరించిన ఎమ్మెల్యేలు
- పడీపడీ నవ్విన బాబు, పవన్
- సుయోధనుడిగా 'ఆర్‌ఆర్‌ఆర్' విశ్వరూపం
- బాలచంద్రుడిగా దుర్గేశ్ మెరుపులు
- కూటమి శాశ్వతంగా ఉండాలి: బాబు

విజయవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వాడి వేడి రాజకీయాలు, నియోజకవర్గ సమస్యలు, నిత్యం ఒత్తిళ్లతో సతమతసమయ్యే నేతలు మనసారా నవ్వుకున్నారు. బయట గంభీరంగా కనిపించే నాయకులే 'స్కిట్'లు వేసి కిలకిలా నవ్వించారు. 'నా జీవితంలో ఎప్పుడూ ఇంతగా నవ్వలేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే... 'గబ్బర్‌సింగ్ సీన్ గుర్తుకొచ్చింది' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పడీపడీ నవ్వేశారు. సుదీర్ఘంగా కొనసాగిన బడ్జెట్ సమావేశాలకు ఇలా హాయైన ముగింపునిచ్చారు. గురువారం సాయంత్రం విజయవాడలోని ఒక కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యేల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 'చేశాం అంటే చేశాం' అని కాకుండా... ఇందులో పాల్గొన్న వారంతా సిసలైన కళాకారుల్లా అలరించారు. నాటకంలోనూ ఎమ్మెల్యేగా నటించిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కార్యకర్తల డిమాండ్లు నెరవేర్చలేక, వారి బెదిరింపులతో తల పట్టుకునే సీన్లు పగలబడి నవ్వించాయి. మరీ ముఖ్యంగా ఇంటర్ ఫెయిల్ అయిన తన తమ్ముడికి ఇంజనీరింగ్ సీటు ఎందుకు ఇప్పించవు... అంటూ కార్యకర్త హోదాలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి నిలదీసిన వైనం అదిరిపోయింది. స్క్రిప్టులు సిద్ధంగా ఉన్నాయని... బాలకృష్ణ, పవన్ కల్యాణ్‌లను ఒప్పించాలని జీవీ ఆంజనేయులును కూన రవికుమార్ 'డిమాండ్' చేసే సీన్లూ హాస్యం పండించాయి. 'మా నియోజకవర్గ అమ్మాయికి మీ నియోజకవర్గ అబ్బాయితో పెళ్లయింది. కాపురానికి మాత్రం రానంటున్నాడు. మీరే నైతిక బాధ్యత తీసుకుని అతడిని పంపించాలి' అంటూ జీవీని విష్ణుకుమార్ రాజు కోరే తీరూ నవ్వులు పూయించింది. ఇక... ఎక్కడికి వెళితే అక్కడ 'అసందర్భపు పాట'లు పాడి దెబ్బలు తినే పాత్రలో బీజేపీ ఎమ్మెల్యే ఈశ్వరరావు, ఆయనను భరించే ఎమ్మెల్యేగా విజయ్ కుమార్ (జనసేన) కడుపుబ్బా నవ్వించారు. 'మన కురువంశము ఏనాడో కులహీనమ్మైనది' అంటూ సుయోధనుడి పాత్రలో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు అదరగొట్టారు. పల్నాటి బాలచంద్రుడి పాత్రలో మంత్రి కందుల దుర్గేశ్ చమక్కుమనిపించారు. వీరితోపాటు పలువురు ఎమ్మెల్యేలు తమ ప్రతిభను చాటుకున్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మంత్రి లోకేశ్ తదితరులు

నవ్వులే నవ్వులు...

ఎమ్మెల్యేల స్కిట్‌లు నడుస్తున్నంత సేపూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ నవ్వు ఆపుకోలేకపోయారు. 'అసందర్భపు పాట' స్కిట్ చూస్తున్నంత సేపు నవ్వుతూనే ఉన్నానని సీఎం చెప్పారు. ఈ స్కిట్‌లోని 'రాలిపోయే పువ్వా' పాట తనకు గుండెల్లో ఉంటుందని పవన్ వ్యాఖ్యానించారు. సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతున్నప్పుడు చంద్రబాబు పగలబడి నవ్విన వీడియోను ఆయన సతీమణి భువనేశ్వరికి చూపించాలని మంత్రి లోకేశ్‌కు పయ్యావుల సూచించారు.

కూటమి శాశ్వతంగా ఉండాలి: చంద్రబాబు

కూటమి శాశ్వతంగా ఉండాలని... ప్రస్తుత ఎమ్మెల్యేలంతా శాశ్వతంగా కొనసాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. మూడ్రోజుల పాటు జరిగిన ప్రజాప్రతినిధుల క్రీడా, సాంస్కృతిక పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు ఆయన బహుమతులు అందించారు. క్రీడల్లో ఉన్న పోటీతత్వం ప్రజాసమస్యలపై అధికార, ప్రతిపక్షాలకు ఉండాలని చెప్పారు. సభ నుంచి బయటకు వచ్చిన తర్వాత అధికార, ప్రతిపక్షం అన్న వ్యత్యాసం లేకుండా సరదాగా మాట్లాడుకోవాలని చెప్పారు. దురదృష్టవశాత్తూ రాష్ట్రంలో రాజకీయాలు కలుషితమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'మర్రి చెన్నారెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న నేను.. ఓ సమస్య తీవ్రతను తెలియజేయడానికి బల్లగుద్ది మాట్లాడాను. ఎందుకు బల్ల గుద్దుతున్నావు... ఏమనుకుంటున్నావని చెన్నారెడ్డి అన్నారు. ఒకసారి కాదు పది సార్లు గుద్దుతానని చెప్పి బల్లపై కొట్టాను. ఆయన ఏమీ మాట్లాడలేదు. ప్రజాసమస్యలపై సభలో చర్చకు ఇదొక స్ఫూర్తి' అని వ్యాఖ్యానించారు.

15ఏళ్లు కూటమి సర్కార్: పవన్

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యేలంటే వ్యక్తిగత కక్షలు, గొడవలు అన్న సంస్కృతిని చూశామని.. దానిని కూటమి ప్రభుత్వం మార్చుతోందన్నారు. ఆనందాన్ని పంచే ప్రభుత్వం వచ్చిందని ప్రజలు అనుకునే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కూటమి 15 ఏళ్ల అధికారంలో ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేల స్కిట్లు చూసిన తర్వాత గబ్బర్‌సింగ్ చిత్రంలో పోలీస్ స్టేషన్ సన్నివేశం తనకు గుర్తుకొచ్చిందన్నారు. ఇంటికి వెళ్లినా కొన్ని రోజులపాటు నవ్వుకుంటానని చెప్పారు. వచ్చే ఏడాది నిర్వహించే క్రీడల పోటీల్లో పాల్గొనడానికి ప్రయత్నిస్తానన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడా, సాంస్కృతిక పోటీలను ప్రతి ఏటా నిర్వహిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఈ పోటీలను ప్రారంభించారని.. అప్పటి నుంచి ఇదొక సాంప్రదాయంగా వస్తోందన్నారు. మధ్యలో కొన్ని సంవత్సరాలు అంతరాయం కలిగిందని.. ఇక నుంచి ప్రతి ఏడాదీ పోటీలను నిర్వహిస్తామన్నారు.

రిజర్వ్‌డ్ అనుకున్నా..

తాను చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటానని అనుకునేవాడినని, ఎమ్మెల్యేల సాంస్కృతిక ప్రదర్శనలు చూసిన తర్వాత నవ్వు ఆపుకోలేకపోయానని సీఎం చెప్పారు. 'ఎమ్మెల్యేలు పాల్గొన్న వీడియోలు చూస్తే ఒలింపిక్స్‌కు వెళ్తున్నారా అన్న సందేహం కలిగింది. ఈ క్రీడల ద్వారా ప్రజల్లో క్రీడాస్ఫూర్తిని రగిల్చారు. మహిళా ఎమ్మెల్యేలు క్రీడల్లో బాగా పోటీపడినా, వినోదంలో తగ్గారు. వచ్చే ఏడాది నిర్వహించే పోటీల్లో వారు వినోద కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి. ఎమ్మెల్యేలు ప్రదర్శించిన స్కిట్లను చూసిన తర్వాత ఎంతో ఆనందం కలిగింది. పవన్ కల్యాణ్ తన చిత్రాల్లోనూ ఇంతటి వినోదాన్ని ఆస్వాదించి ఉండరు. భవిష్యత్‌కు సంబంధించిన సందేశాలను ఎమ్మెల్యేలు స్కిట్ల ద్వారా హాస్యాన్ని జోడించి ప్రజల్లోకి తీసుకెళ్లారు' అని అభినందించారు. ప్రజలంతా ఇలా ఆనందంగా ఉంటే రాష్ట్రంలో ఆస్పత్రులు అక్కర్లేదని చమత్కరించారు. వైద్య ఆరోగ్య శాఖ కేటాయింపుల్లో కోత విధించి సాంస్కృతిక, క్రీడారంగాలకు బడ్జెట్ పెంచాలని నవ్వుతూ ఆర్థిక మంత్రి పయ్యావులకు సూచించారు.



పల్నాటి బ్రహ్మనాయుడి కుమారుడు బాలచంద్రుడు పాత్రలో ఏకపాత్రాభినయం చేస్తున్న మంత్రి కందుల దుర్గేశ్

ఏకపాత్రాభినయంలో రఘురామ ఫస్ట్

వివిధ క్రీడల్లో విజేతలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బహుమతి ప్రదానం చేశారు. ఏకపాత్రాభినయంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ప్రథమ బహుమతి, మంత్రి కందుల దుర్గేశ్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. స్కిట్లలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు జట్టు ప్రదర్శించిన 'ఇదీ సంగతి' ప్రథమ, ఈశ్వరరావు, విజయ్‌కుమార్ ప్రదర్శించిన 'అసందర్భపు పాట' ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి.

బెయిల్‌కు వంశీ అనర్హుడు

- బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు
- విజయవాడ కోర్టులో సీనియర్ న్యాయవాది పోసాని వాదనలు



విజయవాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి బెయిల్ పొందే అర్హత లేదని, ఒక నేరం నుంచి బయట పడడానికి మరో నేరం చేశారని సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు కోర్టుకు తెలిపారు. ఆయన బయటకు వస్తే బాధితుడు ముదునూరి సత్యవర్ధన్‌కు ప్రాణహాని ఉంటుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సాక్షులనూ ప్రభావితం చేస్తారని, ఆధారాలను తారుమారు చేస్తారని చెప్పారు. విజయవాడ జిల్లా జైలులో ఉన్న వల్లభనేని వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై స్థానిక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో గురువారం వాదనలు జరిగాయి. ప్రాసిక్యూషన్ తరఫున పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ నిందితుడని, ఇదే కేసులో మరో నిందితుడికి హైకోర్టు ముందస్తు బెయిల్ తిరస్కరించిందని, వంశీ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ఇటీవల తోసిపుచ్చిందని చెప్పారు. ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను వంశీ బెదిరించారని, ఒక కేసు నుంచి బయటపడడం కోసం మరో నేరం చేశారని తెలిపారు. అట్రాసిటీ కేసుల్లో బెయిల్ కోసం స్థానిక కోర్టులను ఆశ్రయించిన తర్వాత హైకోర్టుకు వెళ్లాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, దీనికి విరుద్ధంగా వంశీ ముందుగా హైకోర్టుకు వెళ్లిన తర్వాత ఈ కోర్టుకు వచ్చారని వివరించారు. వాదనల అనంతరం విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్టు న్యాయాధికారి హిమబిందు తెలిపారు. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణను సీఐడీ కోర్టు ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయాధికారి తిరుమలరావు ఆదేశాలు ఇచ్చారు.

మూడు రోజులు పోలీసు కస్టడీకి వంశీ

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీని మరోసారి మూడు రోజుల పోలీసు కస్టడీకి ఇస్తూ విజయవాడ సీఐడీ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే మూడు రోజులపాటు కస్టడీకి తీసుకుని విచారించారు.

మద్యం కేసులో అరెస్టు నుంచి రక్షణకు నో

- ఎంపీ మిథున్‌రెడ్డి అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్ పార్లమెంట్ సమావేశాలకు హాజరు కావాల్సి ఉందని, ఆయన్ను ఏ నిమిషంలోనైనా సీఐడీ పోలీసులు అరెస్టు చేసే ప్రమాదం ఉందని, మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని, విచారణను వాయిదా వేయాలని సీఐడీ తరఫున పీపీ మెండ లక్ష్మీనారాయణ కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

మా ముందు హాజరై వివరణ ఇవ్వండి

- కోర్టు ధిక్కరణ కేసులో తహశీల్దార్ వనజాక్షికి హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం అప్పటి తహశీల్దార్ వనజాక్షిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. విచారణను 4వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. గోపాలపురం మండలం, భీమోలులోని 359 ఎకరాలను వివాద రిజిస్టర్‌లో చేర్చాలని గత ఏడాది మార్చి 12న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తహశీల్దార్ అమలు చేయకుండా ధిక్కరణకు పాల్పడ్డారంటూ కరిబండి సూర్యకుమారి, పోతిరెడ్డి వీరరాఘవమ్మ వేసిన పిటిషన్ గురువారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ల న్యాయవాది పి.నాగేందర్ రెడ్డి వాదనలు వినిపించారు. తహశీల్దార్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించాలని కోరారు.

సారు.. దోచిపెట్టారు

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించింది. ఇందులో అవినీతి వ్యవహారాలు ముడిపడి ఉండటంతో ఆ కేసును ఏసీబీ విచారించనుంది. విజయ్‌కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేసి, విచారణకు రావాల్సిందిగా ఏసీబీ నోటీసు జారీ చేసింది.

తీవ్ర ఆరోపణలు: గత ప్రభుత్వంలో ప్రకటనల జారీ విషయంలో సమాచారశాఖ కమిషనర్‌గా విజయ్‌కుమార్ రెడ్డి పత్రికల సర్క్యులేషన్‌ను పట్టించుకోలేదు. టీవీ చానళ్ల ప్రేక్షకాదరణ చూడలేదు. పథకాల పేరిట జగన్ బటన్ నొక్కిన ప్రతిసారి ఆయన భార్య భారతి యజమానిగా ఉన్న సొంత మీడియాకు ప్రకటన రూపంలో కోట్లాది రూపాయలు కుమ్మరించారు. రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టారు. వైసీపీ సోషల్ మీడియాకు హెడ్‌గా వ్యవహరించిన గుర్రంపాటి దేవేందర్‌రెడ్డికి రూ.కోట్లు చెల్లించేశారు. ఈ బాగోతంపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ విచారణకు కూటమి సర్కార్ ఆదేశించింది. ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్ అవినీతి, అక్రమాలు, ఉల్లంఘనలపై విజిలెన్స్ అధికారులు కూపీ లాగారు. జగన్ పత్రిక, టీవీకి దోచిపెట్టిన వైనంతో పాటు ఆంధ్రజ్యోతి, ఈనాడు లాంటి పత్రికలకు ఏ విధంగా అన్యాయం చేశారో తేల్చింది. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆగస్టులో ప్రాథమిక నివేదిక, జనవరి 22న పూర్తి స్థాయి నివేదిక ప్రభుత్వానికి సమర్పించింది.

ఎవరీ విజయ్‌కుమార్ రెడ్డి?

తెలంగాణకు చెందిన తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి కేంద్ర సర్వీసులోని ఐఐఎస్ అధికారి. సర్వీసులో ఎక్కువకాలం ఢిల్లీలో పనిచేశారు. 2019 ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్రలో పాల్గొన్నారు. అప్పుడే జగన్ పత్రికకు ఖజానా నుంచి ప్రజల సొమ్ము దోచిపెట్టేలా డీల్ కుదిరింది. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి ఆయన డిప్యుటేషన్‌పై వచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ సమాచారశాఖ కమిషనర్‌గా పనిచేశారు. నిబంధనలకు విరుద్ధంగా జగన్ మీడియాకు భారీగా దోచిపెట్టారు. కూటమి ప్రభుత్వంలో తన అక్రమాలపై విచారణ జరుపుతారనే భయంతో మళ్లీ మాతృసంస్థ (ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో)కు వెళ్లిపోయారు. ప్రస్తుతం కోల్‌కతాలో పనిచేస్తున్నారు.

ఔట్ డోర్ ప్రకటనల్లోనూ అక్రమాలు

వైసీపీ హయాంలో ఔట్ డోర్ ప్రకటనల విషయంలోనూ భారీగా అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ నివేదికలో పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘిస్తూ విజయవాడకు చెందిన ప్రకాశ్ ఆర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, వలయం క్రియేషన్స్, ఆర్ఎం అసోసియేట్స్‌కు 61% బిల్లులు మంజూరు చేసినట్లు గుర్తించింది. సాక్షి గ్రూప్, వైసీపీ మీడియా సెల్‌కు చెందినవారిని ప్రభుత్వ ఉద్యోగాల్లో చూపించి జీతాలు చెల్లించినట్లు వెల్లడించింది.

పీఆర్‌వోలుగా సాక్షి ఉద్యోగులు

జగన్ సొంత మీడియాలో పనిచేసిన 142 మందిని నిబంధనలకు విరుద్ధంగా కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ పేరుతో పీఆర్‌వోలుగా తీసుకున్నట్లు విజిలెన్స్ తేల్చింది. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్లుగా 50మందిని ఐ అండ్ పీఆర్ నియమించుకుంది. జగన్ పార్టీ సోషల్ మీడియా హెడ్‌గా వ్యవహరించిన దేవేందర్ రెడ్డికి డిజిటల్ కార్పొరేషన్‌లో ఉద్యోగం ఇచ్చి, రూ.2.63కోట్ల వేతనం చెల్లించారు. మరో 113మంది వైసీపీ, సాక్షిబ్యాచ్‌కు ప్రజల సొమ్ము జీతంగా చెల్లించారు. కంటెంట్‌డెవలపర్స్, సోషల్ మీడియా అనలిస్టులు, డిజిటల్ క్యాంపెయినర్లు పోస్టులను ఆప్కోస్ ద్వారా భర్తీచేసి వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు పెద్దపీట వేశారు. ఈ నియామకాల్లో నిబంధనలు పాటించకుండా అన్నీ బ్యాక్‌డోర్ ద్వారా చేపట్టారు.

ఆంధ్రజ్యోతి, ఈనాడుపై తప్పుడు కేసులు

గత ప్రభుత్వ పాలనలో తప్పులు ఎత్తి చూపుతూ వార్తలు ప్రచురించిన ఆంధ్రజ్యోతి, ఈనాడుపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధించినట్లు విజిలెన్స్ తేల్చింది. 2019లో 2430 జీవో తీసుకొచ్చి మీడియా సంస్థలతోపాటు పాత్రికేయులపై ప్రభుత్వ ప్రతినిధులు నేరపూరిత పరువు నష్టం కేసులు నమోదు చేసేందుకు వీలుగా మార్గదర్శకాలు ఇచ్చినట్లు వివరించింది. జగన్ ప్రభుత్వంలో ముఖ్యంగా ఆంధ్రజ్యోతి, ఈనాడుపై 16తప్పుడు కేసులు నమోదైనట్లు స్పష్టం చేసింది. అడుగడుగునా అక్రమాలకు పాల్పడిన విజయ్ కుమార్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ విజిలెన్స్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. విజయ్‌కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేసిన ఏసీబీ.. విచారణకు రావాలని నోటీసు పంపింది.

నివేదికలోని కీలకాంశాలు

- జగన్ సొంత మీడియాతో పాటు అనుకూల మీడియాకు ప్రకటనల రూపంలో కోట్లు కుమ్మరించారు. ఇతర పత్రికలను విస్మరించారు.
- ప్రకటనల విషయంలో విజయ్‌కుమార్ రెడ్డి ఆంధ్రజ్యోతికి పూర్తిగా, ఈనాడుకు పాక్షికంగా అన్యాయం చేశారు.
- రాష్ట్రంలో అత్యధిక సర్క్యులేషన్ గల ఈనాడుకు రూ243కోట్ల ప్రకటనలు జారీ చేశారు. రెండోస్థానంలో ఉన్న జగన్ మీడియాకు ఏకంగా రూ.371 కోట్ల ప్రకటనలు ఇవ్వడం దోపిడీకి నిదర్శనం.
- గత ఐదేళ్లలో ఆంధ్రజ్యోతికి జారీ చేసిన ప్రకటనల విలువ కేవలం రూ.27 లక్షలు. ఇదే సమయంలో ప్రకటనల కోసం చేసిన ఖర్చులో జగన్ మీడియాకు 43%, ఈనాడు 28%, ఆంధ్రజ్యోతికి 0.03% ఇచ్చారు.
- ఆంధ్రప్రభకు రూ.16.50కోట్లు, వార్తకు 15 కోట్లు, ప్రజాశక్తికి రూ.13.28 కోట్లు, విశాలాంధ్రకు రూ.2 కోట్ల ప్రకటనలు ఇచ్చారు. ఆంగ్ల పత్రికల్లో ది హిందూ, డెక్కన్ క్రానికల్‌కు కలిపి మొత్తం రూ.98 కోట్లు విలువైన ప్రకటనలు జారీ అయ్యాయి.
- అత్యధిక సర్క్యులేషన్ ఉన్న ఈనాడు ప్రకటనల ధరలు పెంచబోమంటూ 2019లో తిరస్కరించిన సమాచార శాఖ.. సాక్షికి మాత్రం 60 శాతం అధికంగా పెంచింది.
- సుప్రీం మార్గదర్శకాలుపాటిస్తూ రాజకీయ పార్టీలకు అనుకూల పత్రికలు, మీడియా కు ప్రభుత్వ నిధులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.